ఆంధ్రప్రభ

Estd 1938

www prabhanews com

Journalism first!



పంజాబ్ వర్శిటీ 67వ స్నాతకోత్సవంలో ఆదివారం సుప్రీంకోర్టు మాజీ సీజే జగదీష్‌సింగ్ కేహార్‌కు ఉప రాష్ట్రపతి వెంకయ్య డాక్టరేట్ ప్రదానం

నేటి మీ కపిల్ చిట్స్‌తో సభ్యత్వం
ఓ మంచి ఆర్థిక నేస్తంతో బంధుత్వం

KAPIL GROUP

Visit Us: www.kapilchits.com

38 Securing Your Future

కపిల్ చిట్స్

కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

సంపుటి: 62 • సంచిక: 54 •సోమవారం 5 మార్చి 2018 • విజయవాడ ❋ పేజీలు: 22 • వెల: 5.00 •Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: బహుళ చవితి రా. 2.55 వరకు; నక్షత్రం: చిత్త రా. 10.35 వరకు, అనంతరం స్వాతి; అమృతకాలం: మ. 4.00 నుండి 5.25 వరకు; వర్జ్యం: ఉ. శే. 7.55, తె. 4.20 నుండి 5.59 వరకు; దుర్ముహూర్తం: మ. 12.24 నుండి 1.12 వరకు, తదుపరి మ. 2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: ఉ. 7.30 నుండి 9.00 వరకు; యమగండం: ఉ. 10.30 నుండి 12.00 వరకు;



ఎలక్ట్రిక్ కారును పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

1 లక్ష ఈ-వాహనాలు ఉద్యోగాలు!

• రూ. 10వేల కోట్ల పెట్టుబడికి ఈఈఎస్ఎల్ అంగీకారం • రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల విధానానికి శ్రీకారం • ప్రపంచ రికార్డు సృష్టించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్ష

అమరావతి, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నూరు శాతం కాలుష్య రహిత, హరిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ విషయంలో దేశానికే ఆదర్శంగా నిలిచేలా రాష్ట్రంలో లక్ష ఎలక్ట్రిక్ వాహనాలను ప్రారంభించనుంది. ఈ వాహనాల వల్ల రాష్ట్రంలో భవిష్యత్‌లో 1.05 లక్షల ఉద్యోగాలు సృష్టించనుంది. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా లక్ష ఈ-వాహనాలను ప్రవేశపెట్టాలని ఏపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోవడాన్ని ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) కొనియాడింది. రాష్ట్రంలో ఈ-వాహనాల కోసం రూ.10,250 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు సుముఖత వ్యక్తం చేసింది. లక్ష ఈ-వాహనాల

➪ 7వ పేజీలో...

గవర్నర్ ప్రసంగంతో నేడు అసెంబ్లీ సమావేశాలకు శ్రీకారం

• వైకాపా ఈసారీ దూరం

అమరావతి, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఇందుకోసం రాష్ట్రప్రభుత్వం సర్వం సిద్ధమైంది. అన్ని ఏర్పాట్లు చేసింది. ఈసారి కూడా ప్రధాన ప్రతిపక్షం సమావేశాలకు వచ్చే పరిస్థితి లేకపోవడంతో అధికార పార్టీ ఎమ్మెల్యేలే ప్రధాన ప్రతిపక్ష పాత్రను కూడా పోషించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షులు ,ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పార్టీ ఎమ్మెల్యేలకు ఇప్పటికే హితబోధ చేశారు. ఆయా

➪ 2వ పేజీలో...

ఢిల్లీలో ఢీ!

నేటి నుంచి మళ్లీ పార్లమెంట్



• విభజన హామీల డిమాండ్లపై హోరెత్తనున్న ఉభయ సభలు • ఏపీ ఎంపీలకు తోడుగా గళం విప్పనున్న తెలంగాణ ఎంపీలు • నేడు జంతర్ మంతర్ వద్ద వైకాపా ధర్నా

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణంతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హెూదా నినాదాలతో పార్లమెంట్ మలి దశ బడ్జెట్ సమావేశాలు హోరెత్తనున్నాయి. నేటి నుంచి ప్రారంభమవుతున్న ఈ సమావేశాల కోసం అధికార, ప్రతిపక్ష పార్టీలు వ్యూహ, ప్రతివ్యూహాలను సిద్ధం చేసుకున్నాయి. అలాగే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తెలుగుదేశం, వైకాపాలు సైతం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలన్న డిమాండ్‌తో తమ ఆందోళన కొనసాగించనున్నాయి. వీరికి తోడుగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన తెరాస కూడా ఈసారి జతకలవనుంది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చే అంశంపై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర రావు మద్దతు తెలపడం ఒక ఎత్తయితే, తెలంగాణ రాష్ట్రం విషయంలో అమలు చేయాల్సిన విభజన హామీలపై ఉభయ సభల్లో పోరాట పంథా ఎంచుకోవాలని ఆ పార్టీ తాజాగా నిర్ణయించింది. దీంతో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎంపీలు నేటి నుంచి పార్లమెంటు ఉభయ సభల్లో తమ స్వరాన్ని పెంచి ఆందోళన తీవ్రతరం చేయనున్నారు. ఉభయ సభలు ప్రారంభమవడానికంటే ముందు పార్లమెంటు ఆవరణలోని మహాత్మ గాంధీ విగ్రహం ముందు తెలుగు రాష్ట్రాల ఎంపీలు నిరసన ప్రదర్శన

➪ 5వ పేజీలో...



జల జగడం!

పులివెందుల రణరంగం!

• టీడీపీ-వైసీపీ కార్యకర్తల మధ్య పరస్పరం రాళ్ల దాడులు
• ఎస్ఐ చిరంజీవికి గాయాలు... బాష్పగోళాల ప్రయోగం
• కడప ఎంపీ అవినాష్‌రెడ్డి పులివెందులలో హౌస్ అరెస్టు
• సతీష్‌రెడ్డిని వేంపల్లెలో హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

7 లో



2040 నాటికి స్మార్ట్ ఫోన్‌తో పర్యావరణం

• పరిశ్రమల నుంచి పెరుగుతున్న ఉద్గారాలు • అత్యధికంగా శక్తి వినియోగం • 2020 నాటికి ల్యాప్‌టాప్ కంటే ఫోన్ ప్రమాదకరం • మెక్‌మాస్టర్ యూనివర్శిటీ అధ్యయనం వెల్లడి

5

థర్డ్ ఫ్రంట్‌కు జనసేన మద్దతు



• 2019లో ప్రాంతీయ పార్టీలదే హవా • తృతీయ ప్రత్యామ్నాయం అవసరమే • కేసీఆర్ సమర్థుడు • ఆయన నేతృత్వంలో ముందుకు సాగేందుకు సిద్ధం • మీడియాతో పవన్ కల్యాణ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : దేశ రాజకీయాల్లో తృతీయ ప్రత్యామ్నాయం ఉండి తీరాల్సిందేనని, జాతీయస్థాయిలో కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీలకు ప్రత్యామ్నాయంగా ఒక కూటమిని ఏర్పాటు చేయాలన్న తెలంగాణ ముఖ్యమంత్రి చంద్ర శేఖరరావు ప్రతిపాదనకు తన పూర్తి మద్దతు ఉంటుందని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చెప్పారు. హింసకు తావులేకుండా దశాబ్దంన్నర కాలం కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధనకు ఉద్యమం సాగించారని ఆయన ఆదివారం జనసేన కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ చెప్పారు. తృతీయ ప్రత్యామ్నాయం ఏర్పాటు ఆలోచనా విధానం మంచిదని.. ఇది కచ్చితంగా అవసరమని, కొత్త రక్తం

➪ 3వ పేజీలో...

కేంద్ర పెత్తనంపై సమరం



నాడు ఎన్టీఆర్ నేడు కేసీఆర్!



• ఫెడరల్ వ్యవస్థకోసం పోరాటం • గులాబీ దళపతి ప్రకటనపై దేశవ్యాప్త మద్దతు • మోడీని ఢీకొట్టే ధీశాలిగా గుర్తింపు

(హైదరాబాద్, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

ఎన్‌డీఏ, యూపీఏలకు ప్రత్యామ్నాయ రాజకీయ కూటమిని రూపొందించనున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రకటన దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇది కేవలం ఢిల్లీపై రాజ్యాధికారం కోసం చేసిన ప్రకటన కాదు. ఢిల్లీ అధికారాన్ని కేసీఆర్ ప్రశ్నించారు. ఫెడరల్ వ్యవస్థను కేంద్రం నిర్వీర్యం చేస్తోందంటూ మండిపడ్డారు. రాష్ట్రాల హక్కుల్ని కేంద్రం కాలరాయడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోయారు. వాస్తవానికి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాల్లోనూ ఈ ఆవేదన ఉంది. అయితే అత్యధిక రాష్ట్రాలు ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాల ఏలుబడిలో ఉండడంతో కేంద్ర పెత్తనాన్ని నిలదీసేందుకు ఆయా రాష్ట్రాల పాలకులు ఎవరూ సాహసించలేకపోతున్నారు. కానీ కేసీఆర్ ఒక్కసారిగా ఈ ప్రతిపాదన తెరపైకి తేవడంతో ఇంతవరకు గంట ఎవరు కడతారా అని ఎదురుచూసిన వారంతా ఇప్పుడు తమకు తాముగా ముందుకొచ్చి ప్రత్యామ్నాయ వేదికలో పాలు పంచుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. బలమైన కేంద్రాన్ని ఎదిరించి నిలదీయడం తొలిసారి ఎన్‌టీఆర్ హయాంలోనే మొదలైంది. అంతకుముందెవరూ అంతటి సాహసానికి ఒడిగట్టలేదు. ఆ తర్వాత కూడా ఇప్పటివరకు అలాంటి ప్రయత్నాలు ఎవరూ చేయలేదు. అప్పట్లో ప్రపంచం చేత ఉక్కు మహిళగా పిలిపించుకున్న ఇందిరాగాంధీ

➪ 3వ పేజీలో...

వ్యవస్థ ప్రక్షాళనకు శంఖారావం

• నేనే సారథిని: కేసీఆర్

3

ఔరా..!



సబ్సిడీ కందిపప్పు ఏదీ?

• దేవుడు వరమిచ్చినా... కరుణించని పూజారి • కందిపప్పు పథకం ప్రారంభం నాటికి అందని ఆదేశాలు • ఎంఎల్ఎస్ పాయింట్లకు పూర్తిస్థాయిలో చేరని కందిపప్పు • పౌరసరఫరాలశాఖ ఉన్నతాధికారుల నిర్వాహకం



అమరావతి, ఆంధ్రప్రభ : దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదన్న చందాన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మార్కెట్లో కేజీ రూ.70 ఉన్న కందిపప్పును పేద వర్గాలకు సబ్సిడీపై 40లకు అందించాలనే సదాశయానికి ఉన్నతాధికారుల నిర్వాకం కారణంగా సకాలంలో తెల్ల కార్డుదారులకు సరఫరా కాలేదు. మార్చి ఒకటోతేదీ నుంచి రాష్ట్రంలోని అన్ని రేషన్ షాపుల్లో కిలో కందిపప్పు రూ.40లకు పంపిణీ చేయాల్సిందిగా సీఎం ఆదేశాలు జారీ చేశారు. గతేడాది ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన కందులను మిల్లింగ్ చేసి తద్వారా వచ్చిన కందిపప్పును

➪ 7వ పేజీలో...



కాసుల వర్షం కురిపిస్తున్న ఆవు పిడకలు

• నెలకు 25 లక్షలపైనే తయారీ • ఐదు జిల్లాల్లో మూడు కోట్ల ఉత్పత్తి • ఒక్కో ఫాం వార్షికాదాయం రూ.50 లక్షలు

8 లో

అరవింద్ లిమిటెడ్‌తో ఎంవోయూ



అమరావతి, ఆంధ్రప్రభ: చిత్తూరు జిల్లాలో ఇంటిగ్రేటెడ్ టెక్స్ టైల్స్ - అపెరల్ సదుపాయాలతో కూడిన వ్యవస్థను ఏర్పాటుచేయడానికి రాష్ట్ర ప్రభుత్వంతో అరవింద్ లిమిటెడ్ ఎంవోయూ కుదు ర్చుకుంది. ఈమేరకు ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో ఈడీబీతో ఎంవోయూ అరవింద్ మిల్స్ ఎండీ సంజయ్‌లాల్ భాయ్ చేసుకున్నారు. రూ. 250 నుండి రూ. 300 కోట్ల ప్రారంభ పెట్టుబడితో మొదటి దశ పనులు ప్రారంభించనున్నారు. ఈ పార్కు ఏర్పాటు పూర్తి అయితే 10 వేల మందికి ఉపాధి అవకాశాలు దక్కే అవకాశం ఉంది.

నేడు మంత్రివర్గ సమావేశం

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుండి ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. తొలుత ఉదయం 8 గంటలకు సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించనున్నారు. అనంతరం 8.15 గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్లో ఏపీ మంత్రివర్గ సమావేశం జరుగనుంది. గవర్నర్ ప్రసంగానికి మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. ఆ తరువాత ఉదయం 9.30 గంటలకు ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు.

గవర్నర్ ప్రసంగంతో నేడు అసెంబ్లీ సమావేశాలకు శ్రీకారం

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలు, ఇతర అంశాలు ప్రతిబింబించేలా శాసనసభ్యులు సభలో మాట్లాడాలని ముఖ్యమంత్రి వారిని ఆదేశించినట్లు సమాచారం. అయితే ఈసారి బీజేపీ కూడా ప్రతిపక్ష పాత్ర బాగానే పోషించేందుకు సర్వం సిద్ధమైందంటున్నారు. విభజన అంశాలపై టీడీపీ ఎంపీలు పార్లమెంట్‌లో పోరుకు సిద్ధమైన క్రమంలో ఇక్కడ బీజేపీ ఎమ్మెల్యేలు శాసనసభలో ధీటుగా కౌంటర్ ఇచ్చేందుకు సన్నద్ధమవుతున్నారు. రాష్ట్రానికి కేంద్రం ఏమేమి ఇచ్చిందో..ఇంకా ఏమి ఇవ్వాల్లో క ూడా అధికారపార్టీ ఎమ్మెల్యేలు పూర్తి స్థాయిలో సన్నద్ధమైన క్రమంలో బీజేపీ కూడా వాటిపై కసరత్తు పూర్తి చేసింది. కేంద్రం సాయం విషయంలోను, ఇతర విభజన హామీల విషయంలో బీజేపీ, టీడీపీ సభ్యుల మధ్య రసవత్తరమైన మాటల యుద్ధం నడిచే అవకాశం ఉందంటున్నారు. వీరిద్దరి మధ్య జరిగే చర్చ సభలో తప్పనిసరిగా వేడిపుట్టిస్తుందం టున్నారు. రాష్ట్ర గవర్నర్ నరసింహన్ ప్రసంగంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభవుతాయి. మంగళ, బుధవారాల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు గురువారం బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. అనంతరం కొనసాగింపుగా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత సభలో చర్చ జరుగుతుంది. ఈసారి సభలో రాష్ట్రానికి కేంద్ర సాయం అంశాలే ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశముంది. పోలవరం ప్రాజెక్టు, ఇతర సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పంటలకు గిట్టుబాటు ధరలు, వ్యవసాయర ంగంలో రాష్ట్రాని కి పెట్టుబడులు ఆకర్షణ, పరిశ్రమల రాక, వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం,పేదల గృహ నిర్మాణం, రోడ్డు ప్రమాదాలు, జన్మభూమి వినతులు, పరిష్కారం, రాయల సీమలో హైకోర్టు ఏర్పాటు అంశం, అమరావతి నిర్మాణం తదితర అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. వివిధ సంక్షేమ కార్యక్రమాలు పథకాలపై ప్రజలకు సవివరణ ఇచ్చేందుకు సమావేశాలను వినియోగించుకోవాలని అధికారపార్టీ భావిస్తోంది. అయితే ప్రతిపక్షం లేదు గదా అని మంత్రులు సరైన సమాచారం లేకుండా సమావేశాలకు వస్తే ఊరుకునేది లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతి అంశంపైనే పూర్తి సమాచారంతో వచ్చి సభలో మాట్లాడాలని సూచించారు. మార్చి నెలాఖరు వరకూ సమావేశాలు ఉంటాయని ప్రభుత్వం పేర్కొన్నది. ఈసారి మూడు రాజ్యసభ సభ్యుల స్థానాలకు ఎన్నికలు కూడా జరుగుతున్నాయి. ఒకవేళ పోటీ అనివార్యమైతే మార్చి 23న పోలింగ్ జరుగుతుంది. దీంతో ఎమ్మెల్యేలంతా హాజరై ఓటింగ్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. వైసీపీ కూడా రాజ్యసభ ఎన్నికల పోలింగ్ పాల్గొంటామని ప్రకటించిన సంగతి తెలిసిందే.

దేశానికే నమూనాగా రాష్ట్రం

● పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం ● హెల్త్ బులెటెన్, పలకరింపు కార్యక్రమాల ఆవిష్కరణలో సీఎం చంద్రబాబు

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడంతోపాటు దేశానికి ఒక నమూనాగా నిలిపే లక్ష్యంతో ప నిచేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. దేశంలో ఎక్కడాలేని సంస్కరణలను గడిచిన మూడున్నర సంవత్సరాల్లో వైద్య, ఆరోగ్యశాఖలో తీసుకొచ్చి పేదవారికి నాణ్యమైన వైద్యం అందిస్తున్నామన్నారు. ఆదివారం ఉండవల్లిలోని గ్రీవెన్స్‌హాల్‌లో రాష్ట్ర, జిల్లా, గ్రామీణ ఆరోగ్య బులెటన్‌తోపాటు చిన్నారుల ఆరోగ్యం కోసం పలకరింపు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయిదేళ్ల లోపు వయసున్న 50 లక్షల చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు పలకరింపు కార్యక్రమంతో శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమం ఈనెల 5 నుంచి 21 రోజులపాటు రాష్ట్రస్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలో ఉన్న ఒక కోటి 20 లక్షల ఇళ్లను 57వేల 555 బృందాలు చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తాయని వెల్లడించారు. ప్రతి నెల 4న ఈ కార్యక్రమంపై సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. దీని ద్వారా ప్రజలకు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన వైద్య సేవలను వివరించనున్నామన్నారు. ప్రతి చిన్నారికి తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలను అందించడంతోపాటు పోషకాహారం లోపం ఉన్నవారిని గుర్తించి తగిన జాగ్రత్తలు, సూచనలతోపాటు పౌష్టికాహారం అందిస్తామని చెప్పారు. పుట్టుకతోపాటు వచ్చిన లోపాలను గుర్తించి, వారికి అవసరమైన వైద్య చికిత్సలు అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. బరువు తక్కువగా పుట్టిన పి ల్లలను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసిన తర్వాత తీసుకోవల్సిన సలహాలు ప్రభుత్వపరంగా అందిస్తామని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ప్రతి వ్యక్తి ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. గతంలో తాను పాదయాత్ర చేసిన సందర్భంలో గ్రామాల్లో మరుగుదొడ్లు సరిగా లేక గ్రామ శివార్లు బహిర్భూములుగా వినియోగించే వారని, దీనితో చాలా ఇబ్బందికరమైన పరిస్థితి ఉండేదని అన్నారు. గడిచిన మూడున్నర ఏళ్లుగా రాష్ట్రాన్ని ఓడిఎఫ్‌గా రూపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ నెలాఖరుకల్లా పూర్తిస్థాయిలో ఓడిఎఫ్‌గా ప్రకటించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్‌తో రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడిందన్నారు. సెల్‌ఫోన్ కన్నా మరుగుదొడ్లకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరముందన్నారు.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే

ప్రతి వ్యక్తి ఆరోగ్యం వారివారి చేతుల్లోనే ఆధారపడి ఉంటుందని, బ్యాలెన్స్‌డ్ డైట్‌ను తీసుకోవల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఒకప్పుడు పండ్లు, కూరగాయల వినియోగం తక్కువగా ఉండేవని, రాగులు, గొడ్డుకారాన్ని ఆహారంగా తీసుకునేవారని చెప్పారు. ప్రస్తుతం డబుల్ పాలిష్ చేసిన



బియ్యం తీసుకోవడం వల్ల పోషకాలు లోపిస్తున్నాయన్నారు. తినే తిండి, పెరిగే వాతావరణంపై ఆరోగ్యం ఆధారపడి ఉంటుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు, రాష్ట్రప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం 28 వినూత్న వైద్య కార్యక్రమాలను తీసుకొచ్చిందన్నారు. అదే విధంగా మరికొద్ది రోజుల్లోనే రాష్ట్రంలోని ప్రతి వ్యక్తి ఆరోగ్య రికార్డులను డిజిటలైజేషన్ చేస్తామన్నారు. దీనికి ఆధార్ అనుసంధానం చేయడం వల్ల భవిష్యత్‌లో ప్రతి వ్యక్తి హెల్త్ ప్రొఫైల్ అందుబాటులోకి వస్తుందని, దీని వల్ల మెరుగైన వైద్యం అందించగలమని అన్నారు.

ఇప్పటికే 13 జిల్లాల్లో మెరుగైన వైద్య సేవలను ప్రజలకు అందిస్తున్నామని, అంతేకాకుండా ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై రాష్ట్ర, జిల్లా, గ్రామ స్థాయి నివేదికలు రూపొందించామన్నారు. సమస్య లతోపాటు వాటి మూలాలను కూడా సమగ్రంగా విశ్లేషించి, వాటిని పరిష్కరించేదిశగా కృషి చేస్తున్నామని చెప్పారు. గ్రామ స్థాయిలో పనిచేసే ఉద్యోగులు, సామాజిక కార్యకర్తలు, పంచాయతీ సభ్యులు ప్రతి నెలా తమ తమ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై సమగ సమావేశాన్ని నిర్వహించుకోవాలని కోరారు. మంచి అలవాట్లపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగం తీసుకోవాలన్నారు. ఉద్దానం కిడ్నీ వ్యాధిగ్రస్తుల సమస్యపై ముఖ్యమంత్రి స్పందిస్తూ అమె రికా వైద్య బృందం విశాఖపట్నం కేంద్రంగా ఈ వ్యాధి మూలాలపై పరిశోధనలు చేస్తోందని తెలి పారు. ప్రతి జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలకు అవసరమైన సూచనలను కూడా ఆయా జిల్లాల యంత్రాంగానికి పంపిందన్నారు.

డాక్టర్లకు చురకలు

ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డాక్టర్లకు చురకలు అంటించారు. డాక్టర్లు చాలా తెలివైనవారమని అనుకుంటూ ఉంటారని, అయితే రోగుల కన్నా వారే అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. రోజంతా కష్టపడి పనిచేసేవారు ఒక అరగంట వ్యాయామం కూడా చేయకపోవడం బాధాకరమన్నారు. ఆరోగ్య సూత్రాలు తెలిసి కూడా కనీస జాగ్రత్తలు పాటించడం లేదని వ్యాఖ్యానించారు. ప్రతి వ్యక్తి ఏదో ఒక పని బిజీగా ఉన్నప్పటికీ ఒక అరగంట వ్యాయామం చేస్తే చాలా వరకు ఆరోగ్య సమస్యలను నివారించవచ్చన్నారు. అందుకే తమ ప్రభుత్వం ప్రతి ఆదివారం హ్యాపీ సండే కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టిందన్నారు. ఏ వ్యక్తి అయినా మానసిక ఆనందం, ప్రశాంతత లభించినప్పుడే ఆరోగ్యంగా ఉంటారని అభిప్రాయం వ్యక్తం చేశారు. తాను ఆరోగ్యపరంగా అన్ని జాగ్రత్తలు పాటిస్తానని, పరిమితమైన ఆహారాన్ని తీసుకోవ డంతోపాటు ఎక్కువగా పనిచేసి, ఆనందం పొందుతానని తెలిపారు. ప్రతి వ్యక్తి తనకు నచ్చిన పనిని ఏదో ఒకటి చేసి, ఆనందంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖా మంత్రి కామినేని శ్రీనివాస్, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య, ఆరోగ్యశాఖ సంచాలకులు డాక్టర్ అరుణకుమారి, డీఎంఈ సుబ్బారావు, మున్సిపల్ శాఖ సంచాలకులు కె.కన్నబాబు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రోబోలతో పని చేయించుకునే పరిస్థితి వద్దు

జనాభా శాతం తగ్గిపోతున్న నేపథ్యంలో కొన్ని దేశాల్లో రోబోలుతో పనిచేయించుకుంటున్నారని, మనకు కూడా ఆ పరిస్థితి రాకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. గతంలో తాను జనాభా నియంత్రణ కోసం ఫ్యామిలీప్లానింగ్‌కు పిలుపునిచ్చానని, పదేళ్లలో ఎక్కడా లేని విధంగా జనాభా నియంత్రణ జరిగిందన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితిలో యువత శాతం గణనీయంగా తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

నిఘా నీడలో శాసనసభ సమావేశాలు

● బాడీవోర్న్ కెమెరాలతో అధికారులు ● 30, 144 సెక్షన్లు విధింపు ● గుర్తింపు కార్డులు ఉంటేనే లోనికి అనుమతి



(ఫైల్‌ఫొటో)

అమరావతి, ఆంధ్రప్రభ: పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సోమవారం ఏపీ శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. గత అనుభవాల నేపథ్యంలో గట్టి భద్రతా చర్యలను చేపట్టారు. ఇదే సమయంలో శాసనసభకు వెళ్లే వారికి ఏ విధమైన ఆటంకాలు లేకుండా పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. శాసనసభసమావేశాలు సజావుగా సా గందుకు వీలుగా పరిసర ప్రాంతాల్లో ఆందోళనలు, ఇతరత్రా కార్యక్రమాల నిర్వహణను అడ్డుకునేందుకు అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. మూడు రోజుల కిందట శాసనసభ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాద్ పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి భద్రతా పరంగా తీసుకోవాల్సిన పలు చర్యలను సూచించారు. స్పీకర్ ఆదేశాలను దృష్టిలో ఉంచుకొని భద్రతా ఏర్పాట్లపై అధికా రులు ప్రత్యేక దృష్టిసారించారు. సమావేశాల బందోబస్తుకు వెయ్యి మంది వరకు సిబ్బందిని వినియోగిస్తున్నారు. వీరిలో 500 మంది సిబ్బందిని శాసనసభకు వెళ్లే మార్గాల్లోని చెక్‌పాయింట్ల వద్ద నియ మించనున్నారు. ముఖ్యమంత్రి, స్పీకర్, మండలి ఛైర్మన్, ప్రతిపక్ష నేత సహా సభ్యులు వెళ్లేందుకు వేర్వేరు మార్గాలు ఏర్పాటు చేశారు. ఒకేసారి వచ్చినప్పటికీ ట్రాఫిక్ ఆటంకం లేకుండా నిలువరించేం దుకు హోదాల వారీగా ప్రత్యేక మార్గా లను ఏర్పాటు చేశారు. అసెంబ్లీకి సుమారు 10 మీటర్ల పరిధిలో సెక్షన్ 30 పోలీసు చట్టంతో పాటు సెక్షన్ 144 ఐపీసీని విధిస్తున్నారు. ఈ పరిధిలో ఏ విధమైన సభలు, సమావేశాలు, ప్రదర్శనలను అనుమ తించబోమని పోలీసు అధికారులు స్పష్టం చేస్తున్నారు. శాసనసభ పరిసర ప్రాంతాల్లో బాంబు స్క్వాడ్ తనిఖీలు చేప ట్టడంతో పాటు ప్రధాన ద్వారాల వద్ద విధులు నిర్వహించే అధికారులు బాడీవోర్న్ కెమెరాలు ధరించనున్నారు. సందర్శకులను నిశితంగా తనిఖీ చేసిన తర్వాతనే పరిమిత సంఖ్యలో లోనికి అనుమతించేందుకు పోలీసు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మీడియా సహా శాసనసభ ఆవరణలో విధులు నిర్వహించే ప్రతి ఒక్కరినీ గుర్తింపు కార్డులు సరిపోల్చుకున్న తర్వాతనే లోనికి అనుమతించాలని నిర్ణయించారు. శాసనసభ భద్రతా చర్యలపై డీజీపీ డాక్టర్ ఎం.మాలకొండయ్య అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. శాసనసభ భద్రతా చర్యలపై గుంటూరు అర్బన్, రూరల్ ఎస్పీలు అప్పలనాయుడు, విజయరావు సిబ్బందికి తగు సూచనలు చేశారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వేటు వేయండి

● వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి



అమరావతి, ఆంధ్రప్రభ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుర్తు పై గెలిచి తెలుగుదేశం పార్టీలోకి ఫిరాయించిన 23 మంది ఎమ్మెల్యేలపై కాలయాపన లేకుండా శాసనసభ స్పీకర్ వెంటనే అనర్హతవేటు వేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు కోరారు. స్పీకర్ రాజ్యాంగం నిర్దేశించిన విధంగా చర్య తీసు కుంటే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు వైసీపీ ఎమ్మెల్యేలు హాజరుకావాలని పార్టీ అధినేత జగన్ సూచించినట్లు వారు స్పష్టం చేశారు. విలేకరుల సమా వేశంలో విజయసాయిరెడ్డి మాట్లాడుతూ గుంటూరులో స్పీకర్‌ను కలిసి రెండు అంశాలపై ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. పార్టీ ఫిరాయించిన 23 మంది ఎమ్మెల్యేలపై కాలయాపన లేకుండా చర్యలు తీసుకోవాలని, అనర్హత పిటిషన్లు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నందున రాజ్యాంగంలో పేర్కొన్న విధంగా షెడ్యూల్ 10 ప్రకారం స్పీకర్ నిర్ణయం తీసుకోవాలి కాబట్టి, ఇప్పటికే అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేశామన్నారు. అదేవిధంగా భీమడోలు కోర్టు దెందులూరు శాసనసభ్యుడ్ని కన్విక్ట్ చేసిన నేపథ్యంలో అనర్హుడిగా ప్రకటించాలని స్పీకర్‌ను కోరినట్లు తెలిపారు. సుప్రీంకోర్టు లిల్లీ థామస్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో జైలు శిక్షపడిన ప్రజాప్రతినిధులపై ఏ విధమైన చర్యలు ఉంటాయో 2013 జులై 10న ఇచ్చిన తీర్పు పేరా 17లో స్పష్టీకరించిందన్నారు. ఈ తీర్పు వివరాలను రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలను సవివరంగా స్పీకర్‌కు తెలిపా మన్నారు. ఈ అంశంలో స్పీకర్ చర్య తీసుకుంటారని విశ్వ సిస్తున్నామన్నారు. ఈ అంశానికి సంబంధించి ముఖ్య ఎన్నికల అధికారికి కూడా వినతిపత్రం ఇచ్చామన్నారు. విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు విజయసాయిరెడ్డి సమాధానాలు ఇస్తూ అవిశ్వాస తీర్మానం అనేది ఈనెల 21న పెట్టడం వల్ల ఉపయోగం లేదని పవన్ కల్యాణ్ అన్నారని ప్రశ్నించగా మరి ఏ తేదీన పెట్టాలి అని అడిగారు. ఈ విష యంలో ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు జోక్యం చేసుకుంటూ అవిశ్వాసం ఎప్పుడు పెట్టాలి అనేది పార్టీ అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత వెల్లడించిన నిర్ణయమని స్పష్టం చేశారు. అవిశ్వాస నిర్ణయాన్ని తెలంగాణ ముఖ్య మంత్రి కేసీఆర్ చీప్ ట్రిక్ అనడంపై మరో విలేకరి ప్రశ్నించగా అలా అనడం అర్థరహితమని, తమ దృష్టిలో ఇది చాలా కాలి క్యులేటెడ్ ట్రిక్ అని వ్యాఖ్యానించారు. చీప్ ట్రిక్ అన్నంత మాత్రాన ఉలిక్కిపడక్కర్లేదని వ్యాఖ్యానించారు. ఫిరాయిం పు ల విషయంలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసింది కదా అప్పుడు తప్పు కాన ప్పుడు ఇప్పుడు అదే పని టీడీపీ చేస్తే తప్పెలా అవుతుందని టీడీపీ నేతలు అంటున్నారని మరో విలేకరి ప్రశ్నించగా రాజ్యాంగంలో షెడ్యూల్ టెన్ లో ఫిరాయింపులకు సంబ ంధించి ఎటువంటి చర్యలు తీసుకోవాలనేది స్పష్టంగా ఉందన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత స్పీకర్, ఎన్నికల కమిషన్, గవర్నర్‌లపై ఉంటుందని సాయిరెడ్డి స ్పష్టం చేశారు.

లోక్‌సభలో టీడీపీ, అసెంబ్లీలో బీజేపీ ఏపీలో మిత్రపక్షాలు శత్రుపక్షాలుగా పోరాటాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రత్యేక హోదా కోసం పార్లమెంట్‌లో టిడిపి రాజీలేని పోరాటం చేయాలని నిర్ణయించుకున్న నేపథ్యంలో సోమవారం నుంచి ప్రారంభమవుతున్న ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలలో బిజెపి ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించాలని భావిస్తోంది. రాష్ట్రా నికి ప్రత్యేక హోదా, నిధుల కోసం పోరాటం చేస్తున్న టిడిపితో కొంత కాలంగా బిజెపికి సంబంధాలు చెడిపోయాయి.

ఇరు పార్టీల నేతలు మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ఈ నేపథ్యంలో లోక్‌సభలో ప్రత్యేక హోదా, నిధుల కోసం లోక్‌సభలో కేంద్రాన్ని నిలదీసేందుకు టిడిపి ఎంపీలు సమాయత్తమవుతున్నారు. పోరాట తీరును చంద్రబాబు మార్గదర్శనంలో కొనసాగించేందుకు టిడిపి ఎంపీలు ఉవ్విళ్ళూరుతున్నారు. ఇదే తరుణంలో టిడిపిపైనా, పాలనపైనా, కేంద్రం వివిధ సందర్భాలలో కేంద్రానికి ఇచ్చిన నిధులపై అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని బిజెపి రాష్ట్ర నేతలు నిర్ణయించుకున్నారు. ఇటీవల విజయవాడలో జరిగిన పార్టీ కీలక సమావేశంలో అసెంబ్లీలో బిజెపి ప్రధాన ప్రతిపక్ష పోషించాల్సిన అవసరం ఉందని పేర్కొనడాన్ని చూస్తుంటే ఈసారి వైసిపి లేని లోటును బిజెపి తీరుస్తుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది. కేంద్రం ఇచ్చిన మాట తప్పిందని, రాష్ట్రా నికి అన్యాయం చేస్తోందని కొంత కాలంగా సిఎం చంద్రబాబు నాయుడు పదే పదే మాట్లాడటాన్ని బిజెపి నేతలు తప్పు పడుతున్నారు.

చంద్రబాబు నాయుడు ప్రకటనలు తప్పని తన పాలనలోని వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రజల దృష్టిని మళ్ళించేందుకే కేంద్రంపై నిందలు వేస్తున్నారని బిజెపి అసెంబ్లీని వేదికగా చేసుకుని మాట్లాడాలని నిర్ణయించుకుంది. టిడిపి నేతలు పార్లమెంట్‌లో కేంద్రంపై పోరాటం చేస్తుంటే బిజెపి నేతలు అసెంబ్లీలో టిడిపిని ఎండగట్టడానికి సన్నద్ధం కావడం ఇప్పుడు రసవత్తరంగా మారనుంది. వాస్తవానికి బిజెపి, టిడిపిలు మిత్రపక్షాలుగానే ఉన్నాయి, కానీ తాజా పరిణామాల నేపథ్యంలో శత్రుపక్షాలుగా మారనుండటం రాజకీయ విశ్లేషకులు కూడా జరుగనున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. రెండు పార్టీల మధ్య తలెత్తిన విబేధాలు తమకు కలిసి వస్తాయని కాంగ్రెస్, వైసిపిలు భావిస్తున్నాయి.

సంయమనం కోల్పోవద్దుఅసెంబ్లీలో టిడిపి వైఖరిని ఎండగట్టాలని స్పష్టం చేసిన ఎపి బిజెపి అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు సంయమనాన్ని పాటించాలని ఎంఎల్ఎలకు సూచించారు. కేంద్రం ఇచ్చిన పథకాలు, నిధులు, రాష్ట్రం కోరిన అంశాలను కూలంకషంగా ప్రస్తావించాలని, వచ్చిన ప్రతి అవకాశాన్ని ఏ మాత్రం వదులుకోకుండా ప్రజలకు పూర్తిగా అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. దూకుడుగా కాకుండా నిదానంగా రాష్ట్రా భివృద్ధికి కేంద్రం ఇచ్చిన చేయూతను ప్రస్తావించాలని కోరారు.

పార్టీలన్నీ ఏకమైతేనే హోదా

● రాజకీయ వ్యవస్థలో మార్పు రావాలి ● అద్దంకి సభలో జగన్



వృద్ధురాలి సమస్య తెలుసుకుంటున్న జగన్

ఒంగోలు, ప్రభ న్యూస్ బ్యూరో: తెలుగుదేశం పార్టీకి చిత్తశుద్ధి ఉంటే ప్రత్యేకహోదా విషయంలో అన్ని పార్టీలు కలిసి పనిచేస్తే కేం ద్రం దిగిరాదా అని ప్రతిపక్షనేత జగన్ ప్రశ్నించారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా 103వ రోజు ప్రకాశం జిల్లా అద్దంకి నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహించిన జగన్ అనంతరం అద్దంకిలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. చంద్రబాబు నమ్మిన వారిని మింగే కొండచిలువ లాంటి వారని జగన్ పిట్ట కథ చెప్పుకొచ్చారు. అన్ని వర్గాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతుంటే ఓట్ల కోసం రంగులు మార్చి రాజకీయాలు చేసే మానవత్వంలేని ప్ర భుత్వం అని విమర్శించారు. గత నాలుగేళ్లుగా తెలంగాణ సస్యశ్యామలంగా ఉంటే అదే సాగర్ జలాలతో బతికే ఆంధ్ర రైతు ఆత్మహత్య చేసుకోవడానికి కారణమేమిటని ప్రశ్నిం చారు. చెడిపోయిన రాజకీయ వ్యవస్థలో మార్పు తీసుకు రావాలని దీనికి ప్రతి ఒక్కరు తనకు మద్దతు పలకాలని కోరారు. తాను అధికారంలోకి వస్తే ఆరోగ్యశ్రీ పథకంలో సమూల మార్పులు చేసి పేదవాడికి మరింత ఉపయోగ పడేలా చేస్తానని హామీ ఇచ్చారు.

ఆంధ్రప్రదేశ్‌కు అతి ముఖ్యమైన ప్రత్యేక హోదా విషయంలో చంద్రబాబు రోజుకోమాట మారుస్తున్నారని, రంగులు మార్చే విషయంలో ఊసరవెల్లికి పాఠాలు చెప్పే స్థాయికి దిగజారి పోయా రన్నారు. ప్రత్యేక హోదా విషయంలో తాము చేస్తున్న పోరాటానికి మద్దతు పలకాలని ఆయన డిమాండ్ చేశారు.

చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే తమ ఎంపీలను కూడా ఏప్రిల్ 6వ తేదీన రాజీనామా చేయిస్తే కేంద్రం దిగిరాదా అని ప్రశ్నించారు. చంద్రబాబుకు కేంద్రాన్ని చూసినా, కేసీఆర్‌ను చూసినా భయమని, ఓటుకు నోటు కేసు తిరగతోడి జైలులో పెడతారని వణికిపోతున్నారని ఎద్దేవాచేశారు. రబీ, ఖరీఫ్ రెండు సీజన్లలోనూ కరువుతో రైతాంగం అల్లాడుతుంటే ఆదుకోవాల్సిన చంద్రబాబు అది మానేసి, కల్లబొల్లి రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇది మానవత్వంలేని ప్రభుత్వమని, చరమగీతం పలికేసమయం దగ్గర పడిందన్నారు.

103వ రోజు పాదయాత్ర రజానగరం గిరిజన కాలనీ, కుంకుపాడు, శ్రీరామ్‌నగర్ కాలనీ, పార్వతీపురం క్రాస్, తిమ్మాయపాలెం మీదుగా నిర్వహించారు. 104వ రోజైన సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే పాదయాత్ర నాగులపాడు, వెంకటాపురం, ఆలవలపాడు, తక్కెళ్లపాడు, గ్రామాల మీదుగా సాగుతుంది.



10వ తరగతి ప్రీ ఫైనల్ పేపర్ లీక్


● ఈ ఏడాది ఇది రెండోసారి ● మొదటిసారి రూ.6 కోట్లు గంగపాలు

నంద్యాల, ప్రభ న్యూస్ : రాష్ట్రంలో 10వ తరగతి ప్రధాన పరీక్షలకు విద్యార్థుల్లో సామర్థ్యాన్ని తెలుసుకునేందుక ు ప్రీ ఫైనల్ ఎగ్జామ్స్‌ను నిర్వహిస్తారు. గత నెల 24 నుంచి ప్రీ ఫైనల్ ఎగ్జామ్స్ జరుగుతున్నాయి. ఇప్పటికే తెలుగు, ఇంగ్లీష్ , హిందీ పరీక్షలు పూర్తయ్యాయి. మ్యాథ్స్ ఒక పేపర్ అయిపోయింది. సోమవారం మ్యాథ్స్ 2వ పేపర్‌ను నిర్వ హించనున్నారు. మ్యాథ్స్ రెండవ పేపరు ఒక రోజు ముందు గానే బయటకు వచ్చేసింది. ఒక్కొక్క పేపరుకు రూ. 1,000 చొప్పున మార్కెట్‌లో వసూలు చేస్తున్నారు. జిరాక్స్ సెంటర్లు ప్రీఫైనల్ పేపర్లతో కిటకిటలాడుతున్నాయి. ఇప్పటికే రాష్ట్రప్ర భుత్వం ప్రీ ఫైనల్ ఎగ్జామ్‌కు గతంలో తయారు చేసిన పేపర్లు బయటకు వచ్చిన విషయం తెలిసిందే. పేపర్లు బయటకు రావడంతో వాటిని పూర్తిగా రద్దు చేశారు. ఇందుకోసం అప ్పట్లో ఖర్చు చేసిన రూ. 6 కోట్లు గంగ పాలు అయ్యాయి. మరోసారి రూపొందించిన రెండవ విడత ప్రీ ఫైనల్ పేపర్లు బహిరంగ మార్కెట్‌లోకి వచ్చేశాయి. పరీక్షల నిర్వహణలో విద్యా శాఖ నిర్లక్ష్యం వెరసి ఒక రోజు ముందుగానే విద్యార్థులకు, తల్లిదండ్రులకు చేరిపోతున్నా యి. కర్నూలు కేంద్రంలో రహస్యంగా రూపొందించిన పేపర్లను మండల రిసోర్స్ సెంటర్స్‌కు చేరుస్తారు. అక్కడి నుంచి మండలాల పరిధిలోని ఉన్నత పాఠశాలలకు అర గంట ముందు పరీక్షా పేపర్లను అందజేయాలి. విద్యార్థుల సామర్థ్యాలను తెలియజేసే ప్రధాన పరీక్షలకు ముందుగా ఆయా పాఠశాలలో ఎస్ఎ -1, ఎస్ఎ 2 తోపాటు ఎఫ్ఎ -1, ఎఫ్ఎ - 2, ఎఫ్ఎ - 3, ఎఫ్ఎ - 4 ప్రాతిపదికన పరీక్షలను నిర్వ హిస్తారు. ప్రధాన పరీక్షలో 80 మార్కులకు పరీక్షలు నిర్వ హిస్తారు. ఆయా కళాశాలలు ముందుగా నిర్వహించే పరీక్షల్లో మొత్తం ఎస్ఎ -1కు 80 మార్కులు,ఎఫ్ఎ పరీక్షలకు ఒక్కొక్క పేపరుకు 50 మార్కుల చొప్పున మొత్తం 280 మార్కులకు పరీక్షలను నిర్వహిస్తారు. అందులో విద్యార్థులు పొందే మార్కులను 20 శాతానికి లెక్కించి ఆ మార్కులను ఎస్ఎ -2 పేరిట నిర్వహించే ప్రధాన పరీక్షల్లో కలుపుతారు. ప్రధాన పరీక్షలకు ముందుగా విద్యార్థుల్లోని సామర్థ్యాన్ని తెలుసుకునేందుకు నిర్వహించే ప్రీ ఫైనల్ పరీక్షా పేపర్లు బయటకు వచ్చేస్తున్నాయి. సోమవారం జరగాల్సిన మ్యాథ్స్ 2వ పేపర్ బయటకు వచ్చేసింది. కర్నూలు జిల్లాలోని జిరాక్స్ సెంటర్ లలో బహిరంగ మార్కెట్‌లో పెట్టి అమ్మేస్తున్నారు.

ఇప్పటికే పలు విమర్శలను మూటకట్టుకున్న విద్యాశాఖ మరోసారి ప్రీ ఫైనల్ నిర్వహణలో పూర్తిగా విఫలమైంది. ఈ విషయంపై కర్నూలు జిల్లా డిఇఓ తాహెరా సుల్తానాను ప్రభ న్యూస్ ప్రతినిధి ఫోన్‌లో వివరణ కోరగా ప్రీ ఫైనల్ ఎగ్జామ్స్‌క ు ఒక సెట్ మాత్రమే పరీక్షా కేంద్రాలకు పంపుతామన్నారు. సోమవారం జరుగనున్న మ్యాథ్స్ 2 వ పేపరు నంద్యాలలో లభిస్తున్న విషయాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్ళగా ఈ విషయమై పూర్తి వివరాలను డిప్యూటి డిఇఓను అడిగి తెలుసుకుంటానని తెలిపారు.

నీలి గురుడు అందగాడు!

● గురుగ్రహంపై నాసా తాజా ఫొటో



మువ్వర్తుల భూమిని పోలిన గురు గ్రహం ఫోటోను నాసా విడుదల చేసింది. చిక్కటి నీలి వర్ణంలో ఉన్న గురు గ్రహాన్ని చూసి అనేక మంది అదేదో కొత్త గ్రహమని పొరబడ్డారు. జునో ప్రోబ్ పూర్తి వివరాలతో కూడిన ఫోటోలను తీసింది. గురుగ్రహంపై సంఖ్యెలుగు ప్రాంతాన్ని ఫోటోలు తీసినట్టు నాసా తెలిపింది. నాసా జునో అంతరిక్ష వాహనాన్ని 2011, ఆగస్టు ఐదవ తేదీన కేప్ కనవెరల్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి ప్రయోగించింది. జూనో 2016 మధ్యకాలానికి గురుగ్రహానికి చేరుకుంది. గురుగ్రహం ఆవిర్భావం, పరిణామక్రమం అర్థం చేసుకోవడానికి జునోని పంపించారు. గ్రహ కేంద్రక శోధన, అయస్కాంత క్షేత్ర వ్యాపింగ్, లోతైన అగాధాల్లో అపెక్షనియా (ద్రావకం గణన, వెరుఖ్యోతులు(అరోరా) లాంటి విధులను జునోకు నిర్దేశించిన కార్యకలాపాలు. జునో ఈ నెల ఏడవ తేదీ నాటికి గురు గ్రహంపై 10వ శాస్త్రీయ ఆవర్తనాన్ని పూర్తి చేసుకుంది. మార్గమధ్యంలో గ్రహం చుట్టూ అంతుపట్టని విధంగా ఆవరించిన శక్తివంతమైన అరోరాల ఫోటోలను జునో తీసింది. ఇవి వాటిలో కొన్ని భూమికి ఉత్తర, దక్షిణ ధృవాలపైన, కడకు అలస్కా, కెనడా లాంటి చోట్ల కూడా కనిపించిన నిదర్శనాలు ఉన్నాయి. గత డిసెంబర్‌లో జునో నుంచి వచ్చిన నివేదికలు గురు గ్రహం భవిష్యత్తుపై చర్చోపచర్చలకు ఆజ్యం పోశాయి. గురుగ్రహం 350 సంవత్సరాలుగా పైగా మనుగడలో ఉందని ఒక అంచనా. అలాగే జునో తన పరిశోధనల్లో గురు గ్రహంపైన నిర్దిష్టంగా ఒక కొత్త వరదల ప్రాంతాన్ని కనుగొంది. మానవులు గురుగ్రహాన్ని 1830 నుంచి పరిశీలిస్తున్నారు.

కేంద్ర పెత్తనంపై సమరం

నాడు ఎన్టీఆర్ నేడు కేసీఆర్!


(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వాన్ని కూడా ఎన్టీఆర్ నిలదీశారు. తమపై కేంద్ర పెత్తనమేంటంటూ ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర సంబంధాల్ని పునర్నిర్వచించాల్సిన అవసరాన్ని తెరపైకి తెచ్చారు. ఆ తర్వాత రాజీవ్‌గాంధీ ప్రభుత్వాన్ని కూడా ఆయన ఇలాగే నిలదీశారు. ఎన్టీఆర్ తర్వాత ఇన్నాళ్లకు బలమైన కేంద్రాన్ని ఎదిరించిన నాయకుడిగా కేసీఆర్ ఆవిర్భవించారు. ఆ మాటకొస్తే కేసీఆర్‌కు మొదటి నుంచి ఎన్టీఆర్ అంటే మిక్కిలి అభిమానం. తన కుమారుడికి కూడా తారకరామారావు అంటూ పేరెట్టుకున్నారు. తనకు రాజకీయ అవకాశం కల్పించిన ఎన్టీఆర్‌ను ఇప్పటికీ ఆయన అమితంగా గౌరవిస్తూనే ఉంటారు. అంతటితో సరిపెట్టకుండా అవకాశాత్మకంగా కూడా ఎన్టీఆర్ విధానాల్ని ఆయన అనుసరిస్తున్నారు. స్వతంత్రానంతరం రాష్ట్రాల హక్కులకోసం పోరాటం తొలిసారిగా ఎన్టీఆర్ మొదలెడితే మలిసారి కేసీఆర్ హయాంలో రూపుదిద్దుకుంటోంది.

అత్యవసర పరిస్థితి అనంతరం ఇందిరకు వ్యతిరేకంగా వివిధ పార్టీలు కలిసి ఏర్పాటు చేసుకున్న జనతా ప్రయోగం విఫలమైంది. ఆ తర్వాత కూటమిలు ఏకాగ ఎవరూ ప్రయత్నించలేదు. కాంగ్రెస్ అధినేతృత్వంపై మండిపడ్డ ఎన్టీఆర్ నేషనల్ ఫ్రంట్‌కు శ్రీకారం చుట్టారు. జాతీయ, రాష్ట్రస్థాయి నాయకులందర్నీ ఒకే వేదికపైకి తెచ్చారు. అంతవరకు కాంగ్రెస్‌ను ఎదురుదెబ్బ పలకరించుకోని పార్టీల అధినేతలందర్నీ ఒకే గూట్లోకి చేర్చారు. ఇలా జనతాదళ్, తెలుగుదేశం, డీఎంకే, ఏజీపీ, సోషలిస్ట్ ఇండియన్ కాంగ్రెస్‌లకు చెందిన సభ్యులతో 1989లో తొలిసారి మూడో కూటమికి చెందిన ప్రభుత్వం ఏర్పాటైంది. వామపక్షాలు దీనికి బయటి నుంచి మద్దతిచ్చాయి. అప్పుడే ఎన్టీఆర్‌కు ప్రధాని అయ్యే అవకాశం అందొచ్చింది. కానీ రాష్ట్రంలో ఆ పార్టీ ఓడిపోవడంతో ఎన్టీఆర్ ఆ అవకాశాన్ని వద్దనుకున్నారు. వి.పి. సింగ్ ప్రధాని అయ్యారు. తిరిగి 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రయోగం జరిగింది. ఇది 1996 ఎన్నికల్లో అధికారంలోకొచ్చింది. తొలి ప్రయత్నానికి ఎన్టీఆర్ ఆధ్వర్యమైతే అనంతరం జరిగిన ప్రయత్నానికి చంద్రబాబు సూత్రధారి. అయితే హెచ్.డీ. దేవెగౌడ ప్రధానిగా ఏర్పడ్డ ప్రభుత్వంలో ఏడాది తిరిగేసరికి కాంగ్రెస్ బయటి నుంచి ఇస్తున్న మద్దతు ఉపసంహరించుకోవడంతో ప్రధాని రాజీనామా చేయాల్సి వచ్చింది. ఐకె గుజ్రాల్‌ను గద్దెనెక్కించారు. అయినా మరో ఏడాదిలో ప్రభుత్వం దిగిపోక తప్పలేదు. గత ఎన్నికల్లో కూడా యూపీఏ, ఎన్డీఏలతో పాటు వామపక్షాలతో కూడా సరిపడని మమతాబెనర్జీ నాలుగో కూటమి ఏర్పాటుకు విఫలయత్నం చేశారు.

ఇప్పటికీ యూపీఏ, ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల్లోలేని పలు ప్రాంతీయ పార్టీల అధినేతలు ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక కోసం ఎదురుచూస్తున్నారు. మమతాబెనర్జీతోపాటు లాలూప్రసాద్, నవీన్ పట్నాయక్, కరుణానిధి, మాయావతి, కేజ్రీవాల్, పళనిస్వామి తదితరులు దీనిపట్ల ఆసక్తితో ఉన్నారు. నితీశ్ కూడా ప్రధాని అభ్యర్థిత్వం పట్ల ఆసక్తిగా ఉన్నారు. జాతీయ పార్టీలు దేశం మొత్తం ప్రభావం చూపే సమస్యలపైనే దృష్టిపెడుతున్నాయి. రాష్ట్రాలస్థాయిలో ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని పట్టించుకోవడంలేదు. ఇప్పుడు దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ రిజర్వేషన్లు కీలక సమస్యగా మారిపోయాయి. రాష్ట్రాల స్థాయిలో అమలయ్యే రిజర్వేషన్లకు సంబంధించి కేంద్ర అనుమతి, పెత్తనం ఏంటన్న ప్రశ్నలు మొదలయ్యాయి. స్థానిక పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా రిజర్వేషన్ల శాతాన్ని రాష్ట్రాలే నిర్ణయించుకోవాలి తప్ప దేశవ్యాప్తంగా ఒకే విధానం ఉండాలన్న నిర్ణయం సరికాదన్నది రాష్ట్రాల వాదనగా ఉంది. అలాగే వైద్యకళాశాలల్లో సీట్ల భర్తీ గత ఏడాదివరకు రాష్ట్ర ప్రభుత్వాల అధీనంలో జరిగేది. కానీ ఇప్పుడు వీటిపై పెత్తనం పూర్తిగా కేంద్రం దఖలుపరుచుకుంది. వచ్చే ఏడాది నుంచి ఇంజినీరింగ్ కళాశాలల ప్రవేశాల్ని కూడా కేంద్ర అధీనంలోకి తీసుకురానున్నారు. విద్య, వైద్యం, గ్రామీణ మౌలికసదుపాయాల వంటివన్నీ రాష్ట్రాలపరిధిలోనే కొనసాగాలి తప్ప కేంద్ర పెత్తనం ఏంటంటూ ఈ రాష్ట్రాల ముఖ్యమంత్రులు దీర్ఘకాలంగా ప్రశ్నిస్తున్నారు. కానీ ముందుకొచ్చి మూడో ఫ్రంట్ ఏర్పాటుకు ఎవరూ శ్రీకారం చుట్టలేదు. ఎన్టీఆర్ తరహాలో ఇప్పుడు కేసీఆర్ ఆ బాధ్యత తలకెత్తుకున్నారు. ఇంతవరకు ఉద్యమనేతగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగానే పరిగణించబడ్డ కేసీఆర్‌ఈ ఒక్క ప్రకటనతో జాతీయస్థాయి నాయకుడిగా ఎదిగిపోయారు. శక్తివంతమైన మోడీని నిలదీయగల ధీశాలిగా గుర్తింపుపొందారు.

థర్డ్ ఫ్రంట్‌కు జనసేన మద్దతు



(మొదటిపేజీ తరువాయి)

రాజకీయాల్లోకి రావాలని చెప్పారు. బూజుపట్టిన ఆలోచనా విధానాలతో ప్రజలు చాలా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త రక్తం, కొత్త ఆలోచనా విధానం రావాలంటే తృతీయ ప్రత్యామ్నాయం అవసరమని.. ఇది సర్వత్రా జరుగుతున్న చర్చ అని చెప్పారు. దీనికి అంకురార్పణ చేయాలని సీఎం కేసీఆర్‌కు సాటి తెలుగువాడిగా స్వాగతిస్తున్నానని, మద్దతు తెలుపుతున్నానని, ఆయనకు సమర్ధత ఉందని బలంగా నమ్ముతున్నానని చెప్పారు. దశాబ్దంన్నర పాటు సుదీర్ఘమైన పోరాటం చేసి బలమైన ఉద్యమాన్ని ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా నిబద్ధతతో తీసుకువెళ్లిన ఓ పెద్ద నాయకుడు కేసీఆర్ అని.. అలాంటి వ్యక్తికి దేశ వ్యాప్తంగా బలమైన పరిచయాలు ఉన్నాయని, భారతదేశ సమాజం, సమస్యల పట్లలోతైన అవగాహన ఆయనకు ఉందని, హింసకు తావులేకుండా ఒక రక్తపు చుక్క కూడా కింద పడకుండా రాష్ట్రం సాధించిన నాయకుడు కేసీఆర్ అని, అటువంటి నాయకుడు తృతీయ ప్రత్యామ్నాయానికి అంకురార్పణ చేస్తే ముందుకు తీసుకెళితే మనస్ఫూర్తిగా సాటి తెలుగువాడిగా వారి ఉద్దేశం,సత్ఫలితాలు ఇస్తాయని, అందుకు జనసేన పూర్తి మద్దతిస్తుందని చెప్పారు. ప్రాంతీయ పార్టీలకు జాతీయ దృక్పథం చాలా అవసరమని పేర్కొన్నారు. 2019లో కచ్చితంగా ప్రాంతీయ పార్టీల మద్దతు లేకుండా రాజకీయాలు జరగవని, దేశ అభివృద్ధి ముందుకు సాగదని తెలిపారు. దేశ రాజకీయాలను, ప్రజా సమస్యలను సున్నితంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రాంతీయ పార్టీలకు జాతీయ స్థాయి సమస్యల పట్ల అవగాహన ఉండదన్న జాతీయ పార్టీల ప్రచారాన్ని తిప్పి కొట్టాలన్నారు. కేసీఆర్ తృతీయ ప్రత్యామ్నాయాన్ని ముందుకు తీసుకువెళతారన్న నమ్మకం, విశ్వాసం తనకుందని తెలిపారు. భవిష్యత్తులో యూపీఏ, ఎన్డీయే కూట ములు ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తాయో.. లేదో తెలియదని, ప్రభుత్వ ఏర్పాటుకు మూడో ప్రత్యామ్నాయానికే ఎక్కువ అవకాశాలున్నాయని పవన్ చెప్పారు. ప్రాంతీ య పార్టీలు ఎందుకు పుడుతున్నాయో కేంద్రంలో అధికారాన్ని చలాయిస్తున్న ప్రభుత్వాలు అర్థం చేసుకోవాలని సూచించారు. యూపీఏ ప్రభుత్వం గతంలో అనుకున్న సమయానికి తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చి ఉంటే తెరాస పార్టీ పుట్టేది కాదని, దివంగత ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్యను అప్పట్లో అవమానపర్చినందుకే తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందని, అన్యాయంగా, ప్రజలకు సంబంధం లేకుండా, వారి పాత్ర లేకుండా రాష్ట్రాన్ని విడగొట్టి ప్రజల మధ్య విద్వేషాలు పెంచి.. దేశ సుస్థిరతను దెబ్బతీసేలాగా చేసి ఉండకపోతే తాను జనసేన పార్టీని పెట్టి ఉండేవాడిని కానని ఆయన చెప్పారు. జాతీయ పార్టీలు నిజంగా ప్రాంతీయ పార్టీల సమస్యలు, వాంఛలు, ఆకాంక్షలను నెరవేర్చనందుకే ప్రాంతీయ పార్టీలు పుట్టుకొస్తున్నాయని ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తే ఇవ్వండి.. ఇవ్వలేని పక్షంలో తెగేసి చెప్పండని కేసీఆర్ బలంగా చెప్పారని, పరస్పర విరుద్ధమైన ప్రకటనలతో గందరగోళం సృష్టించి ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారని కేసీఆర్ చెప్పిన అంశాలను పవన్ గుర్తు చేశారు. ప్రత్యేక హోదాకు సంబంధించి శనివారం జాయింట్ ఫైండింగ్ కమిటీ సభ్యులం సమావేశమయ్యామని.. అదే సమయంలో కేసీఆర్ తృతీయ ప్రత్యామ్నాయం ఏర్పాటుపై తమ మనసులోని మాటను వెల్లడించారని పేర్కొన్నారు.

కేసీఆర్‌దీ, తమదీ ఒకటే భావజాలమని, ఆలోచనా విధానం కూడా ఒకటే అయ్యిందని పేర్కొన్నారు. తెలుగువారు ఎక్కడున్నా ఒకరినొకరు బాగా అర్థం చేసుకుంటారని, అండగా నిలబడతారన్న దానికి కేసీఆర్ నిదర్శనమని చెప్పారు. ప్రత్యేక హోదాకు సంబంధించి సీఎం కేసీఆర్ చేసిన ప్రకటనను జనసేన స్వాగతిస్తోందని, ఆయనకు ఏపీ ప్రజలు, తెలుగు ప్రజల పక్షాన తాను కృతజ్ఞతలు తెలుపు తున్నానని పేర్కొన్నారు. ప్రత్యేక హోదాకు సంబంధించి అనేక మంది రోడ్ల మీద ఉన్నారని.. చాలా వేదనతో ఉన్నారని.. తీవ్రమైన మనోవేదన తో ఉన్నారని.. యువత బాధతో రగిలిపోతున్నారని చెప్పారు. ఈ మోసా లేంటి? ఇంకెంతకాలం ఈ ఆటలు? అని ఆయన నిలదీశారు. ఇటువంటి సమయంలో కేసీఆర్‌కు మాట్లాడాల్సిన అవసరం లేకపోయినప్పటికీ వారు ఈ సందర్భంగా చెపడం గర్వకారణమన్నారు. ప్రత్యేక హోదా కోసం ముందుకు వెళుతున్న ప్రతి ఒక్కరికీ కేసీఆర్ ప్రకటన కొండంత నైతిక బలాన్నిచ్చిందని.. జనసేనతో సహా అన్ని రాజకీయ పార్టీలు ప్రత్యేక హోదా కోసం పోరాడే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రత్యేక హోదా గురించి మాట్లాడితే.. తాను తెలంగాణ హైకోర్టు ఏర్పా టుకు డిమాండ్ చేస్తానని ఆయన విశాఖకు ప్రత్యేక రైల్వేజోన్‌కు మద్ద తిస్తే.. తాము బయ్యారం ఉక్కుగని ఏర్పాటు అంశాన్ని ప్రస్తావిస్తామని చెప్పారు. అన్ని అంశాలలో పరస్పరం సహక రించుకుంటామని తెలిపా రు. ప్రత్యేక పరిస్థితుల్లో తెలుగు రాష్ట్రాలు విడి పోయా యని, తమ మధ్య గొడవలు లేవని, మనస్పర్థలు అంతకన్నా లేవని గుర్తు చేశారు. రాష్ట్రం విడిపోయాక హైదరాబాద్‌లో ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో జీవిస్తు న్నారని, అందరు సామరస్యంతో జీవిస్తున్నారంటే అందుకు కేసీఆర్ అమలు చేసిన విధి విధానాల్లో ఆయన పాత్ర ప్రశంసనీయమని, ఏపీ ప్రజలు దీనిని మర్చి పోరని చెప్పారు. ప్రత్యేక హోదా ఇవ్వాలని.. ఇందుకు మద్దతు పలికిన కేసీఆర్‌కు తన ధన్యవాదాలని చెప్పారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఒకానొకసారి తనతో మాట్లాడుతూ.. భవిష్యత్తులో జాతీయ పార్టీలే ఉండబోతున్నాయని తనను ఆ పార్టీలో చేరారని కోరిన విషయాన్ని గుర్తు చేశారు. పార్టీలో చేరాలన్న ఉద్దేశం తనకుంటే ఎప్పుడో ఆ పార్టీలో కొనసాగుతానన్న విషయాన్ని కుండబద్దలు కొట్టానని.. ఇంకో పార్టీ పెట్టాల్సిన అవసరం ఏముందన్న విషయాన్ని చెప్పానని గుర్తు చేశారు. అమిత్ షా చేసిన వ్యాఖ్యలు తనకెంతో బాధ కలిగించాయని, అందుకు కారణం ఏ ఉనికి బీజేపీకి సహాయం చేసిందో, ఆ పార్టీ తెలుగుదేశం ప్రభుత్వాల ఏర్పాటుకు సహాయం చేసిన ఆ ఉనికిని చంపేస్తానంటే ఎలా? అని ప్రశ్నించారు. వ్యక్తిగతంగా తనకు నష్టమేమీ జరగదని, కాకపోతే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను ముందుకు తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో జనసేన పెట్టానని, అదే ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలను పట్టించుకుని ఉంటే అసలు ఈ రోజున ఈ సమస్య వచ్చేది కాదని తన లాంటివారు మాట్లాడే అవకాశం ఉండేది కాదని చెప్పారు. శుభ్రంగా తన పని తాను చేసుకునేవాడినని, చదవాల్సిన పుస్తకాలు ఎన్నో ఉన్నాయని, నిజంగా రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం లేదని.. కానీ మీరు ఇవన్నీ చేయకుండా తనను రాజకీయాలకు రావాల్సిన పరిస్థితులు కల్పించారని ఆయన పరోక్షంగా బీజేపీని ఉద్దేశించి పేర్కొన్నారు. జాతీయ పార్టీలు ప్రజల మనోభావాలు, ఆకాంక్షలను అర్థం చేసుకోవాలని, జాతీయస్థాయిలో సమస్యలు వచ్చినప్పుడు వాటిని పరిష్కరింపజేయాలని సూచించారు. తృతీయ ప్రత్యామ్నాయం తెలంగాణలో పుట్టింది కాదని, అనేక రాష్ట్రాల్లో చూశానని చాలామందిలో ఈ భావం బలంగా ఉందని చెప్పారు. యూపీఏ పదేళ్ల పాలనలో దేశాన్ని అస్తవ్యస్తంగా చేసిందని ఆరోపిస్తూ.. దేశంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. ఈ నాలుగేళ్లలో అదేమీ జరగకపోగా..ఇబ్బందులు, సమస్యలు వచ్చాయని దాంతో ప్రజలు రగిలిపోతున్నారని పేర్కొన్నారు. రాజకీయాల్లో తృతీయ ప్రత్యామ్నాయం ఉండాలన్నది జనసేన అభిప్రాయమన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వకపోవడానికి కారణం.. అక్కడెక్కడో మారుమూల దక్షిణ భారతదేశంలో ఏపీ రాష్ట్రం ఉంటుందని, నాలుగైదు ఎంపీ సీట్లు గెలుస్తారన్న భావన కేంద్ర ప్రభుత్వంలో ఉందని.. అందుకే హోదాపై ఎందరు ఉద్యమిస్తున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఏపీ, తెలంగాణయే కాదు..కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలను కూడా కేంద్రం పట్టించుకోవడం లేదని, ఇది దేశ సమగ్రత, సుస్థిరతకు భంగం వాటిల్లే అంశమని చెప్పారు. అందుకని ఇలాంటి పరిస్థితుల్లో సున్నితమైన అంశాలను అర్థం చేసుకునే వ్యక్తుల సమూహం అవసరమని గుర్తు చేశారు.

వ్యవస్థ ప్రక్షాళనకు శంఖారావం

• ప్రత్యామ్నాయ రాజకీయ కూటమికి నేనే సారథి • త్వరలోనే ఏకాభిప్రాయ నేతలందరితో ప్రత్యేక సమావేశం • ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రక్షాళన, సమూల మార్పులు అవశ్యం • ప్రజా సంక్షేమమే పరమావధిగా రాజ్యాంగ సవరణ • తప్పనిసరి పరిస్థితుల్లో దేశ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు • అది తెలంగాణ నుంచే ప్రారంభం కావడం శుభ పరిణామం • టీఆర్ఎస్ అభిమానులు, కార్యకర్తలతో టీ. సీఎం కేసీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కాంగ్రెస్, భాజపాలకు ప్రత్యామ్నాయంగా త్వరలోనే థర్డ్ ఫ్రంట్ ఆవిష్కృతమవుతుందని, అందుకు నేనే సారథినని తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రకటించారు. తాను సూచనప్రాయంగా తీసుకున్న నిర్ణయానికి దేశవ్యాప్తంగా అశేష మద్దతు లభిస్తోందన్నారు. అందుకు తాను గట్టి నిర్ణయం తీసుకున్నానని, ఇక వెనకడుగు వేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఇప్పుడున్న వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు దేశవ్యాప్తంగా కలిసివచ్చే రాజకీయ పార్టీల నేతలందరినీ కలుపుకుని ముందడుగు వేస్తానని వెల్లడించారు. త్వరలోనే ఏకాభిప్రాయ నేతలందరితో సమావేశమవుతానని పేర్కొన్నారు. జాతీయ రాజకీయాల్లోకి రంగప్రవేశం చేస్తానన్న నిర్ణయానికి సంపూర్ణ మద్దతు తెలుపుతూ రాజకీయాలకు అతీతంగా రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున అభిమానులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు, వివిధ స్థాయి ప్రజాప్రతినిధులు ఆదివారం ప్రగతి భవన్‌కు తరలివచ్చారు.

'కేసీఆర్ ఆగే బడో... హమ్ తుమారా సాత్ హై' అంటూ నినాదాలతో అధికార నివాసం ప్రాంగణాన్ని మారుమ్రోగించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ, దేశ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. అది తెలంగాణ నుంచే ప్రారంభం కావడం శుభ పరిణామమని అన్నారు. ప్రతిష్టాత్మక పథకాలు, విప్లవాత్మక పరిపాలనా విధానాలతో ప్రగతిపథంలో సాగుతున్న తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే దేశానిదే మార్గదర్శకం కానుందని ధీమా వ్యక్తం చేశారు. దేశ రూపురేఖలు మార్చాలన్న లక్ష్యంతో సమగ్ర ప్రణాళికను రూపొందించుకుని ముందడుగు వేస్తామన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి ప్రయోజనాలు అందక దేశ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ఈ పరిస్థితుల్లో



ప్రత్యామ్నాయ రాజకీయ కూటమి అవసరమని భావిస్తున్నామన్నారు.

మోడీపై ఎన్నో ఆశలు పెట్టుకున్నా... అయినా ఫలితం లేదు

నాలుగేళ్ళ క్రితం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నరేంద్రమోడీ ప్రభుత్వం దేశానికి ఏదో చేస్తుందని, పేద వర్గాలకు న్యాయం జరుగుతుందని ఎన్నో ఎన్నో ఆశలు పెట్టుకున్నానని సీఎం కేసీఆర్ ఈ సందర్భంగా తెలిపా రు. అయినా ఎలాంటి ప్రయోజనం కనిపించడం లేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో దేశ రాజకీయాల్లో మార్పు అవసరమని భావిస్తున్నా... అది తెలం గాణ నుంచే ప్రారంభమవుతుంది అని పేర్కొన్నారు. మూడవ రాజకీయ కూటమితో వందశాతం మార్పు సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా భాజ పా, కాంగ్రెస్ వ్యతిరేక శక్తులన్నింటినీ కూడగట్టుకుని ముందుకు సాగుతానన్నారు. త్వరలోనే భావసారూప్య పార్టీలు, వ్యక్తులను కలుపు కుని దేశాన్ని అభివృద్ధి వైపు మల్లించడమే నా లక్ష్యం.. అని కేసీఆర్ స్పష్టం చేశారు. నిజమైన ఫెడరల్ వ్యవస్థను ఆవిష్కరిస్తామన్నారు. రాష్ట్రాలకు అధికారాల బద లాయింపుపై పోరాటం చేస్తామన్నారు. కేంద్రం గుప్పిట్లో పూర్తి అధికారాలు ఉంటే కొన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యం కాదని స్పష్టం చేశారు.

దేశ ప్రగతిపై కేసీఆర్ ఆందోళన

స్వాతంత్ర్యానంతరం ఇప్పటివరకు కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీలే దేశాన్ని పాలించాయని, అయినప్పటికీ ఏ ఒక్క రంగంలోనూ ఆశించిన ప్రగతి సాధ్యపడలేదని కేసీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ కూటమి అవసరమని తాను మాట్లాడిన ఒకే ఒక్క మాటకు దేశం నలుమూలల నుంచి తలలు పండిన రాజకీయ నేతలు, పలు రాష్ట్రాలను పరిపాలిస్తున్న నాయకుల నుంచి ఫోన్లు రావడం చూస్తుంటే, ఆ రెండు జాతీయ పార్టీల పట్ల ఇంతటి వ్యతిరేకత ఉందా? అని నాకే ఆశ్చర్యం కలుగుతోందన్నారు. పెద్ద రాష్ట్రమైన పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, చత్తీస్‌గడ్ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, మహారాష్ట్ర నుంచి ఆరుగురు సీనియర్ ఎంపీలు, తదితరులు థర్డ్ ఫ్రంట్ ఏర్పాటుకు మద్దతు తెలుపుతూ, క్రియాశీల పాత్ర పోషించాలని విజప్తి చేసిన విషయాన్ని ఈ సందర్భంగా కేసీఆర్ కార్యకర్తలకు గుర్తుచేశారు.

విధానాల లోపంతోనే రైతు ఆత్మహత్యలు

ఏడు దశాబ్దాల స్వతంత్ర్య భారతదేశంలో రైతు ఆత్మహత్యలు ఎందుకని ప్రశ్నించారు. 70వేల టీఎంసీల నీటిని వినియోగించుకునే అవకాశమున్నా వెనకబడిపోవడం దురదృష్టకరమన్నారు. ఏళ్ళ తరబడి నీటివాటాలు తేల్చకుండా రాష్ట్రాల మధ్య ఎడతెగని పంచాయతీ పెట్టడం ఎందుకని ప్రశ్నించారు. అమెరికా, చైనా జర్మనీ దేశాల్లోని అభివృద్ధిని కథలుగా చెప్పుకోవడమే తప్ప, అన్ని వనరులు అందుబాటులో ఉన్నా దేశ అభివృద్ధిపై ఒక ప్రణాళిక, ముందుచూపు అంటూ లేకపోవడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. కేవలం 24 సంవత్సరాల కాలంలోనే అమెరికా తర్వాత అత్యంత బలమైన దేశంగా చైనా ఎదిగిందని కేసీఆర్ గుర్తుచేశారు.

ప్రజలకు ఉపయోగపడని కానూన్ ఎందుకు?

ప్రజలకు ఉపగయోగపడని రాజ్యాంగం, పట్టాలు (కానూన్) మనకు అవసరం లేదన్నారు. పాత విధానాలకు స్వస్తిచెప్పి అవసరం మేరకు చట్టాలను, రాజ్యాంగాన్ని సవరించుకోవాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వాలపై లేదా అని ప్రశ్నించారు. మలేషియా నుంచి నీళ్ళుకూడా కొనుక్కునే సింగపూర్ అభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానంలో అగ్ర స్థానంలో నిలిచిన విషయం ఇన్నేళ్ళుగా పాలకులకు తెలియకపోవడం విచారకర మని అన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని సహజ సంపద, జల వనరులు, మేధోసం పత్తి కలిగిన మానవ వనరులు మన దేశంలో ఉన్నప్పటికీ జనాభాలో 80శాతం పేదరికంలోనే మగ్గిపోతుండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. పేరుకే ఫెడరల్ వ్యవస్థ... ఆరోగ్య విధానంలేదు, అత్యంత ప్రాధాన్యతా రంగాలైన విద్యా, వ్యవసాయ రంగాలకు ప్రత్యేక విధానం లేదు... ఆ దిశగా కూడా ఏనాడూ దృష్టిపెట్టని కాంగ్రెస్, భాజపాలు ఇక సమాజానికి అవసరం లేదన్నారు.

రాజకీయ ఉనికి కోసమే ఆ రెండు పార్టీల తాపత్రయం

నిరంతరం తమ రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకే ఆ రెండు జాతీయ పార్టీలు తాపత్రయపడుతున్నాయని విమర్శించారు. ఢిల్లీలో నాటకాలాడుతూ, 130 కోట్ల ప్రజల గోష పోసుకుంటున్నారని కేసీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సుదీర్ఘంగా 50 సంవత్సరాల పాటు కాంగ్రెస్, 11 సంవత్సరాలపాటు భాజపాలు దేశాన్ని పరిపాలిస్తే, ఇప్పటివరకు ఏ రంగం ఆశించిన పురోగతి సాధించిందో చెప్పాలని ప్రశ్నించారు. ఆ పాలన దేశానికి పట్టిన దరిద్రం అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాల హక్కులను హరిస్తూ కొన్ని చట్టాలు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉండాల్సిన అవసరం లేదన్నారు. గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి ప్రధానమంత్రి గ్రామీన సడక్ యోజన పథకం అవసరమా అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 80శాతానికి పైగా ఉన్న దళితులు, గిరిజనులు, ముస్లింలు, బీసీలకు రిజర్వేషన్లు పెంచి వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కృషి చేస్తామని కేంద్రానికి ప్రతిపాదనలు పంపిస్తే, ఉలుకూ, పలుకూ లేకపోవడం సమంజసమా? అంటూ ప్రశ్నించారు. అలాంటి సామాజిక అంశాలు రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

యేళ్ళ తరబడి జల వివాదాలకు ఆజ్యం

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో 14 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ నేటికీ రాష్ట్రాల మధ్య నీటి వాటాలు తేల్చకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిపాలనా విధానాలు చాట్లో తవుడు పెట్టి కుక్కలకు కొట్లాట పెట్టినట్లుగా ఉన్నాయన్నారు. కృష్ణా, గోదావరి నదీ జలాల్లో ట్రిబ్యునల్ తీరు ఇరు రాష్ట్రాలు తన్నుకు చావండని అన్నట్లుగా ఉందన్నారు.

ఇందిరా, రాజీవ్ దేశానికి చేసిందేమీ లేదు

10లక్షల కిలోమీటర్లయినా ఒక్క అడుగుతోనే మొదలవుతుంది... మీ దీవెన ఉంటే దేశ రాజకీయాలకు దశ, దిశ దొరుకుతుంది... ఈ మాటలు తాను ఆశామాషీగా చెప్పడంలేదు... అనుభవంతో, ఆలోచనతో ముందడుగు వేస్తున్నా... అంటూ అభిమానులను ఉద్దేశించి స్పష్టం చేశారు. ఏ అంశంపైనా తాను అవగాహన లేకుండా మాట్లాడనని చెప్పారు. 12వ పంచవర్ష ప్రణాళికల్లో జరిగిన అభివృద్ధిపై అవగాహన చేసుకున్నానని అన్నారు. ప్రధాని ఇందిరాగాంధీ భూ సంస్కరణలు తెచ్చినపుడు దేశానికి మంచి జరుగుతుందని అనుకున్నా... అవి పేద వర్గాలకు నామమాత్రపు ప్రయోజనాన్ని మాత్రమే చేకూర్చాయి అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. అనంతరం భారీ మెజారిటీతో విజయం సాధించిన రాజీవ్ గాంధీ కూడా దేశానికి ఏమీ చేయలేకపోయారని విమర్శించారు.

పేదరికం పోవాలంటే విప్లవాత్మక మార్పు అవశ్యం

దేశంలో పేదరికం పోవాలంటే మాటలు చెబితే, ఉపన్యాసాలు ఇస్తే చాలవని కేసీఆర్ అన్నారు. విప్లవాత్మక ధోరణితో మార్పు తీసుకువస్తేనే దేశం ముందుకు పోతుందన్నారు. పారిశ్రామికవేత్తలకు రాయితీలు ఇచ్చినపుడు పేదరికంలో మగ్గుతున్న రైతులకు పంట పెట్టుబడి మద్ధతు ఎందుకు ఇవ్వకూడదని ప్రశ్నించారు. సామాజిక వెనకబాటుతనం, హక్కుల కోసం దళితులు, గిరిజనులు జీవితకాలం పోరాడాల్సిందేనా?, ఇవన్నీ మాట్లాడుతుంటే జైలుకు పోతారని బెదిరిస్తున్నారు... ఇదేం ప్రజాస్వామ్య వ్యవస్థ అని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనుంచి ఆ రెండు జాతీయ పార్టీల బెదిరింపులు నడవవు... మేం నూటికి నూరుపాళ్ళు నిజాయితీతో ఉన్నాం... మమ్మల్ని ముమ్ముటుంటే భస్మమైపోతారు, జాగ్రత్త అంటూ కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరికలు చేశారు.

కేసీఆర్ కొత్త కూటమికి

పరిశీలనలో రెండు పేర్లు

• భారత్ నవ నిర్మాణ సమితి లేదా భారత్ పునర్నిర్మాణ సమితి • జాతీయస్థాయి నేతలతో చర్చించాకే ఫ్రంట్ పేరుపై తుది నిర్ణయం • ఫ్రంట్ తొలి సమావేశం హైదరాబాద్‌లో నిర్వహణకు సన్నాహాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: జాతీయ స్థాయిలో కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీలకు ధీటుగా తృతీయ ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తున్న టీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు నూతన కూటమికి పెట్టాలనుకుంటున్న పేర్లపై పూర్తి స్థాయిలో మంతనాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కూటమి ఏర్పాటును స్వాగతించిన జాతీయ నేతలతో ఆయన సుదీర్ఘ సంప్రదింపులు జరుపుతున్న సంగతి తెలిసిందే. అత్యంత విశ్వసనీయ వర్గాల కథనం ప్రకారం కూటమికి భారత్ నవ నిర్మాణ సమితి(బీఎన్ ఎస్), భారత్ పునర్నిర్మాణ సమితి(బీపీఎస్) పేర్లను పెడితే ఎలా ఉంటుందన్న అంశంపై చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. దేశాన్ని పునర్ని ర్మాంచాలన్న సమయం ఆసన్నమైందని.. కొత్తగా కూటమికి పునర్నిర్మాణ సమితి నామకరణం చేయడం ద్వారా దేశ రాజకీయాలను మలుపు తిప్పవచ్చన్న భావనతో కేసీఆర్ ఉన్నట్లు సమాచారం. ఈ రెండు పేర్లపై తెరాసకు చెందిన ఆంతరంగికులతో ఒక దఫా చర్చలు జరిపిన కేసీఆర్.. కూటమికి ఇంకా ఎటువంటి పేర్లు పెడితే బాగుంటుందోనన్న దానిపై సలహాలు, సూచనలివ్వాలని కోరినట్లు చెబుతున్నారు. నూతన కూటమి ఏర్పాటుకు కలిసి వచ్చే పార్టీల అధినేతలను కలిసి వారితో కూటమి పేరుపై చర్చలు జరిపి అంతిమ నిర్ణయానికి రావాలని కేసీఆర్ భావిస్తున్నట్లు సమాచారం. కొత్త కూటమి ఏర్పాటుకు సంబంధించి జాతీయస్థాయిలో మద్దతు కూడగట్టేందుకు సరికొత్త వ్యూహంతో ముందుకు సాగాలని కేసీఆర్ భావిస్తున్నారు. అందులో భాగంగా లోక్‌సభ సమావేశాలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో ఢిల్లీ వెళ్లి ఆయా పార్టీల నేతలను, ప్రతినిధులతో సమావేశం కావాలని ప్రతిపాదించారు. సోమవారం నుంచి లోక్‌సభ మలివిడత సమావేశాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నెలాఖరు వరకు కొనసాగనున్న ఈ సమావేశాల సందర్భంగా హస్తిన వెళ్లేందుకు కేసీఆర్ తన పర్యటనను ఖరారు చేసుకోవాలని భావిస్తున్నారు. కేసీఆర్ తన నేతృత్వంలోనే మూడో ప్రత్యామ్నాయం ఏర్పాటు కావాలన్న పట్టుదలతో ఉన్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

సార్వత్రిక ఎన్నికలకు మరో ఏడాది మాత్ర మే సమయం ఉన్నందున ఈ లోపు కొత్త ప్రత్యామ్నాయం ఏర్పాటుపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తూనే రాష్ట్రంలో పార్టీ బలోపేతం, వచ్చే ఎన్నికల్లో తిరిగి పార్టీని అధికారంలోకి తీసుకురావడం కోసం రచించాల్సిన వ్యూహంపై కూడా చర్చించి తగు విధంగా నిర్ణయాలు తీసుకోవాలని కేసీఆర్ భావిస్తున్నారు. మహారాష్ట్రలో బీజేపీతో తెగదెంపులు చేసుకున్న పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ, శివసేన, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ) అధినేత శరద్ పవార్‌తో మంతనాలు జరపాలని వీరిని కలిసేందుకు ఈ వారంలోనే ముంబై, కోల్‌కతా వెళ్లాలని కేసీఆర్ భావిస్తున్నట్లు సమాచారం. జాతీయ పార్టీల నేతలు, ముఖ్యులతో తృతీయ ఫ్రంట్‌పై పూర్తిస్థాయిలో చర్చలు జరిపాక అవసరమైతే హైదరాబాద్‌లోనే తొలి సమావేశాన్ని నిర్వహించి అన్ని పార్టీల నేతలను ఆహ్వానించాలని కేసీఆర్ సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలుస్తోంది.

'జై తెలంగాణ' నుంచి 'జై భారత్'

• జాతీయస్థాయి నాయకుడిగా కేసీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఉద్యమ నేత నుంచి ప్రభుత్వాధినేత వరకూ ఎక్కడ ఏ బహిరంగ సభలో ప్రసంగం చేసినా ముగింపులో 'జై తెలంగాణ' అని చెప్పడం తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుకు అలవాటు. కానీ ఇప్పుడు తన దృష్టి, ఆలోచన రాష్ట్రం నుంచి జాతీయ స్థాయికి విస్తరించడంతో స్వరం మారింది. దేశంలో ప్రత్యా మ్నాయ రాజకీయ కూటమికి నేతృత్వం వహిస్తున్న కేసీఆర్ ఆదివారం ప్రగతి భవన్‌లో అభిమానులు, కార్యకర్తలను ఉద్దేశించి బహిరంగ ప్రసంగం చేశారు. దాదాపు 40 నిమిషాల పాటు కొనసాగిన ఈ ప్రసంగం పూర్తయిన తర్వాత 'జై భార త్' అంటూ ముగించారు. దేశంలో అతిపెద్ద రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, భాజపా విధానాలను వ్యతిరేకిస్తూ తృతీయ ఫ్రంట్‌తో ఆయన జాతీయ స్థాయి నాయ కుడిగా ఎదుగుతున్నారు.

హైందవధర్మం... సర్వోత్తమం!

• ఇతర మతాల ప్రలోభాలను ఎదిరించండి • దేవాలయాలను భ్రష్టు పట్టిస్తున్న దేవాదాయశాఖ • విశాఖ శారదాపీఠాధిపతి శ్రీస్వరూపానందేంద్ర స్వామి

కాకినాడ, ప్రభన్యూస్ ప్రతినిధి: వారానికోరోజో, రెండు రోజుల్లో ప్రార్థనా మందిరానికి వచ్చి చేసిన పాపాలు చెబితే పోతాయట..వారి దేవుడు ముళ్ళ కిరీటం ధరిస్తాడట.. ముత్తైదవులు సాంప్రదాయమైన బొట్టు, కాటుక పెట్టుకోకూడదట.. మతం మారిపోతే నజరానాలు ఇచ్చేస్తారట.. ఇదీ కొన్ని మతాలు చేస్తున్న ప్రచారం. ఇలాంటి తప్పుడు ప్రచారాలకు లొంగిపోయి కన్న తల్లిలాంటి హిందూ మతాన్ని వదలకండి. తల్లిదండ్రుల్లాగే మన మతమును అంటూ విశాఖ శారదాపీఠాధిపతి శ్రీస్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ బోధించారు. స్వామి వారి ప్రవచనాలు వినేందుకు భారీగా భక్తులు తరలి వచ్చారు. దేవాలయాలపై పెత్తనం చేస్తూ ఆలయాలను భ్రష్టు పట్టిస్తూ దేవాదాయశాఖ దేవుని ఆస్తులు అన్యాక్రాంతం చేస్తోందని ఆరోపించారు. అర్చకులకు సరైన జీతాలు కూడా చెల్లించడం లేదంటూ ఆయన ఆ శాఖపై మండిపడ్డారు.

ఒక్కరోజు జిల్లా పర్యటనకు విచ్చేసిన విశాఖ శారదా పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ కరప, కాకినాడ సిటీ, కాకినాడ రూరల్ తదితర మండలాల్లో ఆదివారం విస్తృతంగా పర్యటించారు. పలు చోట్ల భక్తులనుద్దేశించి ప్రసంగాలు చేశారు. పాదయాత్రలు చేశారు. స్వామీజీ మాట్లాడుతూ హిందూ మతానికి సాటి మరేదీ లేదన్నారు. ఆలయాలు, నదులు, పర్వతాలు, సంస్కృతీ సంప్రదాయాలు ... ఇలా ఎన్నో ఇందులో ఇమిడిఉన్నాయన్నారు. ముత్తైదవులు పసుపు రాసుకుని బొట్టూ కాటుక పెట్టుకుని సాక్షాత్తూ మహాలక్ష్మీ దేవిలా కన్పించడం మన సాంప్రదాయమన్నారు. అయితే గత కొంతకాలంగా గ్రామాలను లక్ష్యంగా చేస్తూ మత మార్పిడిలు ప్రోత్సహించేందుకు కుట్రలు జరుగుతున్నాయని, ప్రలోభాలు ఎర వేస్తున్నారన్నారు. దేశంలో పచ్చనిప్రకృతి సోయగాలతో కులం, మతం, పేద, గొప్ప అన్న తేడా లేకుండా అంతా ఒకచోట చేరి ఐకమత్యంగా ఉంటారు. పండుగలు పెద్దత్తున చేసుకుంటారు. అలాంటి గ్రామాల్లో మత మార్పిడిల పేరిట కొన్ని శక్తులు కుట్రలు, దాడులకు దిగుతున్నాయి. ఇలాంటి వారిని తరిమికొట్టండని పిలుపునిచ్చారు. హైందవ ధర్మంలో భగవంతునికి భక్తునికి మధ్య అనుబంధం ఉంటుంది. భక్తులు తెలిసీతెలియక కొన్ని తప్పులు చేసినా వాటి నివృత్తి కోసం భగవంతుడిని అర్చిస్తారు. దేవుడు కాపాడతాడని నమ్ముతారు. యజ్ఞ యాగాదులు, పూజలు ఇలాంటివే అన్నా





రు. అయితే ఓ మతానికి చెందిన దేవుడు ముళ్ళ కిరీటం ధరిస్తాడట..దేవుడే ముళ్ళ కిరీటం ధరిస్తే మరి భక్తులు ఇంకేం ధరించాలంటూ ఎద్దేవా చేశారు. సిరిపురం సాయిబాబా ఆలయంలో బాబాకు స్వర్ణకిరీటం పెట్టారు. మన దేవునికున్న గొప్పతనమదన్నారు. సత్కర్మలాచరించండి.. దేవునిపై నమ్మకం కలిగి ఆధ్యాత్మిక భావాలు అలవరచుకోండి..సాధు సంతువులను గౌరవించండి, గురువు, తల్లిదండ్రులను పూజించండి అంతా మంచే జరుగుతుందంటూ సూచించారు. హిందూ ధర్మం వంటి గొప్ప ధర్మం ప్రపంచంలో మరెక్కడా లేదన్నారు. భక్తునికి భగవంతునికి మధ్య వారధి అర్చకులను, అలాంటి వారికి కనీస వేతనాలు కూడా ఇవ్వకుండా దేవాదాయశాఖ కర్ర పెత్తనం చేస్తోందని మండిపడ్డారు. ఈశాఖ దేవుని ఆస్తులు కాపాడడం మాని భ్రష్టు పట్టిస్తోందని దుయ్యబట్టారు. చివరకు అర్చకులకు గ్రాట్యూటీ వంటి సౌకర్యాలు కూడా నిలిపివేయడం బాధాకరమన్నారు. అర్చకుల సమస్యల పరిష్కారం, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు తాను ఎలాంటి పోరాటానికైనా సిద్ధమేనని ఆయన ప్రకటించారు. వేలాదిగా భక్తులు స్వామీజీ ప్రవచనాలు విని తామంతా హిందూ ధర్మ వ్యాప్తికి పాటుపడతామని ప్రతిజ్ఞ చేశారు. శారదాపీఠం గోదావరి జిల్లాల కన్వీనర్ చాగంటి సూరిబాబు, పీఠం కాకినా ప్రతినిధులు డాల్ఫిన్ వెంకన్న, సాయి తదితరులు పాల్గొన్నారు.

భారతీయ రిజర్వ్ బ్యాంక్
RESERVE BANK OF INDIA
www.rbi.org.in

3 సంవత్సరాల రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీస్ వేలం

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ₹1,400.00 కోట్ల (ముఖ్య విలువ) మొత్తాన్ని వేలం ద్వారా విక్రయించడానికి ప్రతిపాదించింది.

మల్టిపుల్ ప్రైస్ ఫార్మాట్ క్రింద రాబడి ఆధారిత వేలం భారతీయ రిజర్వ్ బ్యాంకు కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ (E-Kuber) మీద మార్చ్ 06, 2018 (మంగళవారం)న నిర్వహించబడుతుంది. మరింత సమాచారం కొరకు మార్చ్ 01, 2018 (గురువారం) తేదీ నాటి భారతీయ రిజర్వ్ బ్యాంకు వారి పత్రికా ప్రకటనను RBI వెబ్ సైట్ (www.rbi.org.in) ను చూడండి.

"మీకు డబ్బు ఆశచూపుతూ వచ్చే ఇమెయిల్స్/ఎస్ఎంఎస్‌లకు/కాల్స్ వల్ల మీరు మోసపోవద్దు"

ఆంధ్రప్రభ సారస్వత వేదిక

సాహితీగవాక్షం

ఆత్మను ప్రజ్వలింపజేసే మునిపల్లె రాజు కథలు

''రాజుగారు సాహిత్యంతోనూ జీవితంలోనూ ఏ ఇజానికీ కాక కేవలం జీవితం తాలూకు నిజాలకే కట్టుబడ్డారు. వారి కథల్ని చదివే సాధకుడు రాజుగారు ఎంత విశాలమైన సాహిత్య ప్రపంచంలో తిరుగాడి వచ్చారో అర్థం చేసుకుంటాడు. అంత విస్తృతమూ అగాథమూ నిగూఢమూ అయిన జీవితానుభవాలూ, అంత విశాలమైన సాహిత్య పఠనమూ, నిర్భయంగా, నిస్సందేహంగా ఏ సంకుచిత సిద్ధాంతాలకీ కట్టుబడక పోవడమూ - మనిషీ, మానవత్వమూ విశాల సంస్కారమూ రాజు గారి హృదయ సంపద కావడమూ వల్ల తెలుగు కథా సాహిత్యానికి వైట్ హౌసుల్లాంటి కథల్ని రాజుగారు నిర్మించగలిగారు''


అన్నారు బి.వి.రామిరెడ్డి. కొంత మంది దీనిని అంగీకరింపరు. నిబద్ధత లేనప్పుడు ఇలాగే పొగుడుతారని అంటారు. కానీ రాజు గారి కథల్ని పై పైన కాకుండా లోతుగా చదివి అనుశీలన చేసినప్పుడు పై మాటల విలువ తెలుస్తుంది. ఏ ఇజాలకీ కట్టుబడని కొందరు మాత్రమే విలక్షణ కథలు, బతుకు వెతుకులాట కథలు రాయగలరనటానికి మునిపల్లె వారి కథలు సాక్ష్యాలు.

''రాజుగారు హృదయ మున్న మార్క్సిస్టు. జీవితం తెలిసిన సైంటిస్ట్ అన్నిటినీ రంగరించగల ఆల్కెమిస్టు'' అని పోరంకి దక్షిణామూర్తి మాటల్లోనూ నిజం లేకపోలేదు. అందుకే ఒక్క మాటలో చెప్పాలంటే'' జీవితం సంక్లిష్టమైనది. జీవితం ఇదీ అని ఎవరూ చెప్పలేరు. రాజుగారి కథలు జీవితం లాంటివి'' అనిపిస్తాయి.

తాత్త్వికత్వ వాస్తవికత
వాస్తవికత్వ నిగూఢత్వం
నిగూఢత్వంప సాంఘికత్వం
నిజాయితీప జ్ఞానధార

ఇన్ని, మరో ఇన్ని కలిపితే రాజుగారి కథలవుతాయి. వీరి కథలన్నీ అనే అనేకానేక జీవిత కోణాల నుంచి పుట్టిన ముడి సరుకులే. ''గొప్ప కథకుడు'' వంటి మాటలు కంటే కథకులకు కథకుడాయన అనాలి. కథా సాహిత్యంపై కొత్త వెలుగు ఆయన.

రాజుగారు చిన్నతనంలోనే సుఖదుఃఖాలను అనుభవించారు. తన చుట్టూ ఉన్న వాతావరణం నుంచీ, పుస్తక పఠనం నుంచీ, కుటుంబ స్థితిగతుల నుంచీ అనుభవసారాన్ని గ్రహించి, వాటిని మననం చేసుకుంటూ కలం పట్టారు. మిలిటరీ ఉద్యోగం వల్ల దేశమంతా తిరిగి భిన్న భిన్న సంస్కృతీ వైవిధ్యాల మధ్య బతికారు. వైరుధ్యాలను ఆకళింపు చేసుకున్నారు. ఆంగ్ల గ్రంథాల పఠనానుభూతి ఉండనే ఉంది. మునిపల్లె రాజుగారు పరిచయం అయిన తర్వాతనే ఆయన కథలు కొన్ని చదివాను. ఆయన అనుభవాలు కథలుగా రూపొందాయని తెలుసుకున్నాక, ఆయన వ్యక్తిత్వం అవగతం అవుతుండగా చదివాను. అప్పుడనిపించిన ప్రశ్నలివి.



వారి కథల్ని బట్టీ ఆయన అంతర్ముఖుడా?
వైయుక్తిక భావనల ఏకాకితనం
మెంచిదేనా?
ఎవరికైనా చింతనా ధోరణీ తప్పదా?
జీవితం అనిశ్చితం ఎందుకవుతోంది?


రాజుగారి కథల్లో ''వారాల పిల్లాడు'' కథ ప్రసిద్ధమే. బాగా బతికిన కుటుంబం ఆర్థికంగా పతనమైతే కొడుకు 'వారాల పిల్లాడు'గా బతుకుతాడు. ఈ తరానికి ఏమో గాని మా తరానికి 'వారాలాబ్బాయిలు' అనే ప్రత్యేక కేటగిరీ ఉండేది.ఎక్కువగా బ్రాహ్మణ పిల్లవాళ్ళు. అప్పటి చేదు అనుభవాలను భద్రపరచుకొన్నారు రాజుగారు చివరికి వారాల పిల్లాడు బొంబాయిలో దాదాల గొడల్లో హత్య చేసేటంతగా మారిపోతాడు. ఏమిటీ జీవన విచిత్రం అనిపిస్తుంది. జీవిత చిత్రణ అంటే ఉద్యమాలే కాదు సామాజిక జీవనతాత్వికత కూడా అని రాజుగారు చెప్పినట్లనిపిస్తుంది. బిచ్చగాళ్ళ జెండా, అరణ్యంలో మానవయంత్రం, భోగం మనిషి, కనకమహాలక్ష్మి వంటి కథలు మనిషిని తిరగేసి చూపిస్తాయి. విడిపోయే పరిస్థితుల్లో ఉన్న ఒక సంసారాన్ని కలిపిన కల్లోల గౌతమి కథనూ రాశారు. రాయలసీమ కథను రాజుగారు రాయటం ఆయన మానవతా హృదయాన్ని ఎఱుక పరుస్తుంది. ''వీరకుంకుమ'' కథ శూరత్వాన్ని తెలియజేస్తుంది. పల్నాటి పౌరుషం అన్నమాట ఉంది కానీ రాయలసీమ పౌరుషం అనరు. రాజుగారు 'శూరత్వం'గా చెప్పారు. కరువు కాటకాలను, భయంకర పరిస్థితుల్నీ ఎదుర్కొంటూనే, మోసాలూ మర్మాలూ తెలీని రాయలసీమ వాసుల్ని సంస్కృతీ అభిమానులుగా, స్థైర్యం కలవారిగా ''వీరకుంకుమ'' కథ రాశారు. బాంబుల సీమగా చెప్పబడే సీమవాసుల మరో జీవిత పార్శ్వాన్ని పట్టుకున్నారు రాజుగారు.

అతి సహజమైన సంఘటనలతో రూపొందించి కథ ''బిచ్చగాళ్ళ జెండా'' ఈ కథలో యల్లమంద, మురుగేశ్ వంటి బడుగు మనుషుల దుస్థితినీ భోగాలాల్ దోపిడీని కళ్ళకు కట్టించారు. బడుగు వర్గాలు, పీడితులు ఏకం కావాలనీ, జనశక్తిని దీనికి వాడుకోవాలనీ ఈ కథ సందేశమిస్తుంది. ఇక్కడ వర్గ సంఘర్షణను చిత్రీకరించారు. ''పాముకాటు'' కథ ఉద్యోగవిరమణ తర్వాత ఏర్పడే దుర్భర పరిస్థితుల్ని తెలుపుతుంది. అయితే ఇవాళ ఆ పరిస్థితి లేదు. అన్ని సదుపాయాలూ కల్పించబడ్డాయి. అందరి బాల్యం విరబూసిన మందారం కాదు. భయంకరమైన చేదు అనుభవాలూ ఉంటాయి. అవి తర్వాత జీవితాన్ని శాసిస్తాయి. ఇది మనస్తత్వ శాస్త్రమూ చేసే ప్రతిపాదన. ఈ నేపథ్యం గల కథ ''చిరంజీవి''. రాజుగారికి ''సెంటిమెంట్''పై నమ్మకం ఉందని కొన్ని కథలు చెప్తాయి. దీనికి మంచి ఉదాహరణ ''దొడ్డమ్మవారసులు'' కథ. దొడ్డమ్మ అంటే పెద్దమ్మ. దొడ్డ అంటే మంచి అని కూడా. రాజు గారు దొడ్డమ్మను ఆధ్యాత్మిక సంపదకు, సంప్రదాయానికి ప్రతీకగా తీసుకున్నారు. దొడ్డమ్మల వంటి వారి వల్లనే సంస్కృతీ సంప్రదాయాలు బతికి బట్ట కడుతున్నాయని ఈ కథ చెప్తుంది. ఇవాళ ఆర్థిక సంబంధాలు తప్ప హార్థిక సంబంధాలు లేవంటున్నాం. ఈ సత్యాన్ని ''ఆస్తిహక్కు'' కథలో రాజుగారు ఎప్పుడో చెప్పారు. ఆస్తి మానవ సంబంధాలను ఎలా విచ్ఛిన్నం చేస్తుందో, జీవితాలను అతలాకుతలం చేస్తుందో మనం రోజూ చూస్తునే ఉన్నాం.ఎప్పుడో రాసినా రాజుగారి కథలు చాలా వరకు సమకాలీనమైనవిగా ఉంటాయని తెలుసుకున్నాం. అటువంటి మరొక వాస్తవికత నిండిన కథ ''వైద్యోనారాయణోహరిః'' ప్రాణం కాపాడావలసిన వైద్యులు, సామాజిక బాధ్యత గల వైద్యులు ఇవాళ ఎంత మంది ఉన్నారు? ముఖ్యంగా కార్పొరేట్ ఆస్పత్రుల్లో గల వైద్యులు జలగల వంటి వారని నిత్యం చదువుతున్నాం, చూస్తున్నాం. రకరకాల (అవసరమైన) పరీక్షలతో జనాన్ని విప్పి చేస్తున్న వైద్యుడు నారాయణుడు ఎలా అవుతాడని రాజుగారు నిలదీస్తారు. మునిపల్లెవారు కొన్ని ప్రేమ కథలూ రాశారు. ఇద్దరు ప్రేమించుకొని ఆర్థిక క్రుంగుబాటు వల్ల ఆత్మహత్యకు ప్రయత్నిస్తూ చివరికి ''జీవితం దేవతల దరస్మితం'' అనుకొని జీవిస్తారు. నేటి ప్రేమికుల కిది గొప్ప గుణపాఠం. ఆడపిల్లలు ఉద్యోగం చేసి కుటుంబాన్ని ఆదుకోవాలని చెప్పే కథ కూడా రాజుగారే రాశారు. ''యశోద కొడుకు'' లాంటి కథ నేటికీ మనల్ని వెంటాడుతుంది. కళ జీవితానికి ఆసరా అని చెప్తుంది ''సరోజ'' కథ. ఇవన్నీ ఒక ఎత్తు . తెలుగు కథలో ''మ్యాజిక్ రిలయలిజమ్'' ప్రవేశ పెట్టడం ఒక ఎత్తు. ఆరెస్సను దర్శనం వంటి వారు అస్తిత్వవాదం వైపు మొగ్గు చూపారు. ''మ్యాజిక్ రియలిజమ్''కి కొన్ని పేర్లు ఉన్నా నేను ''అతీంద్రియ వాస్తవికత'' అంటున్నాను. మనిషి, కోపం, ద్వేషం, కక్ష, అగాథం, అనుభూతుల వంటి సమ్మేళనం ''మ్యాజిక్ రియలిజమ్'' అనవచ్చు. జీవితంలోని ప్రతి సంఘటననూ హేతువాద దృష్టితో చూసి అర్థం చేసుకోలేం. జీవితం ఒక పెద్ద కాన్వాసు. రాజుగారు దానిని తనజీవిత తాత్వికతతో వైవిధ్య వర్ణభరితం చేశారు. అందుకే వారి కథల్లో తాత్విక దృక్పథం అంతస్సూత్రంగా కనిపిస్తుంది. ''దివోస్వప్నాలతో ముఖాముఖి'', ''అస్తిత్వానికి ఆవలి తీరం'' వంటి కథా సంపుటాలతో మ్యాజిక్ రియలిజమ్ గమనిస్తాం. మిగిలన కథల్లో లేదని కాదు - ఈ సంపుటాలలో అది ఒక ప్రయోగంగా స్థిరపడింది. నెత్తురు కంటే ధన సంస్కృతి చిక్కనైనది. బలవంతమైనదని చెప్తారు. ''దంపతులు'' అనే కథే కాదు - మ్యాజికిరియలిజమ్ కథలన్నీ అర్థం చేసుకోవడానికి పాఠకుడు తన ఆత్మజ్యోతిని వెలిగించి పరిశీలించాలి. మ్యాజిక్ రియలిజమ్ అన్నది నేల విడిచి సాము చేసేదిగా కనిపిస్తుంది గానీ మేథోమథనంతో అర్థం చేసుకోవాలి. కవిత్వంలో లాగా ఈ కథలూ అవగాహన చేసుకోవడానికి శ్రమించాలి. సంక్లిష్ట జీవిత కథ ఎప్పుడూ ఇలాగే ఉంటాయనిపిస్తుంది. అందుకే బి.వి.రామిరెడ్డి రాజుగారి కథల్ని బాగా విశ్లేషించి ''రాజు గారి కథలు వారు ప్రయత్నించి రాసినవి కావు ప్రయత్నించి' అని ఎందుకంటున్నానంటే ***- బాల్యం నుంచీ ఇప్పటిదాకా ఆయన జీవితపు బైప్రోడక్ట్సు''***

మార్క్సిజం కొంత - ఆర్ద్రత కొంత
ప్రేమ మరికొంత - వాస్తవికత మరికొంత
ప్రయోగం ఇంకొంత - విలువలు ఇంకొంత

అనుభవాల కొంత - సామాన్యతలో అసామానత కొంత - ఇన్నీ కలిస్తే మునిపల్లె రాజు కథలవుతాయి. సాత్వికత గలరాజుగారు హృదయ ఘోషకి ప్రతిబింబాలు వారి కథలు. నా దృష్టిలో శ్రీశ్రీలాగా కథల ద్వారా కొత్త టానిక్ ఇచ్చారనిపిస్తుంది. ఎవరి అంచనాకు అందని కథల మారాజు మునిపల్లెరాజు.

- ద్వా. నా. శాస్త్రి
9849293376



కవిత్వమంటే...!

కవిత్వమంటే ఒక తపన
మనస్సుకీ మేథస్సుకీ మధ్య సృజనాత్మక సమరం
కవిత్వమంటే ఒక తపస్సు
నిశిరాత్రి నిశ్శబ్దపు ఉచ్ఛ్వాస నిశ్వాసం
కవిత్వమంటే ఒక ఉషస్సు
లేలేత సూర్యుణ్ని చీల్చుకొచ్చే ఓ అగ్నికణం
కవిత్వమంటే ఓ సంఘర్షణ
భావుకతల శూలాలు రగిల్చే రణోత్సాహం
కవిత్వమంటే అలుపెరగని ఆత్మ ఘోష
జీవకోటి గుండె కవాటాలు తెరిచే లాకర్
కవిత్వమంటే ఒక యజ్ఞం
అక్షరాన్ని అగ్గిపువ్వుగా చేసి వేసే ధూపం
కవిత్వమంటే ఓ ఔషధం
దురాలోచనల అనారోగ్యానికి జీవన్‌టోన్
కవిత్వమంటే ఓ సాహితీ ప్రక్రియ
తెలుగుభాషకి వన్నెలద్దిన ఓ అలంకారం
కవిత్వమంటే ఓ అన్వేషణ
మానసికోల్లాసాల పడవకు దిక్సూచి
ఇవన్నీ కవిత్వానికి ప్రతిరూపాలే..
కాని బహురూపాలు కావు
కవిత్వమంటే కేవలం అక్షరాలు కాదు
అంతర్ముఖుడి నిశ్శబ్ద మేథోమథనం!
కవిత్వం విశ్వాంతర్యామి...సర్వాంతర్యామి
సుజనాంతర్యామి!
అందుకే కవిత్వమంటే ఒక్క ముక్కలో...జీవితం!

- వయ్యస్సారెస్
9000013367

ఎగుడు-దిగుడు

దేని కోసమైతేనేం
మెట్లెక్కుతున్నప్పుడల్లా
కొంత ఆయాసమే!

దిగటమూ
ఏమంత దిగజారుడు తనం కాదు

ఎత్తుపల్లాలు ముద్దాడంది జీవితం అర్థం కాదు!

ఎగబాకుతున్నంత సేపు
ఒక అహం వెంటాడుతది
మెట్టు దిగు! ఆత్మ పరిశీలన మొదలైతది!

కరచాలనాలు
ఆలింగనాలు దూరమవుతున్న కొద్దీ
ఒక ఒంటరి తనం ఏపుక తింటది!

సంహాసనాలన్నీ




ఒట్టి ప్రతీకలు మాత్రమే
జన రంజన లోపిస్తే దిష్టి బొమ్మలే!

ప్రయాణమంటూ మొదలెట్టాక
ఎగుడు దిగుడు లెక్కిస్తూ పోతే
కొత్త దారులు విచ్చుకోవు!!

- కోట్ల వెంకటేశ్వరరెడ్డి
9440233261

జ్ఞానాన్ని పెంచే వ్యాస సరాలు



అరుణవ్యాస్ నిత్య అధ్యయనశీలి, సంస్కృతాంగ్ల, తెలుగుభాషల్లో మంచి ప్రావీణ్యం గల వారు. వారు వ్యాసకర్తగా ప్రతిభ చాటుకున్నవారు. వారి కలం నుండి జాలువారే ప్రతి వ్యాసము ఒక సందేహాన్ని అందిస్తూ పాఠకుల్ని అబ్బురపరుస్తుంది. ఎందుకంటే ప్రతి వ్యాసంలోనూ సందోర్భచితంగా కవితల్ని, పాటల్ని, మహానుభావులు ప్రవచనాల్ని, ప్రాచీన, ఆధునిక కవుల పద్యాల్ని కోట్ చేస్తూ ఆ వ్యాసానికి కొత్త సొబగుల్ని అద్దుతారు. అందుకే ఆమె వ్యాసాల్ని చదవడమంటే జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని పొందటమేనని చెప్పవచ్చు. ఇప్పటికే పది గ్రంథాలనందించిన అరుణావ్యాస్ ఇప్పుడు 'సారస్వత సరాలు' పేరుతో మరో వ్యాస సంపుటిని అందించారు.

ఆమె వ్యాసాలలో తెలుగు కుటుంబాలు, తెలుగు వారి అనుబంధాలు, ప్రేమలు, ఆత్మీయతలు అన్నీ మనల్ని మమతల కోవెలల్లోకి నడిపించుకుపోతాయి. అరుణావ్యాస్ 'సారస్వత సరాలు' వ్యాస సంపుటిలో మొత్తం పదిహేడు వ్యాసాలను చేర్చి అందించారు. ఇక ఈ వ్యాసాలకు పెట్టే పేర్లు కూడా అమితంగా ఆకట్టుకుంటాయి. ఈ వ్యాస సంపుటిలోని మొదటి వ్యాసం 'మనసున మల్లెల మాలలూగెనే! ఈ వ్యాసంలో భార్యాభర్తల అనుబంధాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు. ఇల్లాలి యొక్క ఔన్నత్యాన్ని చూపిస్తూ ఆలయాన వెలసిన ఆ *దేవుని రీతీ/ఇల్లాలే ఈ జగతి జీవన జ్యోతి వంటి పాటలనే గాక బద్దెన రాసిన సుమతీ శతకంలోని ''కులకాంతతో నెప్పుడు/గల హింపకు వట్టి తప్పు ఘటియింపకుమీ/కలకంఠ కంటి కన్నీరొలికిన/ సిరియింటనొల్లదు సుమతీ!''*

ఇలాంటివి కోట్ చేయటం వల్ల ఆ వ్యాసానికి ఒక నిండుదనం వచ్చింది. రెండవ వ్యాసం ''రావమ్మ మహాలక్ష్మి రావమ్మా'' ''నీ కోవెల ఈ ఇల్లు'' ఈ వ్యాసంలో బాల్య వివాహాలు వల్ల ఆడపిల్లలు అన్యాయమైపోతున్నా పరిస్థితులను చూపించారు. ''మన దేశంలో ఇంకా జరుగుతున్నా ఈ బాల్య వివాహం ఒక ఆరని చిచ్చు, ఒక వదలని జాడ్యం, ఒక మాయని గాయం అంటూ ఆవేదన చెందుతారు. ఈ వ్యాసంలో గణంకాలతో సహా వివరించారు. మూడవ వ్యాసం ''తెలుగదేలయన్న దేశంబు తెలుగు'' ఈ వ్యాసంలో తెలుగు భాష యొక్క చరిత్రను సమగ్రంగా చర్చించారు. 'సృష్టిలో తీయనిది స్నేహమేనోయి' పేరుతో రాసిన వ్యాసంలో 'వేసవి సెలవులోచ్చేశాయోచ్' అనే వ్యాసంలో వేసవి సెలవుల్లో పిల్లలు ఏ రకంగా తమ విజ్ఞానాన్ని, మంచి అలవాట్లను ఎలా అలవరచుకోవచ్చో వివరిస్తూనే సెలవుల్ని సద్వినియోగం చేసుకోవడానికి పలు సూచనలు చేశారు అరుణావ్యాస్. ఆడవాళ్ళు - ఆత్మరక్షణ/ కోరలు చాచిన కల్తీ భూతం, కొడిగడుతున్న చిరుదివ్వెలు వంటి వ్యాసాలలో మనకు కర్తవ్య బోధ చేస్తూనే ఏలా సమాజంలో మెలగాలో సూచించారు. 'శాంతి కపోతం వినువీధుల్లో ఎగరనీ' అనే వ్యాసంలో సర్వమానవులు శాంతితో సహజీవనం సాగించాలనే సందేశమిస్తారు. *''స్వేచ్ఛ శాంతి వృద్ధి వెలయంప/ బాల సంఘమొకటి పాదుగొలిపి / ధైర్య సాహసముట త్యాగబుద్ధి కలిగి / మెలుగుడయ్య సతము తెలుగు బిడ్డ''* అంటూ నార్ల చిరంజీవి రాసిన పద్యాన్ని ఈ వ్యాసంలో చూడవచ్చు.

సదా మీ సంరక్షకుణ్ణి ! పేరుతో పోలీసులు పడుతున్న శ్రమను, వారి త్యాగాలను తెలుపుతూ ఒక కవితను ఈ పుస్తకంలో అందించారు *అరుణావ్యాస్. పోలీసంటే న్యాయం, ధర్మం/ పోలీసంటే శాంతీ, భద్రత/ పోలీసంటే ఓర్పు, నేర్పు/ పోలీసంటే ధైర్యం, స్థైర్యం/ పోలీసంటే అమూల్య త్యాగం అంటారీ కవితలో.* 'పువ్వులు విరిసిన నవ్వులు' అనే వ్యాసంలో డా॥ పుల్లెల రామచంద్రుడు రాసిన వ్యంగ్య శతకం కుమతీ శతకం గురించి అందులోని హాస్యధోరణి గురించి సమగ్రంగా చర్చించారు.

'నిరంతరం ఉజ్వలంగా దీప్తించే దీపం' అనే పేరుతో రాసిన వ్యాసంలో మరణం లేని ఆత్మ గురించి ఆధ్యాత్మిక జ్ఞానానికి దారులు పరుస్తూ వివరించారు. 'అతి మధురం అన్నమయ్య పదం' పేరుతో ఒక వ్యాసం ఈ పుస్తకంలో లభిస్తుంది. ఈ వ్యాసంలో అన్నమయ్య భక్తి తత్వాన్ని, అన్నమయ్య పదాల్లోని విశిష్టతను గూర్చి చర్చించారు అరుణావ్యాస్.

రామాయణ పాత్రల వైశిష్ట్యం 'రామాయణంలో ప్రతిపాత్రకు ఒక ప్రత్యేకత ఉంది. అట్టి పాత్రల వైశిష్ట్యాన్ని గొప్పగా వివరించారామె.

'నాటి గుర్తుల నీడలో సాహిత్య సేద' అన్న వ్యాసంలో వ్యాస్ గారి గురించిన జ్ఞాపకాలను, వారి సేవలను అరుణగారు తన తండ్రి గురించిన జ్ఞాపకాలను అందించారు.

జీవితం ఎక్కడో మొదలై ఎన్నో మలుపులు తిరుగుతూ, కొన్ని తీపి జ్ఞాపకాలను, మరికొన్ని చేదు జ్ఞాపకాలను మిగులుస్తూ సాగుతుంటుంది. అట్టి జ్ఞాపకాలను తలుచుకుంటె నాన్నలలోకి ప్రయాణించినట్టుంటుంది. ఏది ఏమైనా జీవితాన్ని చివరి కొరకు కొనసాగించాల్సిందే. సేద తీరటానికి ఏదో ఒక మార్గం దొరకకపోదు అలాంటి అంతర్లీన సందేశం ఈ వ్యాసంలో ఉంది. మొత్తానికి ఈ వ్యాసాలు అరుణావ్యాస్ ప్రతిభకు నిదర్శనాలని చెప్పక తప్పదు. ఇంత మంచి వ్యాసాలందించినందుకు అరుణావ్యాస్‌కు అభినందనలు.

- నియోగి
9553097319

కాలాన్ని జయించే కవిత్వం

కాలానికి ఎంత కడుపు ఉబ్బో
దేన్నీ అలానే ఉంచదు
అన్నింటికీ వార్ధక్యం అద్దుతుంది.

అంటూ కరిగిపోతున్న కాలాన్ని జయించే ఒకే ఒక విశ్వనరుడు కవి మాత్రమేనని శ్రీ ముప్వా శ్రీనివాసరావు అంటారు. సమాంతర ఛాయలు 6 ఎలిమెంట్ రచనలతో సాహితీ రంగంలో తనదైన ముద్ర వేసిన శ్రీనివాసరావు.

జీవితంలో గాయమంటూ ఉంటే ఎప్పుడో
ఒకప్పుడు అది గేయమవుతుంది.

అంటూ సమాంతర ఛాయలలో హృదయ వేదనలోని లోతైన భావనా వీచికలకు శిల్పాన్ని అద్దారు శ్రీనివాసరావు.

వానరుడా...నరుడా..రేపటి విశ్వనరుడా..
ఆలోచన లకు మరణం లేదు మొదలెట్టింది మనం
కాదు..
ముగింపు పలికేది మనం కాదు

అంటూ భ్రమల్లో ఉండే సగటు మనిషి అత్యాశను మూర్ఖత్వంగా తేల్చి కర్తవ్యోన్ము ఖులను చేస్తారు

కలలు కనలేని సముద్రపు అలలకు కనులను
ఆకాశానికి మనస్సును
ఇచ్చి చూడమను

అంటూ అధివాస్తవికతను స్పృశిస్తూ మనిషికి ఉండే భావనలు ప్రకృతిస్తే ప్రపంచం ఎలా ఉంటుందో ఊహిస్తారు ఈ కవి. ఇది స్పష్టమైన భావకవిత్వ ఛాయలుగా కన్పిస్తాయి.

వాడికి వెన్నెల్లో తడిసి
ప్రేమ జలుబు చేసింది
ఎండల్లో కాగి
వేదాంతం అబ్బింది

అంటూ బ్రతుకు పోరాటంలో కష్టసుఖాలలో సగటు మనిషి ఆలోచనలను తన అక్షరాలలో వ్యక్తీకరించారు. లేనిది ఉన్నట్లుగా భ్రాంతి చెందే మధ్య తరగతి మనిషి నడవడికను వెర్రి తనంగా చెప్పారు.

మనసు మడి తడి పేందుకు
కాసిన్ని కన్నీళ్ళు కావాలి

అంటూ బాధా తప్త హృదయానికి స్వాంతన కన్నీరే 'నని, సున్నిత భావాల సుడిగుండాలలో కొట్టుకుపోయే గాయపడిన గుండెలను వ్యక్తీకరించే ప్రయత్నం చేశారు.

అరిగిన ఎముకల చప్పుడు
నేపథ్యంలో వినపడే విషాద స్వరాలకు
విరుగుడ గీతాలు రాయాలనిపిస్తుంది

ఆశావాదానికి ప్రతీకగా నిలిచిన ఈ కవితలో



నిస్పృహా, నిరాశావాదం, నిస్తేజంతో నిశీధిలో కొట్టుకుపోయే తరానికి నూతన జవసత్వాలను అందించే ప్రయత్నం చేశారు.

అమ్మనాన్నల ప్రేమామృతం గురించి చెబుతూ

ఆ ప్రేమాయస్కాంత లోకం చుట్టూ
రోజు కాసేపు తిరుగుదాం
అప్పుడు అక్కడ కట్టిన కరెంట్ లో
మనల్ని మనం రీచార్జ్ చేసుకుందాం
బతుకు బడిలోకి మళ్ళీ దిగుదాం

అంటూ ప్రతి మనిషిజ తన తల్లిదండ్రుల మూలాల నుండి, వారి ఆవాజ్య ప్రేమానురాగాల పరిష్వంగం లో మాత్రమే నూతన ఉత్తేజాన్ని, జీవితం పట్ల అంతులేని ఆశను పొందుతారని కుండ బద్దలు కొట్టారు

కరెన్సీ కంపు కారు మేఘాల్లా కమ్ము కుంటే
మానవత్వ పరిమళాలు
మంటగలిసిపోతున్నాయి

ధనమదాంధకారంలో కరెన్సీ నోట్ల వెంట దురాశతో అంతేలేని స్వార్థంతో పరుగెడుతున్న వికృత సమాజాన్ని సూటిగా ప్రశ్నిస్తూ ఈ సమాజాన్ని మనకు పరిచయం చేసే ప్రయత్నం చేశారు.

ధనయాగం జరుగుతోందక్కడ
పెట్రోమాక్స్‌లైట్ల మధ్య
మన ఊళ్లో జరిగే
తిరునాళ్ళ జూదమే
విశ్వరూప సందర్శనమిస్తుందక్కడ
లాస్‌వెగస్ అట...

పాశ్చాత్య నాగరికత పేరిట వినాశన కారిణిగా జూదం తయారయ్యిందని కేవలం వినోదంగా మనం చూసి జూదం సమస్త ఆర్థిక వ్యవస్థను, కుటుంబ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తుందనే అభిప్రాయాన్ని, ఆవేదనను వెలిబుచ్చారు.

జరిగిపోయినవి
బాగానిపిస్తున్నాయి
జరుగుతున్నప్పుడు
అవెందుకు బాగాలేవో..?

గడిచిన కాలంలో అనుభవించిన బంగారు క్షణాలను పునఃసమీక్షిస్తూ గతం తాలుకు అద్భుతాన్ని అప్పటి అనుబంధాల ఒరవడి ఇప్పుడు లేదని వగస్తూ అప్పుడెందుకు బాగాలేవో అంటే తరం యొక్క ఆలోచనలు ముందుకు నడవడమే ఎప్పటి స్థితి అప్పుడు ఆమోదించలేకపోవటానికి కారణమంటారు.

వాస్తవిక దృక్పథం, ముక్కుసూటిదనం, సామ్య వాద ధోరణి, భావకవితాంశ, అధివాస్తవికత, ప్రకృతి లో మమేకం కావటం తరం తరం మధ్య అంతరానికి వారిధిగా నిలబడే ప్రయత్నం, దిగంబర కవిత్వ ఛాయలు, సంఘంలోని వికృత తత్వాన్ని నిర్భయంగా ప్రశ్నించే గుణం వీటన్నిటి రూపమే శ్రీనివాసరావు కవిత్వం.


భౌతిక, గతితార్కిక వాద నేపథ్యం నుండి లౌకిక, అలౌకిక ప్రపంచంలోకి పరకాయ ప్రవేశం చేసి అక్కడి భావావేశాలను అవాహన చేసుకుని కవితా ధారలను ప్రవహింపచేస్తున్న ఈ కవి భవిష్యత్తులో సమకాలీన సాహితీ ప్రక్రియల దృక్పథానికి నూతన దారులను ప్రవేశపెడతారనటంలో ఎటువంటి సందేహం లేదు.

- అట్లూరి వెంకటరమణ
9177237945

ఉదారంగులో అంతరంగపు ఆవిష్కరణ!

కలలు పండించే కవిత్వం వర్తమాన కవితారంగంలో ప్రతిభ, సృజనశక్తి కలిగిన కవి విజయచంద్ర. దేశీయ సంస్కృతుల్ని చిన్నాభిన్నంచేసి వ్యాపార సంస్కృతిని విస్తృతం చేస్తున్న సామ్రాజ్యవాది తత్వాన్ని ఎత్తిచూపుతూ ' ***పంచభూతాలు అమ్మకం సరుకు చేసిన/ వ్యవస్థ/ నిర్దయ క్రింద/ నలిగిపోయి/ చీమలా/ చనిపోయా/. ఇక వెన్నెల సూర్యరశ్మి వారమ్ము తీరు/సముద్ర కెరటాలూ అమ్ము తారు''*** అంటూ దోపిడీకి పతాకమెత్తిన బహుళ జాతి సంస్థలో మానసిక ఆంతర్యాన్ని అద్భుతంగా ఆవిష్కరిస్తాడు కవి. తన కవితా సంపుటి ''ఊదారంగు కలలు''లో సమసమాజ ఆశావాదాన్ని, రాజకీయ చైత న్యాన్ని, ప్రేమతత్వాన్ని, విప్లవభావాల్ని, ప్రకృతి ఆరాధనను, మానవసంబంధాలను, ఎంతో నేర్పుగా తన కవితల్లో ఆవిష్కరించాడు విజయచంద్ర. **''మురికి ప్రపంచం వద్దు/ దుర్గంధాలొద్దు/ మనిషి మీద కత్తి దూసే కర్పణ్యాలొద్దు/చొంగ కార్చే మాటలొద్దు/ నంగినంగి వంగి వంగి తొంగి తొంగి చూసే దొంగ చూపులొద్దు/ అతివినయపు నటనలొద్దు/ గొంతుకోసే చాకులొద్దు/ తల్లి కడుపు చీల్చే చాకులొద్దు/మాయలతో మసకబారించే/ ప్రయత్నా లొద్దు/మాటలన్న తక్షణం/ చాకిరేవుకేయండి/ ఉతికేస్తాం''** అంటూ నయవంచకుల, కపట ప్రేమికుల, కుటిల మనస్కులకు హితవు పంపుతాడు కవి.

ఆధునిక కవికి ఉండాల్సిన నిబద్ధత ఈ కవికి ఉంది. అందుకే కవిత్వానికి జీవితానికీ ఉన్న సంబంధం ఊడా ఈ కవి గుర్తించాడు. **''నువ్వు గాలిలో వాక్యాలు రాస్తే/ అందుకొని మురిసిపోతా/ నువ్వు గులాబి విసిరితే/ నే వసంతం సృష్టిస్తా/ రా ఇద్దరం కల్సి ఒకసారి నాట్యం చేద్దాం/** అంటూ కవికి సామాన్య మానవునికి ఉన్న అనుబంధాన్ని వణికిస్తారు కవి. ఈ కవి వీరు లక్షణాల్ని, లక్ష్యాల్ని ఎంతో గొప్పగా ఆవిష్కరించాడు.



వీరుల లక్షణం'' **అవమానాలకు చలించరు/ బెదిరింపులకు భయపడరు/ ప్రలోభాలకు లొంగిపోరు/ అట్లే వీరి లక్ష్యాలు ''జవనాశ్వాలను సిద్ధంచేస్తారు/ మరణాలకు ఊపిర్లూదుతారు/ ఆవేదనలకు భరోసా యిస్తారు/...శస్త్రంతో శాస్త్రంతో సిద్ధంగానే ఉంటారు/ జనంలోనే జనంతోనే ఉంటారు/ జనాన్ని సృజనం చేసుకుంటారు''** అంటారు. ఈ కవి తన కలాన్ని కరవాలంగా ఝళిపిస్తారు. సామాజిక బాధ్యత వహిస్తాడు. అలుముకున్న దోపిడీ చీకట్లను పారద్రోలే వెలుగు కిరణాలను కవితా వాక్యాలుగా వెలువరిస్తాడు. **''కాలం గుహలోంచి/సింహంలా వస్తా/ సర్వ విధ్వంసక మూలాలు లాక్కుపోయేందుకు/ ఎంత దూరం పరిగెత్తుతానో నాకే తెలియదు/ ...గొప్ప ఆవేశంతో వస్తా/...**నంటూ తన మనో ప్రవృత్తిని వ్యక్తీకరిస్తాడు కవి. గాంధీ మహాత్ముని గూర్చి **''అర్ధదిగంబరుడు/ ఆర్త పారాయణుడు/ ఆవేదనాశీలి/ దీనజన హితోపకారి/ నిర్మోహి /మహితాత్ముడు/ చరితాత్ముడ/ సచ్ఛీలుడు/ జన హృదయ విజేత/ ధూర్తుని గుళ్లతో/ నేలకూలిన నాతండ్రి/** అంటూ పుట్టెడు దుఃఖంలోకి వెళ్లిపోతాడు కవి ''ఆయన'' అనే కవితలో.

''వాడొస్తే'' అనే కవితలో ఒక వీరుణ్ని గూర్చి వర్ణిస్తూ **''మానవత అంచుమీద/చరించేవాడు/నీతి శిలువను మోస్తూ/ తరచూ జైళ్లలో/ న్యాయస్థానాలలో /కనిపిస్తున్నాడు/ వాడొస్తే/ దొంగలగుంపు/పనిపడ్తాడు''** అంటాడు.

కవిత్వం రహస్యం తెలిసిన కవిగా విజయచంద్ర అన్ని కవితల్లోను తనదైన ముద్ర వేస్తూ కవిత్వాన్ని పండించారు. ఈ కవితా సంపుటిలో 69 కవితలున్నాయి. ఇంతవరకు 8 కవితా సంపుటాలు వెలువరించిన విజయచంద్ర ఎంతో అనుభవాన్ని సంపాదించారు. మంచి కవితలు ఎన్నింటినో ఇందులో చదివి పాఠకులు ఆనందిస్తారు. ఇది అందరూ చదవదగిన కవితా సంపుటి.

- కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి
9948774248

సాహిత్య వార్తలు

బిసీ కవిత్వ సంకలనానికి కవితలకు ఆహ్వానం

మహాత్మా జ్యోతిభాపూలే ఆలోచనలు విస్తరించుకుంటూ దేశవ్యాపితంగా బీసీ చైతన్యం పదునెక్కుతున్నా నేపథ్యంలో బీసీ తాత్త్విక చింతనతో ఎవరి కులమూలాల నుంచి వాళ్ళు రాసుకోవలసి ఉందని, తమ కులవృత్తుల, సంస్కృతుల, చరిత్ర, సామాజిక అంశాల నేపథ్యంలో బీసీ కవుల నుంచి కవిత్వాన్ని ఆహ్వానిస్తున్నాం. బృహత్తర బీసీ సంకలనం తీసుకురావాలన్నా తలంపుతో ఈ పనికి పూనుకోవడం జరిగింది. 25వ తేదిలోగా మీ కవితలను పంపవలసినదిగా కోరుతున్నాం.

పంపవలసిన చిరునామా: జూలూరి గౌరిశంకర్, ఎం.ఎస్.కె.టవర్స్, ఫ్లాట్ నెం.410, స్ట్రీట్ నెం.11, హిమాయత్ నగర్, హైదరాబాద్ - 500 026.

రచనలకు ఆహ్వానం

సాహితీగవాక్షం పేజీకి సమకాలీన సాహిత్యంపై మీ అభిప్రాయాలను, రచనలను ఆహ్వానిస్తున్నాం. మీ రచనలుsahithigavaksham@ gmail. com పంపగలరు.

చిరునామా: ఎడిటర్, ఆంధ్రప్రభ, సాహితీ గవాక్షం పేజీ, రోడ్ నెం. 9, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, హైదరాబాద్ -500033

'కార్తి'పై సీబీఐ 120 ప్రశ్నల వర్షం

ఎదురుగా సహ వ్యవస్థాపకురాలు ఇంద్రాణి



ముంబై: కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం కుమారుడు కార్తి చిదంబరాన్ని సీబీఐ ఆదివారం ప్రశ్నలపరంపరతో ముంచెత్తుతోంది. ఐఎన్ఎక్స్ మీడియా టెలివిజన్ కంపెనీలో విదేశీ పెట్టుబడులకు అనుమతుల మంజూరులో కార్తి పాత్ర ఉన్నట్లు సీబీఐ ఆరోపిస్తోంది. ఆయనను ఆదివారం ముంబైలోని బైకుల్లా జైలుకు తీసుకొచ్చారు. ఆ జైలులో ఐఎన్ఎక్స్ మీడియా సహ వ్యవస్థాపకురాలు ఇంద్రాణీ ముఖర్జియా ఉన్నారు. ఆమెను, కార్తిని జైలులోని ఓ ప్రత్యేక గదిలో ఉంచి సీబీఐ ప్రశ్నిస్తోంది. జైలు అధికారులను లోనికి అనుమతించలేదు. వీరిని ప్రశ్నించేందుకు సీబీఐ 120 ప్రశ్నలు సిద్ధం చేసినట్లు సమాచారం. తొలి దశలో ఇంద్రాణితో కలిపి ప్రశ్నిస్తుందని, రెండో దశలో ఇంద్రాణి భర్త, ఐఎన్ఎక్స్ మీడియా వ్యవస్థాపకుడు పీటర్ ముఖర్జియాతో కలిపి కార్తిని ప్రశ్నిస్తుందని తెలుస్తోంది.

సీబీఐ ఆరోపణల ప్రకారం ఇంద్రాణి ముఖర్జియా ఆ దర్యాప్తు సంస్థకు వాంగ్మూలం ఇచ్చారు. దీనిలో ఐఎన్ఎక్స్ మీడియాలో రూ.300 కోట్ల విదేశీ పెట్టుబడుల ప్రతిపాదనలకు ప్రభుత్వ అనుమతి కోసం న్యూఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో చిదంబరంను కలిశారు. అయితే, ఆమెతోనూ, ఆమె భర్త పీటర్ ముఖర్జియాతోనూ ఆయన మాట్లాడారు. తన కుమారు కార్తి వ్యాపారానికి సహాయపడాలని ఈ దంపతులను చిదంబరం కోరారు.

వివిఐపీ వాహనాలకు త్వరలో నెంబర్ ప్లేట్లు

ఢిల్లీ హైకోర్టుకు కేంద్రం వివరణ

న్యూఢిల్లీ: భారత రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, గవర్నర్లు...లెఫ్టినెంట్ గవర్నర్ల వాహనాలకు రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్లు లేకపోవడాన్ని తప్పుపడుతూ ఢిల్లీలోని ఒక సామాజిక కార్యకర్త హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేయడంతో, త్వరలోనే ఆయా వాహనాలన్నింటికీ రిజిస్టర్ నెంబర్ ప్లేట్లు ఏర్పాటు చేస్తామని కేంద్రప్రభుత్వం కోర్టుకు తెలియజేసింది. వివరాలలోకి వెళితే, రాష్ట్రపతి భవన్, ఉప రాష్ట్రపతి, గవర్నర్లు మరియు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన వాహనాలను భారత మోటార్ వాహనాల చట్టంక్రింద నమోదు చేయకపోవడాన్ని గుర్తించిన న్యాయ భూమి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి రాజేష్ అగర్వాల్ ఢిల్లీ హైకోర్టులో పిల్ వేశారు. రాజ్యాంగాధిపతుల వాహనాలను రిజిష్ట్రేషన్ చేయక పోతే...తీవ్రవాదులు తేలికగా గుర్తించి దాడులు చేసే ప్రమాదం వుందని పేర్కొంటూ వెంటనే చర్య తీసుకోవాల్సిందిగా ఆయన ఆ పిటిషన్‌లో కోర్టుకు విజ్ఞప్తి చేశారు. రిజిష్టర్ చేయని వాహనాలను వెంటనే సీజ్ చేయాల్సిందిగా పోలీస్ కమిషనర్‌ను ఆదేశించవలసిందిగా ఆయన ఆ పిటిషన్‌లో డిమాండ్ చేశారు.

రాజేష్ అగర్వాల్ పిటిషన్ పై స్పందించిన హైకోర్టు ఈ విషయమై సంబంధితశాఖకు ఈ ఏడాది జనవరి 2వ తేదీన లేఖ రాసింది. దీంతో కేంద్రంలో కదలిక వచ్చింది. రాజ్యాంగ అగ్రనేతల వాహనాలతోపాటు రాష్ట్రపతి భవన్, ఉపరాష్ట్రపతి కార్యాలయాలు మరియు విదేశాంగ శాఖ వినియోగిస్తోన్న వాహలన్నింటికీ త్వరలో రిజిష్టేషన్ ప్రక్రియ పూర్తి చేసి నెంబర్ ప్లేట్లను ఏర్పాటు చేస్తామని హైకోర్టుకు ఒక అఫిడవిట్ ద్వారా తెలియజేసింది.

పిఎన్‌బి స్కామ్..

నలుగురు అరెస్ట్

న్యూఢిల్లీ: పిఎన్‌బి కుంభకోణానికి సంబంధించి నీరవ్ మోదీ గ్రూప్ కంపెనీలకు చెందిన ఇద్దరు ఉద్యోగులు, ఒక ఆడిటర్, మెహుల్ చోక్సీకి చెందిన గీతాంజలి గ్రూప్ ఆఫ్ కంపెనీల డైరెక్టర్‌ను సిబిఐ ఆదివారం అరెస్టు చేసింది. పిఎన్‌బినుంచి మోసపూరితంగా లెటర్స్ ఆఫ్ అండర్ టేకింగ్(ఎల్‌ఒయులు) కోసం సమర్పించిన దరఖాస్తులను తయారు చేసారనే అభియోగంపై నీరవ్ మోడీకి చెందిన ఫైర్‌స్టార్ డైమండ్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌కు అప్పటి ఎజిఎం (ఆపరేషన్స్) మనీష్ కె బొసామియా, అప్పటి ఫైనాన్స్ మేనేజర్ మిథెన్ అనిల్ పాండ్యాను అరెస్టు చేసినట్టు అధికారులు తెలిపారు. ముంబైలో సంపత్ అండ్ మెహతా చార్టర్డ్ అకౌంటెన్సీ కంపెనీలోభాగస్వామి, ఆడిటర్ సంజయ్ రాంభియాను అరెస్టు చేశారు. మెహుల్ చోక్సీకి చెందిన గిలి ఇండియాకు అప్పటి డైరెక్టర్ అనియత్ శివరామన్‌ను కూడా అరెస్టు చేసినట్టు అధికారులు చెప్పారు.

ఢిల్లీలో ఢీ



నేటి నుంచి మళ్లీ పార్లమెంట్

- విభజన హామీల డిమాండ్లపై హోరెత్తనున్న ఉభయ సభలు
- ఏపీ ఎంపీలకు తోడుగా గళం విప్పనున్న తెలంగాణ ఎంపీలు

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టే అవకాశం ఉంది. అనంతరం సభ లోపల కూడా వెల్ లోపల నిలబడి నినాదాలతో సభను అడ్డుకునే ప్రయత్నం చేయనున్నారు. విభజన హామీలపై వాయిదా తీర్మానంతో పాటు 184 నిబంధన కింద చర్చకు తెలుగు రాష్ట్రాల పార్టీలతో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా పట్టుబట్టే అవకాశముంది.

ఇదిలా ఉంటే, పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు రూ. 12,700 కోట్ల మేర రుణం తీసుకుని, తిరిగి చెల్లించకుండా విదేశాలకు పారిపోయిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ ఉదంతం పార్లమెంటు ఉభయ సభలను స్తంభింపజేయనుంది. చోటా మోడీ అంటూ నీరవ్ మోడీ పరారీకి కేంద్ర ప్రభుత్వం పరోక్షంగా సహకరించిందని ప్రతిపక్షాలు ఇప్పటికే ఆరోపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై అధికార బీజేపీని ఇరకాటంలో పడేసేందుకు ఇప్పటికే వ్యూహాలు రచించుకున్నాయి. అయితే ప్రతిపక్షాల వ్యూహాలను తిప్పికొట్టే ప్రతివ్యూహాలతో భారతీయ జనతా పార్టీ కూడా సమాయత్తమైందని తెలుస్తోంది. నీరవ్ మోడీ ఉదంతం నేపథ్యంలో తాజాగా కేంద్ర కేబినెట్ ఆమోదించిన ''ఫ్యూజిటివ్ ఎకనమిక్ అఫెండర్స్ బిల్''ను ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టనుంది. నీరవ్ మోడీపై విమర్శించే పార్టీలు, ఈ బిల్లును ఆమోదించాలని తమ చిత్తశుద్ధి చాటుకోవాలని బీజేపీ ప్రతిపక్షాలను ఇరకాటంలో పడేసే అవకాశముంది. అలాగే కార్తీ చిదంబరం వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీని ఇరకాటంలో పడేస్తూ ఎదురుదాడి చేయాలని బీజేపీ నేతలు ప్రతివ్యూహాలు రచిస్తున్నారు. దీంతో ఈ సమావేశాలు తొలి విడత బడ్జెట్ సమావేశాల కంటే మరింత వాడీవేడీగా జరగనున్నాయి. ఈ సమావేశాల్లోనే నేషనల్ కమిషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్‌కి రాజ్యాంగ బద్ధత కల్పించే బిల్లుతో పాటు త్రిపుల్ తలాఖ్ నుంచి మహిళలకు రక్షణ కల్పించే బిల్లులను ఆమోదించేలా అధికార పార్టీ పావులు కదుపుతోంది. పైపెచ్చు ఈ నెలలో జరిగే రాజ్యసభ ఎన్నికల ద్వారా పెద్దల సభలో బీజేపీ బలం మరింత పెరుగుతోంది. దీంతో రాజ్యసభలో తగినంత బలం లేని కారణంగా నిలిచిపోయిన బిల్లులను వరుసగా ఆమోద ముద్ర వేయించే అవకాశం కూడా ఉంది.

కేంద్ర ప్రభుత్వంపై పోరాడండి: వైకాపాకు తెలుగుదేశం పార్టీ సూచన

ఓవైపు పార్లమెంటు సాక్షిగా అటు తెలుగుదేశం, ఇటు వైకాపా ప్రత్యేక హోదా కావాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ, ఇదే అంశంపై బయట మాత్రం పరస్పరం విమర్శించుకుంటున్నాయి. ప్రత్యేక హోదా డిమాండ్‌తో నేడు ఢిల్లీలో వైకాపా భారీ ధర్నా ప్రదర్శన చేపట్టిన నేపథ్యంలో తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఇందులో వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి తీరును తప్పుబడుతూ విమర్శనాస్త్రాలు సంధించింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై విమర్శలు చేయడం కాదు, విభజన హామీలు అమలు చేయాల్సిందిగా కేంద్రంపై పోరాడాలని పార్లమెంటరీ పార్టీ ప్రకటనలో పేర్కొంది. జగన్ తనకు ముఖ్యమంత్రి పదవికావాలని అడుగుతున్నారు తప్పపేదవాడికి రేషన్ కావాలని మాత్రం ఎప్పుడూ అడగలేదని ఎద్దేవా చేసింది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాదని జగన్‌కు తెలిసినా సరే, తమ రాజకీయ లబ్ది కోసం రాద్ధాంతం చేస్తున్నారని టీడీపీపీ ఆరోపించింది. రాజీనామా ప్రకటన, అవిశ్వాస తీర్మానం మొత్తం ఒక డ్రామా అని విమర్శించింది. ప్రజల మనోభావాలకు అనుగుణంగా తెలుగుదేశం పార్టీ పార్లమెంటులో చేస్తున్న పోరాటానికి జాతీయ స్థాయిలో అన్ని పార్టీలు మద్దతిస్తున్నాయని, కానీ వైకాపా మాత్రం విమర్శిస్తూ రాజకీయ ప్రయోజనాలు చూసుకుంటోందని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ ఆరోపించింది. అధికారంలో లేని సమయంలో సైతం తమ పార్టీ ఉత్తరాఖండ్ బాధితులను ఆదుకుందని గుర్తుచేస్తూ, రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేసిందని పేర్కొంది.

పోలవరంపై బీజేడీ పోరుబాట పార్లమెంటులో ఆందోళనకు నిర్ణయం

ఇరుగు పొరుగు రాష్ట్రాలతో ఉన్న నదీ జలాల వివాదాలపై ఒడిశాకు చెందిన బిజూ జనతా దళ్ పార్టీ పార్లమెంటులో పోరు బాట పట్టనుంది. ఈ మేరకు ఆ పార్టీ అధినేత, ఒడిశా సీఎం నవీన్‌పట్నాయక్ నేతృత్వంలో జరిగిన బీజేడీ పార్లమెంటరీ పార్టీ ఒక నిర్ణయం తీసుకుంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంతో మహానది జలాలపై నెలకొన్న వివా దాన్ని పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన మహానది ట్రిబ్యునల్‌ను త్వరగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయడంతో పాటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపివేయాలని ఆ పార్టీ ఎంపీలు ఆందోళన చేపట్టనున్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు కారణంగా తమ రాష్ట్రంలో ముంపు ప్రాంతాలు, పరిహారంపై స్పష్టత నివ్వకుండా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టరాదని ఆ రాష్ట్ర నేతలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. దీంతో పాటు వరికి మద్దతు ధర, రాష్ట్రం మొత్తాన్ని ఒకే రైల్వే జోన్ పరిధిలోకి తేవడం, రాష్ట్రానికి ప్రత్యేక హోదా వంటి ఇతర అంశాలపైనా ఆ పార్టీ ఎంపీలు ఉభయ సభల్లో ఆందోళన చేపట్టనున్నారు. దీంతో జాతీయ పార్టీలకు తోడు, ఏ కూటమిలోనూ లేని ప్రాంతీయ పార్టీల ఆందోళనలు పార్లమెంటు ఉభయ సభలను కుదిపేయనున్నాయి.

మహాత్మున్ని కదిలించిన మధుశాల కవిత!

తండ్రి కవితాసంపుటిపై ట్విట్టర్‌లో అమితాబ్



ముంబై: మహాత్మా గాంధీ కనుక అండగా లేకుంటే తన తండ్రి, ప్రముఖ కవి హరి వంశ్‌రాయ్ బచ్చన్, ఆయన వెలువరించిన మధుశాల కవితా సంపుటి విమర్శకుల చేతుల్లో ఇబ్బందులు పడేవని మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ వెల్లడించారు. 1933లో సరిగ్గా 85 సంవత్సరాల క్రితం ప్రచురించబడిన మధుశాల ఇప్పటికీ తనదైన అద్భుతమైన భావజాలాన్ని, దీర్ఘాయువును సంతరించుకుందని అని బిగ్‌బి తన బ్లాగ్‌లో ఆదివారం రాసుకొచ్చారు. 1935లో బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో తొలి సారిగా మధుశాల కవితాగానం చేశారు. కవితాప్రియులు కరతాళధ్వనులతో పెద్దఎత్తున ప్రశంసించారు. అదే సమయంలో కొందరు కువిమర్శకులు తన తండ్రిపై మహాత్మాగాంధీకి ఫిర్యాదు చేశారని అమితాబ్ తెలిపారు. ఈ యువకుడు(హరివంశ్‌రాయ్ బచ్చన్) మద్యం లక్షణాలను కవితాత్మకంగా వర్ణించడం ద్వారా భారతీయ యువతను పాడు చేస్తున్నాడు. ఇతడిని ఆపాలి లేదా అరెస్టు చేయాలి అని మహాత్మాగాంధీకి వారు ఫిర్యాదు చేశారని ఆయన చెప్పారు. ఇంతటి నిరసనలకు కారణమైన మధుశాలను వినాలని ఉందని తన తండ్రికి జాతిపిత కబురు పంపించారని అమితాబ్ తెలిపారు. కబురు అందుకున్న మరుక్షణం మహాత్ముని ముంగిట నిలిచిన హరివంశ్‌రాయ్ బచ్చన్ కవితల్లో కొన్ని పంక్తులను చదివి వినిపించారు. శ్రద్ధగా ఆలకించిన బాపూజీ దీనిలో అభ్యం తరకరమైనది ఏముంది అని సందేహం వ్యక్తం చేశారని బాలీవుడ్ మెగాస్టార్ తెలి పారు. దాంతో ఊపిరి పిల్చుకున్న తన తండ్రి మహాత్ముని మనసు మారకముందే అక్కడి నుంచి గబగబా వెళ్ళిపోయారని చెప్పారు.

స్వేచ్ఛా నౌకాయానానికి చేతులు కలపండి

వియత్నాం అధ్యక్షుడు ట్రాన్ డైక్వాంగ్

న్యూఢిల్లీ: రాబోయే శతాబ్దం...ఇండో-ఆసియా పసిఫిక్ శతాబ్దమని, అన్ని దేశాలు అధికార ఆధిపత్య భావాలను వదిలిపెట్టి స్వేచ్ఛా నౌకాయానానికి చేతులు కలిపితేనే ఈ కల సాకారమౌతుందని వియత్నాం అధ్యక్షుడు ట్రాన్ డైక్వాంగ్ అన్నారు. ఈ ప్రాంతంలో చైనా సైనిక సన్నాహాలపై ఆదివారం ఆయన స్పందిస్తూ ఈ ప్రకటన చేశారు. భారత పర్యటనలో వున్న ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ, భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వానికి తమ దేశం మద్దతిస్తుందని తెలిపారు. ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపరచుకోవడంలో, రాజకీయ, రక్షణ మరియు భద్రత అంశాలు మూలస్తంభాలుగా వుంటాయని ఆయన అన్నారు. ఈ విషయంలో భారత్‌కు తాము పూర్తిగా సహకరిస్తామని అధ్యక్షుడు ట్రాన్ పేర్కొన్నారు. హిందూ మహాసముద్రం, ఆసియా-పసిఫిక్ తీర ప్రాంతాలు కొత్తకోణంలో ప్రగతి వైపు పయనిస్తున్నాయని, అయితే కొన్ని దేశాల ఆధిపత్య పోరు వల్ల అంతర్గతంగా సవాళ్లను ఎదుర్కొంటున్నాయని చెప్పారు. దక్షిణ చైనా సముద్రం వివాదంతో పాటు కొరియా ఉపఖండం వివాదం, బీజింగ్-టోక్యో మధ్య నెలకొన్న సెంకకు ఐలాండ్స్ భూభాగ వివాదాలు ఈ ప్రాంతాన్ని పట్టి పీడిస్తున్నాయని ఆయన వివరించారు. అంతర్జాతీయ చట్టాలకనుగుణంగా ఈ వివాదాలను సాధ్యమైనంత త్వరలో పరిష్కరించుకోవడానికి తాము తమ వంతు కృషి చేస్తున్నామని అధ్యక్షుడు ట్రాన్ చెప్పారు. ఇండియా-వియత్నాం ద్వైపాక్షిక సంబంధాలలో భాగంగా 2020 నాటికి 15 బిలియన్ డాలర్ల వాణిజ్య లక్ష్యాన్ని సాధించేందుకు ఉభయ దేశాలు సంయుక్త ఒప్పందం కుదుర్చుకున్నాయి.

మేఘాలయ సీఎంగా కోన్రాడ్ సంగ్మా..!

- ఫలించిన బీజేపీ వ్యూహం
- కాంగ్రెస్ రహిత ప్రభుత్వ ఏర్పాటుకు ఇతర పార్టీల మద్దతు
- రేపు ప్రమాణ స్వీకారం



షిల్లాంగ్: మేఘాలయలో బీజేపీ వ్యూహం ఫలించింది. ముఖ్యమంత్రిగా బీజేపీ కూటమి నాయకుడు , నేషనల్ పీపుల్స్ పార్టీ అధ్యక్షుడు కోన్రాడ్ సంగ్మా రేపు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. గవర్నర్ గంగా ప్రసాద్ ను కలిసిన సంగ్మా కూటమి తమకు 34 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని తెలిపారు. ఎన్నికల్లో ఎన్‌పిపి 19 స్థానాల్లో గెలుపొందగా..ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలు, ఆరుగురు యూడీపీ ఎమ్మెల్యేలు, ఇద్దరు హెచ్ఎస్‌పిడీపీ ఎమ్మెల్యేలు, నలుగురు పిడీపీ ఎమ్మెల్యేలు, ఒక స్వతంత్ర ఎమ్మెల్యే మద్దతు పలకడంతో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు సంగ్మా సిద్ధమయ్యారు.

యూడీపీ అధ్యక్షుడితో కేంద్రమంత్రి రిజిజు

బీజేపీ నేత, కేంద్ర మంత్రి కెరిన్ రిజిజు యూడీపీ అధ్యక్షుడు డాంకూపర్ రాయ్‌తో భేటీ అయి మేఘాలయలో కాంగ్రెస్ రహిత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు డాంకూపర్‌తో విస్తృతంగా చర్చలు జరిపారు. మేఘాలయలో బీజేపీది నామమాత్రపు పాత్రే, అయితే ఎన్పీపీ అధినేతతో చర్చలు జరిపింది కేంద్రంలో అధికారంలో ఉన్న తమ పార్టీ మద్దతు తెలిపేందుకే అన్నారు. ప్రాంతీయ పార్టీల మద్దతుతో కాంగ్రెస్ విముక్త ప్రభుత్వ స్థాపనే తమ లక్ష్యం అన్నారు. యూడీపీ జనరల్ సెక్రటరీ జెమినో మాథ్యూ మాట్లాడుతూ కాంగ్రెస్ రహిత ప్రభుత్వానికే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. దీంతో కోన్రాడ్ సంగ్మాయే సీఎం పీఠాన్ని అధిష్టించేందుకు పరిస్థితులు అనుకూలించాయి.

కాంగ్రెస్ అభ్యర్థన తిరస్కరణ

మేఘాలయలో అన్ని రాజకీయ పార్టీల కంటే కాంగ్రెస్ పార్టీయే ఎక్కువ స్థానాలను కైవశంచేసుకుంది. మొత్తం 60 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ 21 స్థానాల్లో గెలుపొందినప్పటికీ మేజిక్ ఫిగర్ 31ని చేరుకునేందుకు ఇతర పార్టీల నేతలెవరూ మద్దతు తెలపకపోవడంతో గవర్నర్ ను కలిసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

రియోకు పూర్తి మెజార్టీ


32మంది ఎమ్మెల్యేలతో గవర్నర్ ఆచార్యను కలిసిన రియో



కోహిమా : మాజీ ముఖ్యమంత్రి నేఫియో రియోకు నాగాలాండ్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు పూర్తి మెజార్టీ ఉందని గవర్నర్ పీబీ ఆచార్య అన్నారు. ఆదివారం ఆయన ఎన్‌డీపీపీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేల్లో 32 మంది శాసన సభ్యుల సపోర్టు రియోకు ఉంది. 32 మంది శాసన సభ్యులు రియోకు సపోర్టు ఇస్తున్నట్టు సంతకాలు తీసుకొస్తే చాలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చు. బీజేపీతో నేషనలిస్ట్ డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డీపీపీ)తో జత కట్టిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని రియో గవర్నర్‌కు తెలియజేశారు. ఎన్‌డీపీపీ 18 స్థానాల్లో గెలుపొందగా, బీజేపీ 12 స్థానాలను కైవసం చేసుకుంది. జేడీ(యూ) ఎమ్మెల్యే జి.కటియో అయి, స్వతంత్ర అభ్యర్థి టోన్‌పాంగ్ ఓజుకుం తమతో జత కట్టినట్టు ఎన్‌డీపీపీ ప్రధాన కార్యదర్శి అబు మోహతా వివరించారు. శనివారం వెలువడిన నాగాలాండ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ-ఎన్‌డీపీపీ కూటమి స్పష్టమైన ఆధిక్యాన్ని సంపాదించలేకపోయింది. ఎన్‌డీపీపీ 16, బీజేపీ 11, ఎన్‌పీపీ 2, జేడీ(యూ) 1 స్థానాల్లో గెలుపొందారు. ఇప్పటికే నాగాలాండ్ జేడీయూ తమ మద్దతు బీజేపీకే ఇస్తామని ప్రకటించింది. ఇక స్వతంత్ర అభ్యర్థి కూడా బీజేపీకే మద్దతు తెలిపారు. ఇతరుల మద్దతు కలుపుకుంటే ఎన్‌డీపీపీ అభ్యర్థి రియోకు 32 సభ్యులు అండగా నిల్చున్నారు. దీంతో గవర్నర్ కూడా ప్రభుత్వ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఎన్‌డీపీపీ సీనియర్ నాయకుడు రియో తన పార్టీ అధ్యక్షుడు చింగ్‌వాంగ్ కొన్యాక్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విసాసోలీ ల్హోంగు, జేడీ(యూ) ఎమ్మెల్యే, స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థితో ఆదివారం గవర్నర్‌ను కలిశారు. రియో మూడు సార్లు నాగాలాండ్ సీఎంగా వ్యవహరించారు.

2040 నాటికి స్మార్ట్ ఫోన్‌తో

పర్యావ'రణం'



- పరిశ్రమల నుంచి పెరుగుతున్న ఉద్గారాలు
- అత్యధికంగా శక్తి వినియోగం
- 2020 నాటికి ల్యాప్‌టాప్ కంటే ఫోన్ ప్రమాదకరం
- మెక్‌మాస్టర్ యూనివర్శిటీ అధ్యయనం వెల్లడి

టోరంటో : సెల్‌ఫోన్ మనిషి శరీరంలో ఓ అవయవంగా మారింది. ఒక్క నిమిషం సెల్ కనిపించకపోతే చాలు ఇల్లు పీకి పందిరి వేసేంత పరిస్థితి దాపురించింది. చేతిలో చిన్న ఫోన్ కనిపిస్తే చాలు కింది నుంచి పైదాకా చూసే వాళ్లు లేకపోలేరు. స్మార్ట్ ఫోన్‌లు మనిషి జీవితంతో పాటు పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాయనే చెప్పొచ్చు. ఒకప్పటి పిచుకలు ఇప్పుడు కనిపించకుండా పోవడానికి టెక్నాలజీయే కారణం. పిల్లలకు పిచ్చుక అంటే ఇలా ఉంటుంది అని పుస్తకాల్లో చూపించాల్సిన పరిస్థితి దాపురించింది. తినడానికి తిండి.. కట్టుకోవడానికి బట్ట లేకపోయినా.. సరే.. కానీ చేతిలో స్మార్ట్‌ఫోన్ మాత్రం ఉండాల్సిందే. స్మార్ట్ ఫోన్లు, డాటా సెంటర్లు ముఖ్యంగా ఇన్‌ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీలు 2040నాటికి పర్యావరణాన్ని నాశనం చేస్తాయని ఓ అధ్యయనంలో వెల్లడైంది. వీటి కారణంగా పర్యావరణం అంతరించిపోతుందని పలువురు విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. కెనడాకు చెందిన మెక్ మాస్టర్ యూనివర్సిటీ లోతుగా అధ్యయనం చేసింది. పలు ఆసక్తికర విషయాలను మన ముందుకు ఉంచింది. స్మార్ట్ ఫోన్ మనిషితో పాటు పర్యావరణానికి ఎంత నష్టం చేకూర్చనుందో వివరించింది. కార్బన్ ఫుట్ ప్రింట్‌కు సంబంధించిన డివైజ్‌లు, స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌టాప్, ట్యాబ్‌లెట్లు, డెస్క్‌టాప్స్‌తో పాటు డాటా సెంటర్లు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లపై 2005 నుంచి పరిశోధనలు చేసింది. యూనివర్సిటీ పరిశోధకులు సాఫ్ట్‌వేర్‌లను కనుగొనడంతో పాటు ఇన్‌ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ) వినియోగంపై అధ్యయనం చేశారు. వారు భావించిన దానికంటే ఐసీటీల వినియోగంతో వెలువడే ఉద్గారాలు అధిక ప్రభావాన్ని కలిగి ఉన్నాయి. ఉత్పత్తి, నిర్వహణ ద్వారా కూడా వాతావరణంపై చెడు ప్రభావం ఉంటుందని తెలుసుకున్నారు. ఐసీటీ పరిశ్రమ అనేది రోజు రోజుకూ అభివృద్ధి చెందుతున్నది. అదేవిధంగా ఉద్గారాలు కూడా పెరుగుతూ వస్తున్నాయి అని మెక్‌మాస్టర్ అసోసియేట్ ప్రొఫెసర్ లోట్ఫీ బెల్‌ఖిర్ అంటున్నారు. ప్రస్తుతం దీని పరిమాణం 1.5గా ఉంది. ఇది కొనసాగుతూనే వస్తుంది. ఐసీటీ పరిశ్రమ అనేది 2040 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 14శాతానికి పెరిగే ఆస్కారం ఉంది. ప్రపంచ వ్యాప్తంగా రవాణా వ్యవస్థ అనేది సగం ఆక్రమించుకుంటుందని బెల్‌ఖిర్ చెప్పారు. ఫోన్ ద్వారా టెక్ట్స్ మెసేజ్ పంపినా.. కాల్ చేసినా... వీడియో డౌన్‌లోడ్ చేసినా.. అప్‌లోడ్ చేసినా... ఇలా ఏది చేసినా డాటా సెంటర్‌కు కనెక్ట్ అయి ఉంటుంది. టెలీ కమ్యూనికేషన్ నెట్‌వర్క్, డాటా సెంటర్‌కు అత్యధికంగా విద్యుత్ అవసరం ఉంటుంది. వీటికి కరెంట్ అనేది ఇంధనంగా కొనసాగుతూ ఉంటుంది. కంటికి కనిపించని శక్తి ఇందులో వినియోగించడం జరుగుతుంది. జనరల్ ఆఫ్ క్లీనర్ ప్రొడక్షన్ అనే బుక్ పేరుతో 2020 వరకు స్మార్ట్ ఫోన్స్ ద్వారా పర్యావరణం ఎలా నాశనం అవుతుందో తెలియజేయడం జరిగింది. వీటిలో కొన్ని సలహాలు, సూచనలు ఇచ్చారు. స్మార్ట్ ఫోన్స్ వినియోగిస్తున్న సమయంలో కొంత శక్తి వెలుబడుతుంది. కానీ తయారీ నుంచి మాత్రం 85 శాతం శక్తి పర్యావరణంలోకి విడుదల చేయడం జరుగుతుంది. స్మార్ట్‌ఫోన్స్‌లలో వినియోగించే చిప్‌లు, మదర్ బోర్డులు చాలా ఖరీదు కలిగినవిగా ఉంటాయి. ఓ కొత్తరకం మెటల్స్‌తో దీన్ని తయారు చేస్తారు. ఇది ఖర్చుతో కూడిన తయారీ. అంతే తరహాలో ఫోన్ నుంచి శక్తి విడుదల అవుతుంది. చాలా మంది అత్యధిక డబ్బులు వెచ్చించి స్మార్ట్ ఫోన్లు కొనుగోలు చేస్తారు. వీటి జీవిత కాలం చాలా తక్కువగా ఉంటుంది. కమ్యూనికేషన్ కంపెనీలు కూడా రెండేళ్లకో స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేస్తూ వస్తున్నది. 2020 నాటికి స్మార్ట్‌ఫోన్‌ల నుంచి వచ్చే ఉద్గారాలు ల్యాప్‌టాప్, కంప్యూటర్‌ల నుంచి కంటే ఎక్కువగా ఉంటాయని పరిశోధనలో వెల్లడైంది.

'నీచ రాజకీయాలకు ప్రజలు చరమగీతం పాడారు'



బెంగళూరు: ఈశాన్య రాష్ట్రాల ప్రజలు నీచ రాజకీయాలను వ్యతిరేకించి.. ఏకగ్రీవంగా బీజేపీకి పట్టంకట్టారని ప్రధాని మోడీ అన్నారు. కర్నాటకలోని తుమకూరులో రామకృష్ణ వివేకానంద ఆశ్రమంలో సిస్టర్ నివేదిక 150 జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన యూత్ కన్వెన్షన్ ను ఉద్దేశించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మోడీ ప్రసంగించారు. త్రిపుర ఎన్నికల ఫలితాలు తనకు రెట్టించిన ఉత్సాహాన్ని కలిగించాయన్నారు. నీచ రాజకీయాలను ఈశాన్య రాష్ట్రాల సోదర,సోదరీమణులు తిరస్కరించి బీజేపీకి ఏకగ్రీవంగా ఓటు వేశారని పేర్కొన్నారు. యువత శక్తి-నవభారత స్వప్నం అనేఅంశంపై ప్రసంగించిన ప్రధాని...కాంగ్రెస్,వామపక్షాల పాలనతో విసిగిపోయిన ఈ శాన్య రాష్ట్రాల ప్రజలు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం నిర్విరామంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, తీసుకుంటున్న విధాన పరమైన నిర్ణయాల వల్లే బీజేపీకి పట్టంకట్టారని స్పష్టం చేశారు. కాంగ్రెస్, వామపక్షాల మాదిరిగా తమ ప్రభుత్వం పనిచేయదని గుర్తించడం వల్లే ఎన్నికల్లో ప్రజలు బీజేపీ వైపు నిలిచారని చెప్పారు. ఇలాంటి వాతావరణమే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కర్నాటకలోనూ కనిపించబోతుందని మోడీ ధీమా వ్యక్తం చేశారు.

త్రిపుర సీఎం మాణిక్ రాజీనామా



అగర్తలా : కమ్యూనిస్టులకు కంచుకోటగా ఉన్న త్రిపురలో బీజేపీ విజయ ఢంకా మోగించింది. ఈ నేపథ్యంలో త్రిపుర ముఖ్య మంత్రి మాణిక్ సర్కార్ తన రాజీనామా పత్రాన్ని గవర్నర్ తథాఘట రాయ్‌కు ఆదివారం అందజేశారు. దీంతో 25 ఏళ్ల కమ్యూనిస్టుల పాలనకు తెరపడినట్టయింది. బీజేపీ-ఐపీఎఫ్‌టీ కూటమిగా త్రిపురలో గెలుపొందిన విషయం తెలిసిందే. కొత్తగా ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించే వరకు 1998 నుంచి ఉన్న మీరే సీఎంగా ఉంటారని గవర్నర్, మాణిక్ సర్కార్‌కు తెలియజేశారు. అనంతరం రాజ్‌భవన్ ఎదుట మాణిక్ సర్కార్ విలేకరులతో మాట్లాడారు. ప్రజల తీర్పునకు మేం కట్టుబడి ఉన్నాం. చాలా ఏళ్లు నేను, నా మంత్రివర్గం త్రిపురను పాలించాం. ప్రజలు, ఉద్యోగులు ఎంతో సహాయ సహకారాలు అందించారు. దీనికి సంతోషంగా ఉంది. పరిపాలనా విభాగానికి, ప్రజ లకు, స్టాఫ్ సభ్యులకు ఎప్పటికీ రుణ పడి ఉంటాను. బీజేపీ-ఐపీఎఫ్‌టీ కూటమిగా ఏర్పడి శనివారం త్రిపురలో గెలిచి చరిత్ర సృష్టించారు. 25 ఏళ్ల పాటు ఏకధాటిగా సీపీఎం పాలిస్తూ మేం కూడా చరిత్ర సృష్టించాం. బీజేపీ కూటమికి 43 సీట్లు రాగా, సీపీఎంకు 16 సీట్లు వచ్చాయి. ఫిబ్రవరి 18న 60 స్థానాల్లో 59 స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. సీపీఎం అభ్యర్థి మృతి చెందడంతో ఆ నియోజకవర్గంలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉందని మాణిక్ సర్కార్ తెలిపారు.

జయలలిత సమాధివద్ద

కానిస్టేబుల్ ఆత్మహత్య

చెన్నై: తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత సమాధివద్ద విధుల్లో ఉన్న కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మధురై ప్రాంతానికి చెందిన అరుణ్‌రాజ్ (28) అనే కానిస్టేబుల్ ఆదివారం ఉదయం జయలలిత స్మారక చిహ్నం వద్ద విధులు నిర్వహిస్తున్నాడని తెలిపారు. కాగా తన వద్ద ఉన్న 303సర్వీస్ రైఫిల్‌తో తెల్లవారు జామున మెడపైన కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడటంతో అక్కడికి అక్కడే ప్రాణాలు కోల్పోయాడన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియలేదన్నారు. కానిస్టేబుల్ ఆత్మహత్యపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

యూపీ ఉప ఎన్నికల్లో

ఎస్పీకి బీఎస్పీ మద్దతు

లక్నో: రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులుండరన్న నానుడికి ఉత్తర్ ప్రదేశ్ రాజకీయాలు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తున్నాయి. మొన్నటి వరకు అధికారంలో ఉన్న సమాజ్ వాదీ పార్టీపై బహుజన సమాజ్ వాదీ పార్టీ విమర్శలు ఎక్కుపెట్టింది. బీజేపీ అధికారంలోకి రాగానే రాజకీయాలన్నీ మారిపోయాయి. సీఎం యోగి ఆధిత్యనాథ్‌ను ధీటుగా ఎదుర్కొనేందుకు వచ్చే ఉప ఎన్నికల్లో సమాజ్ వాదీ పార్టీతో బహుజన సమాజ్ వాదీ పార్టీ చేతులు కలిపేందుకు సిద్ధమైంది. ఈనెల 11న జరగనున్న గోరఖ్ పూర్, పుదూర్ లోక్‌సభ ఉపఎన్నికల్లో బీజేపీని ధీటుగా ఎదుర్కొనేందుకు సమాజ్ వాదీ పార్టీ అభ్యర్థులకు మద్దతివ్వనున్నట్లు బీఎస్పీ అధినేత్రి మాయావతి తెలిపారు. అయితే2019 లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం తాము ఏ పార్టీతో పొత్తుపెట్టుకునే ఆలోచనలో లేమన్నారు. ఉప ఎన్నికల్లో బీజేపీని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఓట్లు చీలకుండా ఎస్పీ అభ్యర్థులకు మద్దతిస్తామన్నారు. బీజేపీకి గట్టి షాక్ ఇవ్వాలని తమ పార్టీ నేతలంతా పట్టుబట్టడంతో సమాజ్ వాదీ పార్టీ అభ్యర్థులకు మద్దతిస్తున్నామన్నారు. ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆధిత్యనాథ్(గోరఖ్ పూర్) డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మౌర్య(పుదూర్) లోక్ సభ స్థానాలకు రాజీనామా చేయడంతో ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి.

వైట్‌హౌస్‌పై కాల్పులు.. ఆపై ఆత్మహత్య

వాషింగ్టన్: ఓ గుర్తుతెలియని వ్యక్తి అమెరికా అధ్యక్ష భవనం 'వైట్ హైస్' భద్రతా సిబ్బందికి, ఉన్నతాధికారులకు ముచ్చెమటలు పట్టించిన ఘటన వెలుగు చూసింది. ఆ దుండగుడు ఏకంగా వైట్‌హౌస్‌పై కాల్పులు జరిపి, ఆపై తనకు తానే కాల్చుకుని ఆత్మహత్య చేసుకుని కలకలం రేపాడు. వైట్‌హౌస్ సిబ్బంది కథనం ప్రకారం... ఓ సాయుధుడు శనివారం మధ్యాహ్నం అధ్యక్షభవనం వద్దకు చేరుకుని తన వెంట తెచ్చుకున్న తుపాకీతో పెన్సిల్వేనియా అవెన్యూ వద్ద కొన్ని రౌండ్లు కాల్పులు జరిపాడు. కాల్పుల ఘటనలో ఒక్కసారిగా అప్రమత్తమైన సిబ్బంది సాయుధుడిని పట్టుకునేందుకు చూడగా, తనకుతాను తుపాకీతో కాల్చుకుని బలవన్మరణం పొందాడు. ఈ కాల్పుల నేపథ్యంలో వైట్‌హౌస్ వద్ద చోటుచేసుకున్న భయానక పరిస్థితులకు సంబంధించిన వీడియో ట్విట్టర్‌లో వైరల్ అవుతోంది.

కాగా, శనివారం ఫ్లోరిడా పర్యటనలో ఉన్న అధ్యక్షుడు ట్రంప్ దంపతులు సాయంత్రానికి వైట్‌హౌస్‌కు రావాల్సి ఉంది. వారు మరికాసేపట్లో వస్తారని అనుకున్న సమయంలో అక్కడ ఈ కాల్పుల ఘటన చోటుచేసుకుంది. అయితే, కాల్పుల సమయంలో వైట్‌హౌస్‌లో ట్రంప్ దంపతులు లేకపోవడం, వారు ఇంకా ఫ్లోరిడా పర్యటనలోనే ఉండటంతో అధికారులు కొంత ఊపిరిపీల్చుకున్నారు. గత నెల 23న ఓ మహిళ తన కారుతో అధ్యక్ష భవనం వద్ద బీభత్సం సృష్టించగా, వైట్‌హౌస్ సిబ్బంది ఆమెను అదుపులోకి తీసుకున్న విషయం విదితమే.

పాక్ సెనేట్‌కు హిందూ మహిళ

పీపీపీ సభ్యురాలు కృష్ణకుమారి కోల్హి

కరాచీ: ముస్లిం మెజారిటీ దేశమైన పాకిస్తాన్‌లో సింధ్ ప్రావిన్స్‌కు చెందిన హిందూ మహిళ చరిత్ర సృష్టించింది. పాక్ సెనేట్‌కు హిందూ దళిత మహిళ కృష్ణకుమారి కోల్హి(39) ఎన్నికైనట్టు పాక్ పీపుల్స్ పార్టీ తెలిపింది.ఇప్పటికే కోల్హి పీపీపీ సభ్యురాలిగా ఉంది. ఆమెకు సింధ్‌లోని మైనారిటీ సీటుకు పీపీపీ సెనేట్ టిక్కెట్ ఇచ్చింది. ఇది పాక్‌లో మహిళలు, మైనారిటీ హక్కులకు లభించిన అరుదైన గౌరవంగా పీపీపీ పేర్కొంది. ఆమె గెలుపు ఓ మైలురాయిగా నిలిచిపోతుందని అక్కడి రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.సింధ్ ప్రావిన్స్‌లోని థార్‌లోగల నగర్‌పర్కర్ జిల్లాలోని ఓ మారుమూల గ్రామానికి చెందిన జుగ్నో కోల్హి అనే ఓ నిరుపేద పాలేరు కుటుంబంలో 1979లో జన్మించిన ఆమెకు 16వ ఏటనే పెళ్లయింది. దాదాపు మూడేళ్ల పాటు ఉమర్ కోట్‌లోని కున్రిలో ఓ భూ జమీందార్‌కు చెందిన ప్రైవేటు జైల్లోనే ఆమె కుటుంబం గడిపింది. అప్పటికి ఆమె మూడో తరగతి చదువుతున్నారు. అలా చదు వుకుంటున్న క్రమంలోనే 16వ ఏట లాల్‌చంద్ అనే వ్యక్తికిచ్చి తల్లిదండ్రులు పెళ్లి జరిపించారు. పెళ్లి అయినా కూడా ఆమె చదువు మానలేదు. 2013లో సింధ్ వర్సిటీ నుంచి సోషియాలజీలో పీజీ పూర్తి చేశారు.



రూ.2లక్షల కోట్లకు మీడియా వినోద పరిశ్రమ

న్యూఢిల్లీ : డిజి టల్ రంగం రోజుకో కొత్త పుంతలు తొ క్కడంతో మీడియా, ఎంటర్‌టెయిన్‌మెం ట్ (ఎం అండ్‌ఈ) రంగంలో గత ఏడాది 13 శాతం వృద్ధితో రూ. 1.5 లక్షల కోట్ల కు పెరిగిందని ఫిక్కీ ఎర్నెస్ట్ యంగ్ నివేదికలో పేర్కొంది. ఈ నివేదికను ఆది వారం నాడు సమాచార ప్రసారశాఖ మంత్రి స్మృతి ఇరానీ విడుదల చేశారు. ఏ డాదికి ఈ రంగం 11.6 శాతం వృద్ధితో 2020 నాటికి ఎం అండ్‌ఈ రూ.2లక్షల కోట్లకు ఎగబాకుతుందని అంచనా వే సింది. ఈ రంగం జీడీపీ వృద్ధిరేటు కంటే వేగంగా దూ సుకుపోతోందని తెలిపింది. దేశ ఆర్థిక వ్యవ స్థ స్థిరంగా అభి వృద్ధి పథంలో దూసుకుపోవడంతో దేశంలోని మా రుమూల ప్రాంతాల్లో కూడా ప్రజల ఆదాయం పెరగ డంతో ఈ రంగం అభివృద్ధి చెందుతోందని నివేదికలో వి వరించింది. డిజిటల్ రంగం పుంజుకోవడంతో అడ్వర్ట యిజ్‌మెంట్లు బడ్జెట్లపై ఎలాంటి ప్రభావం లేదని ఈవై భాగస్వామి అశిష్ పెర్వాని చెప్పారు. 2017లో డిజిటల్, ఫిల్మ్ అండ్ ఎనిమేషన్ వీఎఫ్‌ఎక్స్ సెగ్మెంట్‌లో మంచి వృద్ధి కని పించిందని, తన అంచనా ప్రకారం 2020 నాటికి డిజిటల్ రంగంతో పాటు గే మింగ్ రంగం రెండు నుంచి మూడు రెట్లు పెరుగుతుందన్నారు. పెద్దనోట్ల ర ద్దు, జీఎస్టీ ప్రభా వం అడ్వర్టయిజింగ్ రంగంపై ప్రభావం చూపించిందని, అయితే డిజిటైజేషన్ ద్వారా సబ్‌స్క్రిప్షన్ పెరిగి దాంతో పాటు రెవెన్యూ జోరందు కుందని తెలిపింది. డిజిటల్ అడ్వర్టయిజింగ్ రంగం 2020 వరకు ఇదే జోరు కొనసాగుతుం దని నివేదికలో వివరించింది.



రూ.516 కోట్లు మొండిబకాయిలు రద్దు

- ఈ ఆర్థిక సంవత్సరం మొదటి సగభాగంలో
- 38 ఉద్దేశపూర్వక ఎగవేతదారుల ఖాతాలు

న్యూఢిల్లీ: ఆర్థికసంవత్సరం మొదటి సగభాగంలో అంటే సెప్టెంబర్ 2017 చివరి నాటికి ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంకుల్లో రూ.516 కోట్ల మొండిబకాయిలను పీఎస్‌యు బ్యాంకులు రద్దు చేశాయని ఆర్థికమంత్రిత్వశాఖ విడుదల చేసినట్లు గణాంకాలను బట్టి తెలుస్తోంది. పీఎస్‌యు బ్యాంకులకు చెందిన మొత్తం 38 మంది ఉద్దేశపూర్వక ఎగవేతదారుల రుణాలను ఏప్రిల్ - సెప్టెంబర్ 2017న బ్యాంకు ఖాతా పుస్తకాలనుంచి తీసేసింది.ఈ ఖాతాలను బ్యాంకులు రద్దు చేసినా.. బ్యాంకులు మాత్రం తాము ఆర్జించిన ఆదాయం నుంచి ఈ మొత్తాన్ని కేటాయింపులు చేయాల్సి వస్తుంది. ఎందుకంటే బ్యాలెన్స్ షీట్లలో ఎన్‌పీఏ లేదా మొండిబకాయిలు అనే పదం కనిపించరాదని ఆర్‌బీఐ హుకుం జారీ చేసింది. బ్యాంకులే తమ ఆదాయంలో కొంత మొత్తాన్ని తీసి ఈ మొండిబకాయిలకు కేటాయింపులు చేస్తున్నాయి. పెద్దమొత్తంలో కేటాయింపులు చేసినా బ్యాంకు బ్యాలెన్స్‌షీట్స్‌పై ఒత్తిడి మాత్రం కొనసాగుతుంది. నిర్వహణా లాభంపై ప్రభావం చూపిస్తుంది. బ్యాంకు అధికారుల సమాచారం ప్రకారం ఉద్దేశపూర్వక ఎగవేతదారుల నుంచి భవిష్యత్తులో కూడా బకాయిలు వసూలు కావని నిర్ధారించుకొన్న తర్వాత రుణాలను రద్దు చేయడం జరుగుతుందని వారు వివరించారు.ఉద్దేశపూర్వక ఎగవేతదారుల విషయానికి వస్తే వీరు.. బ్యాంకుల నుంచి ఏ వ్యాపారం కోసం రుణం తీసుకున్నారో దానికి వినియోగించరు. తీసుకొన్న రుణాలను బ్యాంకులకు తిరిగి చెల్లించకపోవడం, తీసుకొన్న రుణాలను ఖర్చు చేసుకోవడమో జరుగుతుంది. లేదా.. బ్యాంకుల వద్ద తనఖా పెట్టిన ఆస్తులను బ్యాంకులకు సమాచారం ఇవ్వకుండా విక్రయించుకోవడం జరుగుతుంది. ఉద్దేశపూర్వక ఎగవేతదారుడి నుంచి బకాయిలు రాబట్టుకోవచ్చు... అయితే దురుద్దేశపూర్వకంగా బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని పక్కాగా ఎగ్గొట్టాలనుకునే వారి నుంచి బకాయిలు రాబట్టుకోవాలంటే కష్టమేనని అధికారులు చెబుతున్నారు. రుణ ఎగవేతదారుడు ప్రకటించిన ఆస్తుల్లో కొంతమాత్రం బ్యాంకుల చేతికి అందుతుందని, చాలా కేసుల్లో ఉద్దేశపూర్వక ఎగవేతదారుల నుంచి మొత్తం బకాయిల్లో వసూలయ్యేది మాత్రం పిసరంతేనని బ్యాంకు అధికారులు వివరించారు.ఇదిలా ఉండగా రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా 2015లో ఉద్దేశపూర్వక ఎగవేదారుడు అనే అనుమానం వస్తే మాత్రం తక్షణమే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, రుణాలు తీసుకొన్న వారి గ్యారంటర్లపై కూడా చట్టపరమైన చర్యలు వేగం చేయాలని ఆర్‌బీఐ ఆదేశాలుజారీ చేసింది. అలాగే ఉద్దేశపూర్వక ఎగవేతదారులపై అవసరం అనుకుంటే క్రిమినల్ కేసులు పెట్టాలని సూచించింది. మొండిబకాయిల్లో ఎస్‌బీఐదే అగ్రస్థానం.. మార్చి 2017 నాటికి చూస్తే మొత్తంపీఎస్‌యు బ్యాంకుల్లో 27 శాతం వాటా ఎస్‌బీఐది. మొత్తం 1762 ఉద్దేశపూర్వక ఎగవేతదారులు రూ.25,104 కోట్లు బకాయి పడ్డారని ఆర్థిక మంత్రిత్వశాఖ గణాంకాలే చెబుతున్నాయి. పీఎన్‌బీఐకి 1120 ఉద్దేశపూర్వక ఎగవేతదారులు రూ.12,278 కోట్లు వరకు బకాయిపడ్డారు. ఈ రెండు కలిపితే రూ. 37,382 కోట్లు అవుతాయి. మొత్తం మొండిబకాయిల్లో ఇవే 40 శాతం ఆక్రమించాయి. పీఎస్‌యు బ్యాంకుల్లో మొత్తం 8,915 ఉద్దేశపూర్వక ఎగవేతదారులు రూ.92,376 కోట్ల వరకు బ్యాంకులకు బకాయి పడ్డారని ఆర్థికమంత్రిత్వశాఖ గణాంకాలు చెబుతున్నాయి.



ఆడిటర్ల నియామకం ఆర్‌బీఐకే!

- ఆడిటర్ల వ్యవస్థను నీరుగార్చిన ప్రభుత్వం
- బ్యాంకు యాజమాన్యాలకు ఆడిటర్ల ఎంపిక వద్దు



న్యూఢిల్లీ/ముంబై : ఇటీవల కాలంలో ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంకుల్లో రోజుకో కుంభకోణం వెలుగులోకి వస్తున్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకులో ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ వేలాది కోట్ల రూపాయల మోసం చేయడంతో ప్రభుత్వంతో పాటు బ్యాంకింగ్ రంగం అప్రమత్తమైంది. తాజాగా వెలుగుచూస్తున్న బ్యాంకు స్కాంలపై ఆడిటర్లతో పాటు ఆర్థికరంగానికి చెందిన నిపుణులు దీనికి ప్రభుత్వ మే కారణమని ఆరోపిస్తున్నారు. కేంద్రప్రభుత్వం ఆడిట్ వ్యవస్థను పూర్తిగా బలహీనపర్చిందని, దీం తో పాటు రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్ బీఐ)కు బ్యాంకుల ఆడిటింగ్‌కు ఆడిటర్ల నియామ కంపై అధికారం తగ్గించేశారని మండిపడ్డారు. చట్టబద్ధమైన ఆడిటర్ల ఎంపిక బాధ్యతను బ్యాంకు యాజమాన్యాలకు ఎలా అప్పగిస్తారని వారు ప్రభు త్వాన్ని ప్రశ్నిస్తున్నారు. గతంలో బ్యాంకులకు చట్ట బద్ధమైన ఆడిటర్ల నియామకం అధికారం ఆర్‌బీఐ చేతి లో ఉండేది. అయితే ప్రస్తుతం ఈ పద్ధతిని పూర్తిగా మార్చేశారు. తమ దృష్టికి వచ్చిన దాని ప్రకారం చూస్తే 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి కేంద్రప్రభుత్వం బ్యాంకు బ్రాంచీలకు నియమించాల్సిన చట్టబద్ధమైన ఆడిటర్ల ఎంపిక అధికారం ఆర్‌బీఐ నుంచి ప్రభుత్వం తప్పించిందని, దాని స్థానంలో ఆ అధికారాన్ని ఆయా బ్యాంకుల యాజమాన్యాలకు అప్పగించిం దని అసో సియేషన్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ జనరల్ సెక్రెటరీ కింగ్‌షుక్ దత్తా చెప్పారు. ఫోరమ్ ఆఫ్ ఫైనాన్స్ ప్రొఫె షనల్స్ అండ్ ఎకనమిస్ట్ ప్రధాన కార్యదర్శి సునీల్‌కు మార్ గాంధీ మాట్లాడుతూ..చట్టబద్ధమైన ఆడిటర్ల ని యామకం కోసం బ్యాంకు యాజమాన్యాలు ఆర్‌బీఐ నుంచి నామమాత్రపు అనుమతులు తీసుకొని తమకు ఇష్టం వచ్చిన వారిని ఆడిటర్లుగా నియమిం చుకుం టున్నారని తెలిపారు.ప్రస్తుతం పరిస్థితి ఎలా ఉందం టే పరీక్షలు నిర్వహించాల్సిన వారు తమకు అనుకూలమైన వారిని ఎగ్జామిషన ర్లు నియమించుకున్న ట్లు ఉందని వారు వ్యాఖ్యానించా రు. ఈ పరిస్థితిని పూర్తిగా మార్చి బ్యాంకు సెం ట్రల్ ఆడిటర్ల నుంచి బ్రాంచీ ఆడి టర్ల ఎంపిక వరకు ఆడి టర్లను ఎం పిక చేసే అధికారం ఆర్‌బీఐకి అప్ప గించాలని, బ్యాంకు యాజమా న్యాలకు కాదని వారు డి మాండ్ చే స్తున్నారు. బ్యాంకింగ్ రం గంలో కూడా సీఅండ్‌ఏజీ వ్యవస్థ మాదిరిగానే కొత్త నేషనల్ ఆడిట్‌బోర్డును ఏర్పాటు చేయాలని ఇది నియంత్రణా సంస్థగా పని చే స్తూ.. ప్రైవేట్ లిస్టెడ్ కం పెనీ ఆడిటర్లను నియమి స్తుంద ని అసోసియే షన్ డిమాండ్ చేస్తోంది. ఆడిటర్ల నియామకానికి బ్యాంకు యాజమాన్యాలకు స్వేచ్ఛనిస్తే.. బ్యాంకు యాజ మాన్యాలు ఆడిటర్ల కుమ్మ క్కయ్యే అవకాశాలుం టాయని ఆడిటర్ల అసోసియేషన్ అనుమానం వ్యక్తం చేసింది. ఆర్థికమంత్రి శాఖ సెప్టెంబర్ 26, 2012న విడుదల చేసిన సర్క్యూలర్‌పై కూడా ఆడిటర్ల అసో సియేషన్ తీవ్రస్థాయిలో విమర్శించింది. ప్రభు త్వరంగ బ్యాంకుల్లో సీబీఎస్ (కోర్‌బ్యాంకింగ్ సొల్యూ షన్) అమలు చేసినా బ్యాంకు బ్రాంచీ స్థాయిలో చట్టబ ద్ధమైన ఆడిటంగ్ సాధారణంగా ఎలా జరుగుతుందో అలానే కొనసాగుతుందనడాన్ని దత్తా విమర్శించా రు. చట్టబద్ధమైన బ్రాంచీ ఆడిటింగ్ అనేది తప్పనిసరి అని.. అయితే దురదృష్టవశాత్తు రూ.20 కోట్ల కంటే తక్కువ అడ్వాన్స్‌లు లేదా రుణాలు ఇచ్చిన బ్యాంకు లకు ఇవి వర్తించవని దత్తా గుర్తు చేశారు. బ్యాంకుల్లో వేలాది కోట్ల రూపాయల మోసం కేసు గురించి గాంధీ ప్రస్తావిస్తూ.. కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ నుంచి 'స్విఫ్ట్' టెక్నాలజీ పక్కనపెట్టడం వల్లే బ్యాంకింగ్ రంగం లో లొసుగులకు కారణమని ఆయన అన్నారు. ఆడి టర్ల అసోసి యే షన్‌తో పా టు పోరమ్‌లు ఎఫ్ ఆర్‌డీఏ బిల్లు -20 17ను ఎత్తివేయాలని డిమాం డ్ చేశారు.



డిఫాల్టర్ ప్రమోటర్లను బిడ్డింగ్ నుంచి నిషేధించాలి

బ్యాంకింగ్ రంగంలో పెరి గిపోతున్న మొండిబకాయిల పట్ల ప్రభు త్వంతో పాటు ఆర్‌బీఐ ఆందోళన వ్య క్తం చే స్తోంది. అయితే వీటికి పరిష్కారం కనుగొనడానికి ఇన్సా ల్వెన్సీ కోడ్‌ను తీసు కొచ్చింది . ఎన్‌పీఏ కేసులను పరిష్కరించడానికి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌ను ఆశ్ర యించాల్సి వస్తుంది. ఎన్‌సీఎల్‌టిని మరింత బలోపేతం చేయాలని యాక్సిస్ బ్యాంకు సీఈవో శిఖాశర్మ కోరారు. అదే సమయంలో బ్యాంకు నుంచి రుణం తీసుకొని డిఫాల్ట్ అయిన ప్రమోటర్ ఇన్సాల్వెన్సీ (దివాలాప్రక్రియ) కింద ఆయన ఆస్తులను కొనుగోలు చేయకుండా నిషేధించాలని ఆమె డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో ఎన్‌సీఎల్‌టి చేతికి మరిన్ని కేసులు వస్తాయని వారికే ప్రత్యేక అధికారాలు కట్టబెట్టాలని ఆమె కోరారు.ఇప్పటికే ఆ దిశగా కాస్త పురోగతి కనిపిస్తోందని దీనిపై ఆర్‌బీఐ కూడా చొరవ తీసుకోవాలన్నారు. స్వల్పకాలానికి బ్యాంకులు డిఫాల్ట్ అయిన ఖాతా దారుని ఆస్తులను విక్రయించి వీలైనంత వరకు ఎక్కువ లబ్ది పొందేలా చూడాలన్నారు. దీంతో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొనే వారికి క్రమశిక్షణ అలవ డుతుందని, రుణం తీసుకున్న వ్యక్తి బాధ్యతగా తిరిగి చెల్లించేలా చూడా లన్నారు. మధ్య కాలం నుంచి దీర్ఘకా లానికి ఎన్‌సీఎల్‌టి ద్వారా కేసులను పరిష్కరించడం అనేది సరైన దిశలోనే కొనసాగుతోందన్నారు. ఇంతకు శిఖా శర్మ ప్రమోటర్లు ఆస్తులను కొనుగోలుకు దూరంగా ఉంచాలన్న వ్యాఖ్య ఎం దుకు చేశారంటే.. ఎస్సార్ స్టీల్ ఖాతా మొండి బకాయిగా మారుతుందని గుర్తించి ఆర్‌బీఐ ఎన్‌సీఎల్‌టి ద్వారా పరిష్కరించాలనుకుంది. అయితే దీని ప్రమోటర్ రుయా కుటుంబం రష్యాకు చెందిన వీటీబీ బ్యాంకు ద్వారా బి డ్డింగ్‌లో పాల్గొని కంపెనీ తిరిగి దక్కిం చుకోవాలనుకుంటోంది. కాగా ఎస్సార్ స్టీల్ అప్పులు రూ.45వేల కోట్ల వరకు ఉన్నాయి. ఈ కంపెనీని కొనుగోలు చేయడానికి ఆర్సిలర్ మిట్టల్‌తో పాటు జపాన్‌కు చెందిన నిప్పాన్ స్టీల్ ఒక్కటే బిడ్‌లు దాఖలు చేశాయి. బ్యాంకుల నుంచి వేలాది కోట్ల రూపాయలు తీసుకొని వాటిని ఎగ్గొట్టి తిరిగి అదే కంపెనీని దొడ్డిదారిన టేకోవర్ చేసుకోడానికి ప్రమోటర్లు ప్రయత్నిస్తున్నారని దీనికి అడ్డుకట్ట వేయాలని బ్యాంకింగ్ రం గానికి చెందిన నిపుణులు డిమాండ్ చేస్తున్నారు.

ఈ వారం మార్కెట్... గ్లోబల్ మార్కెట్లే కీలకం!

- నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

ముంబై: ఈ వారం స్టాక్ మార్కెట్ల విషయానికి వస్తే గ్లోబల్ మార్కెట్లో జరిగే పరిణామాలు కీలకం కానున్నాయి. సమీప భవిష్యత్తులో మార్కెట్లను ఉత్తేజపరిచే అంశాలు ఏమీ కనిపించడం లేదు.. కాబట్టి గ్లోబల్ మార్కెట్లే దేశీయ మార్కెట్లకు దశదిశ చూపించబోతున్నాయని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గత వారం క్యూ3 జీడీపీ వృద్ధి రేటు గణాంకాలు వెల్లడయిన తర్వాత మార్కెట్లు కాస్త గాడినపడ్డాయి. అటు తర్వాత ఆ జోరు కొనసాగలేకపోయింది. బ్యాంకుల్లో పెరిగిపోతున్న మొండిబకాయిలతో పాటు బాండ్ ఈల్డింగ్ పెరగడంతో తిరిగి అమ్మకాల ఒత్తిడి పెరిగిపోయింది. ఫెడ్ రిజర్వుబ్యాంకు భవిష్యత్తులో వడ్డీరేట్లు పెంచుతామని ప్రకటించడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తమయ్యారు. అయితే భారత్ మార్కెట్ల విషయానికి వస్తే దీర్ఘకాలిక ప్రాతిపదికన చూస్తే దేశ ఆర్థిక వ్యవస్థ పునాదులు పటిష్టంగా ఉన్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.సూక్ష్మ ఆర్థిక గణాంకాల విషయానికి వస్తే సోమవారం నాడు సేవల రంగం పీఎంఐ గణాంకాలు వెలువడనున్నాయి. దీని ప్రభావం మార్కెట్లపై ఖచ్చితంగా ఉంటుంది. ప్రస్తుతానికైతే మార్కెట్లను ఉత్తేజపరిచే అంశాలులేవు. అయితే రాబోయే సెషన్‌లలో మార్కెట్లు ఖచ్చితంగా స్థిరపడతాయని అంటున్నారు. మొత్తానికి ఈ వారం ట్రేడింగ్‌పై గ్లోబల్ మార్కెట్ల ప్రభావం ఉంటుందని వారు అంటున్నారు. గత వారం బీఎస్‌ఈ బెంచ్‌మార్కు సూచి 95.21 పాయింట్ల వరకు నష్టపోయింది. బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీని ప్రభావం కూడా మార్కెట్లపై ఉంటుంది. గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే కొత్త ఫెడ్‌చైర్మన్ వడ్డీరేట్లపై ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో అందరూ ఆసక్తితో ఎదురు చూస్తున్నారు.



ఫెడ్ వడ్డీరేట్ల ఆందోళనతో విదేశీ పెట్టుబడులు వెనక్కి

న్యూఢిల్లీ : విదేశీ ఇన్వెస్టర్లు గత నెలలో సుమారు రూ.11వేల కోట్ల కంటే ఎక్కువ మొత్తంలో పెట్టుబడులు దేశం నుంచి తరలించుకుపోయారు. గత ఐదు నెలలో ఇంత పెద్దమొత్తంలో పెట్టుబడులు ఉపసంహరించడం ఇదే మొదటిసారి. భారత్ కంటే బ్రెజిల్‌లో పెట్టుబడులకు అవకాశాలు మెరుగ్గా ఉండటంతో వారు ఈ పెట్టుబడులు దేశీయ మార్కెట్ల నుంచి ఉపసంహరించి విదేశాలకు తరలించుకుపోయారు. కాగా జనవరి నెలలో ఇదే ఎఫ్‌పీఐలు రూ.13,781 కోట్లు దేశీయ స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టాయి. గత నెలలోనే డెబిట్ మార్కెట్ నుంచి ఎఫ్‌పీఐలు రూ.253 కోట్లు ఉపసంహరించుకున్నాయి. ఎఫ్‌పీఐలు తమ పెట్టుబడులు తరలించుకుపోవడానికి గల కారణాలపై ఒకసారి దృష్టి పెడితే జనవరిలో అమెరికాలో నిరుద్యోగరేటు 17 సంవత్సరాల కనిష్ఠానికి 4.1 శాతానికి దిగివచ్చింది. దీంతో పాటు యూఎస్ ఫెడరల్ రిజర్వు ద్రవ్యోల్బణాన్ని అడ్డుకట్టడానికి వేయడానికి వడ్డీరేట్లు పెంచుతామని ప్రకటించింది. దీంతో భారత్ మార్కెట్లే కాకుండా గ్లోబల్ మార్కెట్లో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. అయితే మార్కెట్ విశ్లేషకుల అంచనా ప్రకారం భారత్ నుంచి పెట్టుబడులు తరలిపోయినా.. పెద్ద ప్రభావం ఉండదని.. ఇవి తాత్కాలికమేనని పెట్టుబడులకు భారత్ స్వర్గధామమని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఇక్కడ మరో అం శం ఏమిటంటే ముడి చమురుధరలు ప్రపంచవ్యాప్తంగాపెరగడంతో ద్రవ్య లోటుపై ఎక్కువ ప్రభావం పడుతుందని ... దీంతో కూడా విదేశీ ఇన్వెస్టర్లుమా ర్కెట్ల నుంచి పెట్టుబడులు తరలించుకుపోవడానికి ఒక కారణంగా చెబుతున్నారు.

పూర్తి స్థాయి మహిళా సిబ్బందితో ఎయిర్‌ఇండియా విమాన సర్వీసులు



కోలకతా : ప్రభుత్వరం గానికి చెందిన ఎయిర్‌ఇండియా మొట్టమొదటిసారి కోలకతా -దీమాపూర్ - కోలకతా సెక్టార్ లో పూర్తిస్థాయి మహిళా సిబ్బం దితో ఆదివారం విమానం నడిపింది. అంతర్జా తీయ మహిళా దినోత్స వం సందర్భంగా పూర్తి మహిళా సిబ్బందితో విమానం నడిపామని ఎయిర్ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది. ఎయిర్‌లైన్ విడుదల చేసిన ప్రకటనల ప్రకారం ఫ్లయిట్ ఏఐ 709, ఎయిర్‌బస్ 319 విమానాలను కెప్టెన్ ఆకాంక్ష వర్మ, కెప్టెన్ సతోవిసా బెనర్జీ కాక్‌పిట్‌లో కూర్చుని విమానాలు నడిపితే కేబిన్ సిబ్బందిగా డి భూటియా, ఎంజీ మోహన్‌రాజ్, ఘోష్, యాతిల్‌కాత్ సేవలందించారని తెలిపింది. ఎయిర్ ఇండియా జనరల్ మేనేజర్, పర్సనల్ నవనీత్‌సిద్దూతో పాటు సీనియర్ అధికారులు ఫిబ్రవరి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పూర్తిస్థాయి మహిళా సిబ్బందితో విమానం నడిపించాలని నిర్ణయించారు.

అంబానీ ఇంట పెళ్లి సందడి?

- వజ్రాల వ్యాపారి కుమార్తెతో ముఖేష్ పెద్ద కుమారుడి వివాహం
- ఈ ఏడాది చివర్లో శుభకార్యం



న్యూఢిల్లీ: దేశంలో అత్యంత సంపన్నుడు రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఎండీ ముఖేష్ అంబానీ ఇంట్లో పెళ్లి సందడి మొదలు కాబోతోందా? అంటే అవునని విశ్వసనీయవర్గాలు చెబుతున్నాయి. ముఖేష్ పెద్దకుమారుడు ఆకాశ్ అంబానీ, డైమండ్ కింగ్ రుస్సెల్ మెహతా చిన్న కుమార్తె శ్లోకా మెహతాలో వివాహం జరగబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. రెండు కుటుంబాలు వివాహం గురించి వస్తున్న వార్తలపై వ్యాఖ్యానించడానికి నిరాకరిస్తున్నాయి. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం రాబోయే కొన్ని వారాల్లోనే నిశ్చితార్థం ప్రకటన వెలువడుతుందని, అటు తర్వాత డిసెంబర్ మొదటివారంలో పెళ్లి జరు గుతుందని చెబుతు న్నారు. ఆకాశ్ అంబానీ విష యానికి వస్తే దేశంలోని అత్యం త సంపన్నుడు ముఖేష్ అంబానీ పెద్ద కుమారుడు, శ్లోకా మెహ తా విషయాకి వస్తే రోసీ బ్లూడైమండ్ చీఫ్ రుస్సెల్స్ మెహ తా చిన్న కుమార్తె. ముఖేష్ అంబానీ, మెహతాలు ఇద్దరు ఒకరికొకరు పరి చయమే. ఇదిలా ఉంటే ఆకాశ్ తో పా టు శ్లోకాలు ఇద్దరు కలిసి ధీరూ బాయి అంబానీ ఇంటర్నేషనల్ స్కూలులో కలిసి చదువు కు న్నారు. అం బానీ కుటుంబ అధికార ప్ర తినిధితో పాటు రిలయన్స్ ఇండస్ట్రీస్ అధి కార ప్రతినిధికి ఈ మెయిల్స్ ద్వారా సమాచారం తెలుసుకోవాల నుకుంటే వారి నుంచి ఎలాంటి స మాధానంలేదు. అయితే వారి కుటుంబానికి బాగా దగ్గరి సం బంధాలున్న వారి సమాచారం ప్రకారం ఇప్పటికైతే నిశ్చి తార్థంతో పాటు పెళ్లి తేదీలు ఖరారు కాలేదని స్పష్టం చేశారు. నిశ్చితార్థంలో పాటు పెళ్లి తేదీ ఖరారైతే అంబానీ కుంటుంబం ఈ శుభవార్తను అందరితో పంచుకుంటారని ఆ వర్గాలు తెలియజేశాయి. ఈ నెల 24వ తేదీ న నిశ్చితార్థం జరగనుందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని ఆ వర్గాలు కొట్టిపారేస్తున్నాయి. ఇప్పటి వ రకు పెళ్లి తేదీలు ఖరారు మాత్రం కాలేదు. ఒకటి మాత్రం నిజం పెళ్లి మాత్రం దేశంలోనే జరుగుతుందని చెబు తున్నారు. ఈ మధ్య సెలెబ్రిటిలు సంపన్నులు విదేశాల్లో పెళ్లి ళ్లు చేసుకుంటున్న విష యం తెలిసిందే. రోసీబ్లూ అధికార ప్రతినిధికి పంపిన ఈమె యిల్‌కు సమాధానం రాలేదు. కాగా ముఖేష్ అంబానీ, నీతా అంబానీ పెద్దకుమారుడు ఆకాశ్, కూ తురు ఇషాలు కలిసి టెలి కం వ్యాపారం రిలయన్స్ జియో నిర్వ హిస్తున్నారు.ఇక శ్లోక విషయానికి వస్తే ఆమె ధీరూభాయి అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 2009లో తన చదువును పూర్తి చేశారు.


అటు తర్వాత ఉన్నత చ దువుల కోసం లండన్ వెళ్లారు. ఆమె అక్కడ ప్రిన్స్‌స్టన్ యూ ని వర్శిటిలో ఆంథ్రోపాలజి, లండన్‌స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ అం డ్ పొలిటికల్‌సైన్స్‌లో మాస్టర్ ఇన్ లా పూర్తి చేశారు. రోసీ బ్లూ ఫౌండేషన్‌కు జులై 2014 నుంచి ఆమె డైరెక్టర్‌గా కొన సా గుతున్నారు. దీంతో పాటు కనెక్ట్‌ఫర్ అ నే సంస్థకు సహవ్య వస్థాపకురాలు. ఎన్‌జీవోలకు వలంటీర్లను సమ కూర్చుతుం ది. రుస్సెల్ మెహతా, మోనా మెహతాలకు ముగ్గురు పిల్లల్లో చిన్న కుమార్తె శ్లోక. మోనా మెహ తావిషయానికి వస్తే పం జాబ్ నేషనల్ బ్యాంకుకు రూ.12వేల కోట్ల వరకు మోసం చేసిన వజ్రాల వ్యాపారి నీరవ్‌మోడీకి బంధువు అని చెబుతున్నా రు.





300 కోట్ల డాలర్లతో మనీలా విమానాశ్రయం విస్తరణ

హైదరాబాద్ : మనీలాలోని నీనోయ్ అక్వినో అంతర్జాతీయ విమానాశ్రయం విస్తరించడానికి జీఎంఆర్ - మెగావైడ్ కన్సార్షియం 300 కోట్ల డాలర్ల ప్రతి పాదనలు చేసింది. కాగా జీఎంఆర్ -మెగావైడ్ కన్సార్షియం మాక్టాన్ - సెబు అంతర్జాతీయ విమానశ్రమాన్ని నిర్వహిస్తోంది. కాగా నీనోయ్ అక్వినో అంతర్జాతీయ విమానాశ్రయం ఇరుకుగా ఉంది దీన్ని విస్తరిం చనున్నారు. మనీలాలోని పిలిప్పీన్స్ స్టాక్ ఎక్స్చేంజీకి మెగావైడ్ తాజా ప్రతిపాదన గురించి సమాచారం అందించింది. ప్రస్తుతం ఉన్న విమానాశ్రయం ఇరుకుగా ఉంది. ప్రస్తుతం రోజుకు 730 విమానాలు రాకపోకలు జరుగుతున్నా యి. దీన్ని 950-1,000 వి మానాల రాకపోకలు జరిగే విధంగా విస్తరణ పనులు చేపట్టాలనుకుంటున్నా మని.. దీంతో పాటు ఈ విమానాశ్రయాన్ని ఏడాది 72 మిలియన్ ప్రయాణికుల ను నిర్వహించే సామర్థ్యంగా తీర్చిదిద్దు తామని తెలిపిం ది. మెక్టాన్ -సెబు అంత ర్జాతీయ విమానా శ్రయం పసిఫిక్ ద్వీపకల్ప దేశాల్లో అతి పెద్ద విమానా శ్రయా ల్లో రెండోది. ఈ విమానాశ్రయాన్ని జీఎంఆర్ గ్రూపు -మెగావైడ్‌లు 40:60 భాగస్వామ్యంలో నిర్వ హిస్తు న్నాయి. 2017 లో మనీలా అంతర్జాతీయ విమా నాశ్ర యం నుంచి దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికులు సుమారు 37 మిలియన్ ప్రయాణికులు ఈ విమా నా శ్రయం నుం చి రాక పోకలు చేశారని తెలిపిం ది. ప్రస్తుతం మ నీలా విమానాశ్రయం ఇరుకుగా ఉ న్నందు వల్ల దీ న్ని విస్తరించడానికి అనుభవజ్ఞులైన ప్రైవేట్ ఆపరే టర్ల గురించి అన్వేషి స్తున్నారని, వీరి సమస్యను పరి ష్క రించడానికి తాము సిద్దంగా ఉన్నా మని, ఈ రం గం లో తమకు అపారమైన అనుభవం ఉందని, న్యూ ఢిల్లీ లోని అంతర్జాతీయ విమానా శ్రయాన్ని ప్రపం చంలోని టాప్‌ఐదు విమానాశ్రయా ల్లో ఒకటి నిలిపా మని ఫైలింగ్‌లో పేర్కొంది. జీఎంఆర్ న్యూఢి ల్లీ లోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం తో పాటు, హైదర బాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జా తీ య విమానాశ్రయాన్ని నిర్వహి స్తోంది. దీంతో పాటు పిలిప్పీన్స్‌లోని మాక్టాన్ సెబి అంతర్జాతీయ విమా నాశ్రయాన్ని కూడా జీఎంఆర్ నిర్మించి .. నిర్వహి స్తోంది. గోవాలోని మోపాలో గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని జీఎంఆర్ పబ్లిక్ - ప్రైవేట్ భాగస్వా మ్యంలో అభివృద్ధి చేస్తోంది. కాగా పిలిప్పీన్స్ అంత ర్జాతీయ విమానాశ్రయం విస్తరణ కోసం300 కోట్ల డా లర్లు పెట్టుబడులను ప్రతిపా దించి మూడు విభా గా లు గా విభజించింది. ఒకటి ఎయిర్‌సైడ్, టెర్మి నల్, ల్యాం డ్‌సైడ్ అని వివరించింది. ప్రాజెక్టుల్లో భాగంగా టెర్మి నల్‌ను రెట్టింపు అంటే 7 ల క్షల చదరపు మీటర్లకు విస్త రిస్తామని జీఎంఆర్ ఒక ప్రకటనలో వివరిం చింది. ప్రాజెక్టు పూర్తయితే ఏడా దికి 72 మిలి యన్‌ల ప్యాసిం జర్‌లను ఈ విమానా శ్రయం నిర్వ హించేస్థా యికి చేరు కుంటుంది.




నీరవ్, మెహుల్‌కు కష్టకాలం

- 64 కంపెనీలపై నిషేధం
- క్రయ,విక్రయాల నిలుపుదల
- నేషనల్ కంపెనీ లా ట్రిబ్యూనల్ ఆదేశం
- ఈనెల 26కు విచారణ వాయిదా
- గైర్హాజరైతే తీర్పు ఏకపక్షమే

న్యూఢిల్లీ: పిఎన్‌బి కుంభకోణంపై నీరవ్ మోడీ, మోహల్ చోక్సీలకు చెందిన డొల్ల కంపెనీలు, సన్నిహిత బంధు, మిత్రులకు సంబంధించిన 60కి పైగా సంబంధీకులకు వాటి ఆస్తుల అమ్మకంపై నేషనల్ కంపెనీ లా ట్రిబ్యూనల్(ఎన్‌సిఎల్‌టి) నిషేధం విధించింది. కేంద్ర కార్పోరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ చేసిన ఒక బహిరంగ ప్రకటన కు లోబడి కుంభకోణంలో అనుమానిత సూత్రధారులు నీరవ్ మోడీ,మెహుల్ చోక్సీ, వారి కంపెనీలు, బంధువులు, ఇతర కంపెనీలకు వ్యతిరేకంగా ఎన్‌సిఎల్‌టి ఆదేశాలు జారీ చేసింది. 2013 నాటి కంపెనీల చట్టంలో పలు సెక్షన్లకు లోబడి మంత్రిత్వశాఖ దాఖలు చేసిన ఒక పిటిషన్‌పై ఏకపక్ష ఆదేశం జారీ అయ్యింది. విచారణ, దర్యాప్తుకు సంబంధించి కంపెనీ ఆస్తులను స్తంభింపజేసేందుకు అనుమతించే సెక్షన్ 221, సెక్యూరిటీలపై ఆంక్షలు విధింపునకు సంబంధించి సెక్షన్ 222 లాంటి పలు సెక్షన్ల కింద మంత్రిత్వశాఖ సదరు పిటిషన్ దాఖలు చేసింది. నీరవ్‌మోడీ, మెహుల్ చోక్సీ, పంజాబ్ నేషనల్ బ్యాంకుకు చెందిన కొద్దిమంది వ్యక్తులు, పలు కంపెనీలు, పరిమిత రుణగ్రస్థ భాగస్వామ్యాలను కలుపుకొని మొత్తం 64 సంబంధీకులకు వ్యతిరేకంగా ఆదేశం జారీ అయ్యింది. నిషేధిత కంపెనీల్లో గీతాంజలి జెమ్స్, గిల్లీ ఇండియా, నక్షత్ర బ్రాండ్స్, ఫైర్‌స్టార్ డైమండ్, తదితరాలు ఉన్నాయి. భాగస్వామ్య కంపెనీల్లో సోలార్ ఎక్స్‌పోర్ట్స్, స్టెల్లార్ డైమండ్ ఉన్నాయి. కేంద్ర కార్పోరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకారం సదరు పిటిషన్ గత నెల 23న ఎన్‌సిఎల్‌టి ముంబై బెంచ్ ఎదుట అత్యవసర విచారణకు వచ్చింది. సదరు బెంచ్ ఏకపక్ష ఆదేశం జారీ చేసింది. ప్రకటనకు లోబడి తదుపరి ఆదేశం వెలువడేంతవరకు నిధులు, చర, స్థిరాస్తులు, నిధుల తొలగింపు, బదలాయింపు, పరాధీనతకు సంబంధించి ఈ సంబంధీకులపై కోర్టు నిషేధాజ్ఞ ఉంది. ఎన్‌సిఎల్‌టి తదుపరి విచారణను ఈ నెల 26కు వాయిదా వేసింది. అదే రోజున సంబంధీకులు ట్రిబ్యూనల్ ఎదుట హాజరుకావాల్సి ఉంటుంది.బహిరంగ ప్రకటనకు లోబడి సంబంధీకులు ఆ రోజున గైర్హాజరైన పక్షంలో కేసును ఏకపక్షంగా విచారించడం జరుగుతుంది. పిఎన్‌పి కుంభకోణాన్ని సిబిఐ, ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)తో పాటుగా కేంద్ర కార్పోరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధి లోని తీవ్రమైన మోసాల దర్యాపు కార్యాలయం(ఎస్‌ఎఫ్‌ఐఒ) దర్యాప్తు చేస్తు న్నది. మోడీ, చోక్సీలకు చెందిన దాదాపు 10 ఎల్‌ఎల్‌పీలు, కొన్ని లిస్టెడ్ కం పె నీలతో పాటుగా దాదాపు 110 కం పె నీ లపై దర్యాప్తు చేపట్టాలని ఎస్‌ఎఫ్ ఐఒను మంత్రిత్వశాఖ గత నెల ఆదేశించిం దని సంబంధిత వర్గాలు వెల్లడించా యి.

సబ్సిడీ కందిపప్పు ఏదీ?



(మొదటిపేజీ తరువాయి)

రేషన్ షాపుల ద్వారా విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే సంక్రాంతి కానుక సందర్భంగా మిగిలిపోయిన పచ్చి శనగపప్పును కూడా రాయితీ ధరపై కిలో రూ.40 చొప్పున రేషన్ షాపుల ద్వారా విక్రయించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈమేరకు ఫిబ్రవరి 21న కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. మార్చి ఒకటి నుంచి పథకం ప్రారంభంలో భాగంగా గుంటూరులో మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, కాకినాడలో ఆహార భద్రత కమిషన్ చైర్మన్ జేఆర్ పుష్పరాజ్ సబ్సిడీ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అయితే వీరు ప్రారంభించే నాటికి జిల్లాలకు కందిపప్పు సబ్సిడీ పథకం ఆదేశాలు జారీ కాకపోవడం విశేషం. పథకం ప్రారంభించిన అనంతరం తాపీగా జిల్లా అధికారులకు ఆదేశాలు వెళ్లాయి. దీంతో అవాక్కు కావడం అధికారుల వంతైంది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాకపోవడంతో కందిపప్పు తాత్కాలికంగా తెప్పించి మంత్రి పత్తిపాటి, పుష్పరాజ్‌లు ప్రారంభించారు. దీన్ని బట్టి చూస్తే అధికారులు వీరుభయులనూ కూడా తప్పుదారి పట్టించినట్లయింది. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు అప్పుపై రేషన్ డీలర్లకు కందిపప్పు సరఫరా చేయాల్సి ఉంది. రేషన్ డీలర్లు కందిపప్పును విక్రయించిన అనంతరం పౌరసరఫరాల శాఖకు సొమ్ము చెల్లించాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు రాష్ట్రంలోని ఎంఎల్ఎస్ పాయింట్లకు 20 నుంచి 30 శాతం మాత్రమే కందిపప్పు చేరినట్లు సమాచారం. మార్చి ఒకటి నుంచే రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీ ప్రారంభమైంది. మొదటి రెండ్రోజుల్లోనే 20 శాతం వరకు తెల్ల కార్డు హోల్డర్లకు బియ్యం పంపిణీ జరిగింది. ఈ నేపథ్యంలో మార్చి ఒకటోతేదీ మధ్యాహ్నం సివిల్ సప్లయీస్ ఎండీ కార్యాలయం నుంచి ఆదేశాలు రావడం, శుక్ర, శని, ఆదివారాలు సెలవు రోజులు కావడంతో సోమవారం నుంచి డీలర్లు ఆయా ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి కందిపప్పును తీసుకొని తెల్ల కార్డు దారులకు సరఫరా చేయాల్సి ఉంది. ఈ ఐదు రోజుల్లో 40 శాతానికిపైగా కార్డుదారులు బియ్యాన్ని తీసుకెళ్లడం జరిగితే కందిపప్పు కోసం తిరిగి రేషన్‌షాపులకు రావడం ప్రశ్నార్థకం కానుంది.

తెల్లకార్డుదారుల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని రేషన్ షాపులు సమయానికి తెరవకపోతే రోజుకు వెయ్యి రూపాయలు జరిమానా విధించాలని సంబంధిత శాఖాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కార్డుదారుల ప్రయోజనం చేకూర్చాలనే సదాశయంతో మార్చి ఒకటి నుంచి రూ.40లకు సబ్సిడీ ధరపై కందిపప్పు సరఫరా చేయాలన్న ఆదేశాలను బేఖాతరు చేస్తూ కార్డుదారులకు సకాలంలో కందిపప్పు సరఫరా చేయడంలో బాధ్యతా రహితంగా వ్యవహరించిన కార్పొరేషన్ అధికారులపై ఎంత జరిమానా విధిస్తారని డీలర్లు ప్రశ్నిస్తున్నారు. చంద్రన్న కానుక, రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుకల సమయాల్లో పంపిణీ చేసే సరుకుల్లో మాత్రం నిర్ణీత సమయం కంటే ముందుగా సరుకులను గోదాములకు చేర్పించడంలో ఉత్సాహం చూపిన కార్పొరేషన్ అధికారులు పేద ప్రజలకు తక్కువ ధరలో కందిపప్పు అందిచాలనే ముఖ్యమంత్రి ఆశయాన్ని నిర్లక్ష్యం చేయడం విమర్శలకు గురవుతోంది. రాష్ట్రంలో 29 వేల రేషన్ షాపులుండగా, 1.40 కోట్ల తెల్లకార్డులున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికీ పూర్తిస్థాయిలో ఎంఎల్ఎస్ పాయింట్లకే కందిపప్పు సరఫరా కాకపోతే రేషన్‌షాపులకు చేరెదెప్పుడూ.. ? కార్డు దారులకు పంపిణీ జరిగేదెన్నడు.. ? అనే ప్రశ్న ఉత్పన్నమైంది.

సాంకేతిక కారణాలతో ఆదేశాల్లో జాప్యం..

సాంకేతిక కారణాలతో సబ్సిడీ కందిపప్పు సరఫరా ఆదేశాల్లో జాప్యం జరిగిందని పౌరసరఫరాల శాఖ జనరల్ మేనేజర్ వెంకటరమణ ఆంధ్రప్రభకు తెలిపారు. అన్ని జిల్లాలకు మార్చి ఒకటోతేదీన ఆదేశాలు పంపడం జరిగిందన్నారు. అలాగే ఎంఎల్ఎస్ పాయింట్లకు కూడా కందిపప్పు సరఫరా అయిందన్నారు. డీలర్లకు క్రెడిట్ బేస్‌పై కందిపప్పు ఇవ్వాల్సిందిగా అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

సకాలంలో అందితే సరఫరా..

సివిల్ సప్లయ్స్ శాఖ నుంచి సకాలంలో కందిపప్పు అందితే తెల్లకార్డుదారులకు సరఫరా చేస్తామని రేషన్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లీలా మాధవరావు స్పష్టం చేశారు. సాధారణంగా 15వ తేదీ వరకు సరుకులు పంపిణీ చేయాల్సి ఉన్నా, ఐదో తేదీ నాటికే 70 శాతం పంపిణీ పూర్తవుతుందన్నారు. ప్రభుత్వం తమకు కిలో కందిపప్పు రూ.39.45 లకు సరఫరా చేస్తోందని తాము 55 పైసల తక్కువ మార్జిన్‌తో కార్డుదారులకు రూ.40లకు విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. తెల్లకార్డుదారుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం సబ్సిడీ ధరలపై కందిపప్పు సరఫరా చేస్తున్న నేపథ్యంలో తాము కూడా సేవాభావంతో పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. అయితే ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో కందిపప్పు ఎంఎల్ఎస్ పాయింట్లకు చేరలేదని పేర్కొన్నారు.

పులివెందుల 'రణరంగం'!

- టీడీపీ-వైసీపీ కార్యకర్తల మధ్య పరస్పర రాళ్ల దాడులు
- ఎస్ఐ చిరంజీవికి గాయాలు... భాష్పగోళాల ప్రయోగం
- కడప ఎంపీ అవినాష్‌రెడ్డి హౌస్ అరెస్టు
- సతీష్‌రెడ్డిని వేంపల్లెలో హౌస్ అరెస్టు చేసిన పోలీసులు



కడప, ప్రభ న్యూస్ బ్యూరో : కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలో పీబీసీ నీటి విషయమై మొదలైన జల జగడం కాస్తా రాజకీయ రగడగామారి ఆదివారం అనూహ్య రీతిలో మలుపులు తిరిగి అధికార తెలుగుదేశం పార్టీ, ప్రధాన విపక్షమైన వైకాపా శ్రేణుల మధ్య పులివెందుల పట్టణ నడి బొడ్డున పూలంగళ్ల వద్ద పరస్పరం రాళ్లు, సవాళ్లు, ప్రతిస వాళ్లతో అట్టుడుకింది. ముందుగా ఈ విషయమై కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్, శాసన మండలి డిప్యూటీ మాజీ చైర్మెన్ ఎస్‌వి సతీష్ కుమార్ రెడ్డిల మధ్య, ఆయా పార్టీల నేతల మధ్య కూడా పులివెందుల సమ గ్రాభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం కావాలన్న అంశంలో సవాళ్లు, ప్రతిస వాళ్లు జరిగిన సంగతి విధితమే. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పులివెందుల పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు, ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న అంశంపై తీవ్ర స్థాయిలో చర్చలు, ఆందోళనలు రేకెత్తా యి. ఈ నేపథ్యంలో పోలీసు అధికారులు పరిస్థితిని అదుపు లోకి తెచ్చేందుకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని పులివెం దుల్లోని ఆయన స్వగృహంలో హౌస్ అరెస్ట్ చేశారు. తాను ఎటు తిరిగి పులివెందుల పూలంగళ్ల సర్కిల్‌కు చేరుకుంటానని, పోలీసు అధికారులకు ఎంపీ అవినాష్ చెప్పినప్పటికీ ఇందుకు అనుమతి లేదని, ఈ విషయంలో తమకు సహకరిం చాలని పోలీసు యంత్రాంగం ఎంపీ అవినాష్‌రెడ్డితో చర్చలు జరిపారు. అయితే కార్యకర్తలు తమ నేతను బహిరంగ చర్చకు పూలంగళ్ల వద్దకు చేరుకునేలా అనుమతించాలన్న విషయం లో పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా అవినాష్‌రెడ్డిని పులివెందుల్లోని ఆయన స్వగృహంనుంచి బయ టకు రానివ్వకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకు న్నారు. ఇదిలా వుండగా వేంపల్లెలో టీడీపీనేత ఎస్‌వి సతీష్ కుమార్ రెడ్డిని కూడా ఆయన స్వగృహం నుంచి బయటకు రానివ్వ కుండా పోలీసు అధికారులు, సిబ్బంది అడ్డుకుని ఆయనను కూడా హౌస్ అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో పులివెం దుల్లో టీడీపీ కార్యాలయంలో మకాం వేసిన ఎమ్మెల్సీ బీటెక్ రవి, రామగోపాల్ రెడ్డి, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డిలను పూలంగళ్ల సర్కిల్ వద్దకు రాకుండానే పోలీసులు టీడీపీ కార్యాలయం వద్దనే అడ్డుకునే ప్రయత్నం చేశారు. కానీ వారు కార్యాలయం నుంచి బయటికి వచ్చినా పోలీసులు వారిని పూలంగళ్ల సర్కిల్ వద్దకు రానివ్వకుండా అడుగడుగునా అడ్డుకున్నారు. ఇంతలోగా అటు వైకాపా శ్రేణులు , ఇటు టీడీపీ శ్రేణులు పూలంగళ్లసర్కిల్ వద్దకు చేరుకుని పరస్పరం కవ్వింపు చర్యలకు పాల్పడుతూ రాళ్లు విసురుకున్నారు. దీంతో పులివెందుల పూలంగళ్ల సర్కిల్ వద్ద రణరంగ వాతావరణం నెలకొంది. ఈ పరస్పర ఘర్షణల్లో ఇరు పార్టీలకు చెందిన కార్యకర్తలు రాళ్లదాడిలో గాయపడ్డారు. పులివెందుల ఎస్ఐ చిరంజీవితలకు కూడా గాయాలు అయ్యాయి. పరిస్థితి అదుపుతప్పడంతో పోలీసులు టియ్యర్ గ్యాస్ ఆందోళన కారులపై ప్రయోగించారు. సుమారు 10 నిముషాల పాటు పులివెందుల పూలంగళ్ల సర్కిల్ ఇరు పార్టీల కార్యకర్తల పరస్పర రాళ్ల దాడులు, ఈలలు, కేకలతో దద్దరిల్లిపోయింది. ఈ సందర్భంగా పోలీసులు రంగప్రవేశం చేసి కార్యకర్తలను చెల్లాచెదురు చేయడంతో పాటు కనిపించిన వారినల్లా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈనేపథ్యంలో కడప జిల్లా ఎస్పీ బాబూజీ అట్టాడ ఆదివారం సాయంత్రం పులివెందులకు పోలీసు బలగాలతో చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించి 144 సెక్షన్‌ను విధించి ప్రధాన రోడ్లలో ఎవ్వరూ తిరుగకుండా షాపు లను మూసి వేయించారు. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణల్లో పులివెందుల పట్టణంలో ఆదివా రం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భయానక వాతావరణం ఏర్పడింది. ప్రజలు కూడా ఎటూ వెళ్లలేని పరిస్థితిలో ఆసమయంలో ఉండిపోయారు. ఇదిలా ఉం డగా ఆదివారం నాటి పరిస్థితిని పూర్తిగా సమీక్షించిన ఎస్పీ బాబూజీ అట్టాడ ఆందోళనకు కారకులైన ఇరు పార్టీల నేతలు, కార్యకర్తలపై కేసు నమోదు చేస్తున్నట్లు ప్రకటించారు. పరిస్థితి అదుపు లోకి వచ్చేంత వరకు పోలీసు యంత్రాంగం పటిష్ట నిఘాతోపాటు భద్రతా ఏర్పాట్లను పరిరక్షిస్తుందని వెల్లడించారు. హౌస్ అరెస్ట్ అయిన తర్వాత ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ తాము టీడీపీ నేతలు విసిరిన సవాళ్‌ను అంగీకరిస్తూ ఆదివారం సాయంత్రం పూలంగళ్ల సర్కిల్‌కు వస్తామని, అర్థ వంతమైన చర్చజరిపేందుకు సంసిద్ధమని అయితే పోలీసు యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని ఈ చర్చకు తావివ్వని పక్షం లో చర్చ నుంచి టీడీపీ నేతలు పారిపోయినట్లు అవుతుందని ముఖ్యంగా అధికార పార్టీలోని టీడీపీ నేతలు ఈ బహిరంగ చర్చను పూలంగళ్ల సర్కిల్‌లో జరిగేలా చూడాలని చెప్పాన న్నారు.

అయితే అధికార పార్టీ నేతల వైఫల్యంతోనే పులివెందుల్లో ఆదివారం సాయంత్రం ఘర్షణవాతావరణం నెలకొని పరస్పరం రాళ్లు విసురుకునే పరిస్థితి దాపురించిందని ఇందు కు పూర్తి బాధ్యత టీడీపీనేతలే తీసుకోవాలని ఎంపీ అవినాష్ రెడ్డి ఈసందర్భంగా చెప్పారు. వేంపల్లెలో హౌస్ అరెస్ట్ అయిన సతీష్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీ ముందుగా విసిరిన సవాల్‌కు అనుగుణంగానే తాను,ఇతర సహచర టీడీపీ నేతలు స్పందించిపులివెందుల అభివృద్ధిపై సమగ్రచర్చకు సమయం, వేదికను నిర్ణయించాలని అవినాష్‌రెడ్డికి చెప్పా మన్నా రు. తాము పోలీసు యంత్రాంగాన్ని ఎప్పుడూ దుర్వినియోగానికి వాడుకోలేదని, ఇప్పటికీ కూడా ఇన్‌కెమెరాలో కానీ, పత్రికా విలేకరుల సమక్షంలో కానీ అర్థవంతమైన చర్చకు సంసిద్ధం అని ప్రకటించా మని అయితే ముందస్తు ప్రణాళిక మేరకు ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టించేందుకు వైకాపా నేతలు తమ శ్రేణులను పురికొల్పి తమ కార్యకర్తలపై , నేతలపై రాళ్లు వేయించి, తీవ్ర దుర్భాషలాడారని విమర్శించారు. ఇందుకు పూర్తిగా నైతిక భాధ్యతను ఎంపీ అవినాష్‌రెడ్డి తీసుకోవాలని సతీష్ రెడ్డి పేర్కొన్నారు.

పేదవాడి సొంతింటి కల సాకారానికి కృషి

- రాష్ట్రంలో 6.81 లక్షల గృహాలు మంజూరు • 35 మున్సిపాల్టీలలో 15 వేల గృహ ప్రవేశాలు • 15 నెలల్లో లబ్ధిదారులకు అందజేస్తాం : మంత్రి పి. నారాయణ

అనకాపల్లి/నర్సీపట్నం, ప్రభ న్యూస్: నిరుపేదల సొంతిం టి కల నెరవేర్చే విషయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ధృఢ నిశ్చయంతో ఉన్నారని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ పేర్కొన్నారు. ఆదివారం విశాఖ జిల్లా నర్సీపట్నం మున్సిపాల్టీ శివారు బైపు రెడ్డిపాలెం, బలిఘట్టం, ప్రాంతాలలో 2,592 మందికి శాశ్వత గృహాలు నిర్మించేందుకు చేసిన భూమిపూజ కార్యక్రమానికి ఆయన ముఖ్యతిథిగా హాజరయ్యారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ వసతులతో కూడిన పక్కా గృహాలను లబ్ధిదారులకు అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ నిర్మాణాల నాణ్యత విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 6.81 లక్షల ఇళ్ళు మంజూరు చేశామని, 15 నెలల వ్యవధిలో ఇంటి నిర్మాణాలను పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయనున్నామన్నారు. 35 మున్సిపాలిటీల్లో 15 వేల ఇళ్లు ఇప్పటికే పూర్తయ్యాయని, వీటికి ఈ నెల 24న ముఖ్యమంత్రి సమక్షంలో లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయిస్తామన్నారు. ఈ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మిస్తున్న గృహాలను 8 రాష్ట్రాల నుంచి సంబంధిత అధికారులు చూసి పరిశీలించి ఆదర్శంగా తీసుకున్నారన్నారు.



ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం

నర్సీపట్నం మున్సిపాల్టీకి గత 2 సంవత్సరాలుగా ఇచ్చిన నిధులు ఖర్చు చేయడంలో మున్సిపాల్టీ ఇంజనీరింగ్ అధికారులు విఫలమయ్యా రని రోడ్లు, భవనాల శాఖ మంత్రి అయ్యన్న పాత్రుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాల్టీ విభాగంపై ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. మున్సిపాల్టీ పరిధి లో ఇళ్ళ నిర్మాణాలు చేపట్టడంపై ఆనందం వ్యక్తం చేస్తూ ఈ ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మున్సిపల్ శాఖా మంత్రి నారాయణకే దక్కుతుందని ఆయన అన్నారు. అనంతరం అనకాపల్లి సత్యనారాయణ పురం మెగా లేఔట్ పనులను కరాడాఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణతో కలసి మంత్రి నారాయణ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ హరినారాయణన్, యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్, డీఈ సౌభాగ్యరాజ్, ఏఈ ప్రభాకర్, ప్రాజెక్ట్ ఇంజనీర్ రాజగోపాలం, మేనేజర్ వెంకటరావు, అనకాపల్లి జోనల్ కమిషనర్ షేక్ సుభానీ, టీడీపీ నాయకులు మళ్ల సురేంద్ర, మళ్ల శ్రీనివాసరావు, యల్లపు వెంకటరావు, కాండ్రేగుల శ్రీనివాసరావు, కాండ్రేగుల చిన్న, ఆడారి జగన్నాధ రావు తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధికి పెద్దపీట

- దర్శిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం • మంత్రి శిద్దా సమక్షంలో టీడీపీలో చేరిన 100 మంది వైసీపీ కార్యకర్తలు

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో దళితుల అభివృద్ధికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర అటవీ శాఖమంత్రి శిద్దా రాఘవరావు అన్నారు. ఆదివారం దర్శి నియోజకవర్గంలోని మోటుపల్లి గ్రామంలో దళిత తేజం- చంద్రన్న ముందడుగు కార్యక్రమంలొ ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దర్శి నియోజకవర్గాన్ని ఏపీలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. భారత దేశంలో ఏరాష్ట్రం చేయలేని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ఈ రాష్ట్ర ప్రభుత్వం చేస్తోందని ఆయన తెలిపారు. దర్శి నియోజకవర్గ పరిధిలో రూ.1,850 కోట్ల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. అదేవిధంగా దర్శిలో రూ.25కోట్లతో అంతర్జాతీయ డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని, రూ290కోట్లతో సిమెంట్ రోడ్డులు నిర్మించామన్నారు.దర్శి నుండి మోటుపల్లి వరకు రూ.3కోట్లతో రోడ్డును నిర్మించడానికి చర్యలు తీసుకున్నామని, రాబోయే 4నెలల్లో రోడ్డు పని పూర్తి చేస్తామన్నారు. మోటుపల్లి గ్రామంలో రూ.3.50లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును మంత్రి ప్రారంభించారు. అదేవిధంగా రూ.7లక్షలతో గ్రామంలో సీసీ డ్రైన్, సిమెంట్ రోడ్ల నిర్మాణానికి మంత్రి శిద్దా రాఘవరావు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మోటుపల్లి గ్రామంలో 96మందికి భూమి పట్టాలు మంత్రి పంపిణీ చేశారు. ఈనేపథ్యంలో దాదాపు 100 మంది వైసీపీ కార్యకర్తలు మంత్రి సమక్షంలో తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ఈకార్యక్రమంలో దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు సూరే చిన్న సుబ్బారావు, దర్శి ఎంపీపీ పూసల సంజీవయ్య, ముండ్లమూరు ఎంపీపీ ఎం. వెంకట్రావు, వైయస్ ఎంపీపీ మారెం శ్రీనివాసరెడ్డి, కనీస వేతనాల అమలు బోర్డు డైరెక్టర్ శోభారాణి, నారపుశెట్టి పిచ్చయ్య, సోమేపల్లి శ్రీనివాసరావు, దర్శి ప్రత్యేక అధికారి బి.రవి తదితరులు పాల్గొన్నారు.



కన్నులపండువగా శివ కల్యాణోత్సవం



వేములవాడ, ప్రభ న్యూస్ : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి సన్నిధిలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు అభిజిత్ లగ్న సుముహూర్తంలో శ్రీ పార్వతీ రాజరాజేశ్వరస్వామిల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఆదివారం ఉదయం 6గంటల నుంచి తీర్ధరాజ పూజ, శ్రీ స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకము, పరివార దేవతార్చనలు, అభిషేకములు, పారాయణములు, అవాహిత దేవతార్చనలు, వృషభయాగము, ధ్వజారోహణము, ఎదుర్కోళ్ళు నిర్వహించారు. అనంతరం కల్యాణోత్సవ మూర్తులను వేద మంత్రచ్ఛోరణముల మధ్య మేళాతాళాలతో ఆలయ ఆవరణలోని కల్యాణ వేదిక వద్దకు తీసుకవచ్చారు. నగరపంచాయతీ తరుపున చైర్‌పర్సన్ నామాల ఉమ, కమిషనర్ అమరబోయిన జగదీశ్వర్‌గౌడ్, కౌన్సిలర్‌లు వధూవరులకు పట్టువస్త్రాలను సమర్పించారు. కల్యాణోత్సవంలో కన్యదాతలుగా ప్రతాప రాజకుమారి-శ్రీనివాస్ దంపతులు వ్యవహరించారు. కల్యాణోత్సవంలో ఆలయ ఈవో డి రాజేశ్వర్ దంపతులు, డీఎస్పీ అవధాని చంద్రశేఖర్, సిఐలు వెంకటస్వామి, రఘుచందర్‌లతో పాటు నగరపంచాయతీ వైస్‌చైర్మన్ ప్రతాప రామకృష్ణ, టీపీసీసీ కార్యవర్గసభ్యుడు ఏనుగు మనోహర్‌రెడ్డిలతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులతో పాటు దాదాపు 50వేలమంది భక్తులు పాల్గొన్నారు.

1 లక్ష ఈ-వాహనాలు ఉద్యోగాలు!

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహణ కార్యకలాపాలకు ఏడాదికి రూ. 2 వేల కోట్లు పెట్టుబడి పెట్టనుంది. కాలుష్యంపై ఇప్పటికే యుద్ధం ప్రకటించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పుడు దేశంలోనే పర్యావరణ వాత ఎలక్ట్రిక్ రవాణా వ్యవస్థకు కేంద్రంగా అవతరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. వాస్తవానికి ఎలక్ట్రిక్ రవాణా వ్యవస్థచమురు ఆధారిత రవాణా కంటే చౌక అయింది, స్వచ్ఛమైనది. థర్మల్ విద్యుత్ కేంద్రాల నుండి విద్యుత్ ఉత్పత్తి అవుతున్నప్పటికీ సంప్రదాయ వాహనాలతో పోలిస్తే ఈ-వాహనాలు (ఈవీలు) అతి తక్కువ కాలుష్య ఉద్గారాలను విడుదల చేస్తాయి. ఈవీల నిర్వహణ వ్యయం కూడా కిలోమీటర్‌కు 89 పైసలు అవుతుండగా సంప్రదాయ వాహనాలకు రూ. 4.40 ఖర్చవుతోంది.

ఈవీల వినియోగంపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివారం టెలికాన్ఫరెన్స్‌లో ఇంధన శాఖ అధికారులను ఆదేశించారు. దశల వారీగా లక్ష ఈవీలను అద్దెకు తీసుకుని వినియోగించేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రభుత్వ శాఖలన్నీ తప్పనిసరిగా ఈవీలనే వినియోగించాలని సూచించారు. తర్వాత ప్రైవేటు రంగానికీ విస్తరింపజేయాలన్నారు. సులభతర వ్యాపార నిర్వహణ, ఇంధన పొదుపు, పునరుత్పాదక ఇంధన వనరుల ప్రోత్సాహం, నిరంతరంగా నాణ్యమైన విద్యుత్ సరఫరాలో ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే ప్రథమ స్థానంలో ఉందని, ఇక ఈవీల వినియోగంలోనూ ప్రపంచంలోనే ప్రథమ స్థానాన్ని స్వంతం చేసుకోవడంపై దృష్టిపెట్టాలన్నారు. ఈవీల వినియోగంలో ప్రపంచ రికార్డు సృష్టించాలన్నారు. ఈ ప్రాజెక్టును అమలుచేసిన తరువాత రాష్ట్రప్రభుత్వానికి రూ.3,600 కోట్లు ఆదా అవుతుందని ఇంధన, ఐ అండ్ ఐ, సీఆర్డీయే శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్ ముఖ్యమంత్రికి వివరించారు. ఇంధన వ్యయం తగ్గడం వల్ల మరో రూ. 2,100 కోట్లు ఆదా అవుతాయని, కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాల కారణంగా జీడీపీ నష్టపోయే రూ. 500 కోట్లు కూడా ఆదా అవుతాయని వివరించారు. రాబోయే రెండేళ్లలో లక్ష ఈవీలను అందుబాటులోకి తెచ్చే విషయమై చర్చించేందుకు ఈ నెల మూడో వారంలో ఈవీల తయారీదారులు, బ్యాటరీ తయారీదారులు, టెక్నాలజీ ప్రొవైడర్లు, ప్రభుత్వ శాఖల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంధన సామర్థ్య విధానాలు, సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి, నాణ్యమైన విద్యుత్ సరఫరా వంటి అంశాల్లో ఆంధ్రప్రదేశ్ ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలచిందని ముఖ్యమంత్రి చెప్పారు. ఇక ఈవీల వినియోగం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడంతోపాటు 1.05 లోల ఉద్యోగాలను కూడా కల్పించే భారీ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్న ఏపీని ప్రపంచానికి పరిచయం చేసేందుకు ఈఈఎస్ఎల్, కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నాయి. వాతావరణ మార్పులను సమర్థంగా ఎదుర్కొనే విషయంలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీనే అత్యంత క్రియాశీలంగా ఉందని ఈఈఎస్ఎల్ ఎండీ సౌరభ్ కుమార్ చెప్పారని అజయ్ జైన్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈ ప్రాజెక్టు వల్ల రాష్ట్ర ప్రజలంతా లబ్ధిపొందేలా చర్యలు చేపట్టాలని ఇంధన శాఖ మంత్రి కిమిడి కళా వెంకట్రావు అధికారులను ఆదేశించారు. ఈవీల వల్ల భారీగా ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ఈవీల వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, సీఎస్ దినేష్‌కుమార్, సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్‌చంద్ర, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ జి. సాయిప్రసాద్, ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ కె. విజయానంద్, ట్రాన్స్‌కో జేఎండీలు దినేష్ పర్చూరి, ఉమాపతి, ఇంధన శాఖ సలహాదారు కె.రంగనాథం, డిస్కంల సీఎండీలు ఎం.ఎం. నాయక్, హెచ్‌వై దొర, ఎన్ఆర్ఈడీ క్యాప్ ఎండీ కమలాకర్ బాబు పాల్గొన్నారు.

ఢిల్లీలో వైసీపీ సైన్యం

- ప్రత్యేక హోదా కోసం పోరాటం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ప్రత్యేక హోదా కోసం కేంద్రంతో పోరాటానికి వైఎస్సార్సీపీ సిద్ధమైంది. పార్లమెంట్‌లో ఎంపీలు చేయబోయే నిరసనకు మద్దతుగా వందల మంది పార్టీ సైన్యం దేశ రాజధాని ఢిల్లీ చేరుకుంది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధన కోసం విజయవాడ నుంచి 2వ తేదీ రాత్రి 10 గంటలకు 8 వందల మందితో బయల్దేరిన ప్రత్యేక రైలు ఆదివారం రాత్రి ఆరున్నర గంటలకు ఢిల్లీలోని సఫ్దర్ జంగ్ రైల్వే స్టేషన్‌ను చేరుకుంది. జిల్లా పార్టీ అధ్యక్షులు, శాసన సభ్యులు, నియోజక వర్గ సమన్వయకర్తలు, ఇతర ముఖ్య నాయకులు విజయవాడ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానుండ డంతో వైఎస్సార్సీపీ ప్రత్యేక హోదా కోసం ధర్నా చేపట్టనుంది. నిరసన ముగిసిన అనంతరం రాత్రి 9 గంటలకు పార్టీ కార్యకర్తలతో తిరిగి బయల్దేరే ప్రత్యేకరైలు 7వ తేదీ ఉదయం విజయవాడ చేరుకుంటుంది. ఆదివారం ఉదయమే ఢిల్లీ చేరుకున్న పార్టీ ఎమ్మెల్యేలు ఆంధ్రప్రదేశ్ భవన్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ తమ అభిప్రా యాలను వెల్లడించారు.

ఏపీకి ప్రత్యేక హోదా జాతీయ అంశం కావాలి

రాష్ట్ర విభజన వల్ల ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం జరిగింది. ఏపీకి న్యాయం జరగాలంటే ప్రత్యేక హోదా, రాయితీలు ఇవ్వాల్సిందే. చంద్రబాబు వ్యక్తిగత ప్రయోజ నాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను ఫణంగా పెట్టారు. మోడీ, చంద్రబాబు ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏపీకి అన్యాయం చేస్తున్నాయి. ఏపీకి ప్రత్యేక హోదా జాతీయ అంశం కావాలని ఢిల్లీలో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నాము. రాజకీయ వికృత క్రీడలతో టీడీపీ, బీజేపీ రాష్ట్రాన్ని ముంచేస్తున్నాయి. టీడీపీ ప్రత్యేక ప్యాకేజీ అని ఒకసారి, ప్రత్యేక హోదా అని ఒకసారి చెప్తూ నాటకాలాడుతోంది. నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రయోజనాల గురించి చంద్రబాబు మాట్లాడకుండా ఎన్నికల సందర్భంగా నాటకాలాడుతున్నారు. మోడీ అహంకార ధోరణితో వ్యవహరిస్తున్నారు. పోరాటాలతో ఎన్నో సాధ్యమయ్యాయి. పోరాటా ల ద్వారా మేం ప్రత్యేక హోదా సాధిస్తాం.

ప్రత్యేక హోదా మా హక్కు - భిక్ష కాదు

వైసీపీపై రాజకీయ ఆరోపణలు చేస్తున్నారు. ప్రజా వ్యతిరేకత పెరుగుతుంది కాబట్టే టీడీపీ ఇప్పుడు ఆందోళనలు చేస్తోంది. 21న పార్లమెంటులో వైసీపీ కేంద్రంపై అవిశ్వాస తీర్మానం పెడుతుంది. వైసీపీ తీర్మానానికి టీడీపీ మద్దతి వ్వాలి. ప్రత్యేక హోదా మా హక్కు. మీరు ఇచ్చే భిక్ష కాదు. కేంద్రం విభజన హామీలు అమలు పరచకపోతే ఎంపీలు ఏప్రిల్ 6న రాజీనామాలు చేస్తారు. వైసీపీ రాష్ట్రప్రయోజనాల కోసం పోరాడుతుంది. ఎవరితోనూ లోపాయకార ఒప్పందం చేసుకోవాలసిన అవసరం మాకు లేదు.

రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల హక్కులను హరిస్తోంది


ఏపీకి ప్రత్యేక హోదా కోసం వైసీపీ మొదటి నుంచి పోరాడుతోంది. ప్యాకేజీ కోసం కేంద్రం వద్ద రాష్ట్రప్రభుత్వం మోకరిల్లింది. రేపు పార్లమెంటు స్ట్రీట్‌లో వైసీపీ ఎంపీల నిరసనకు మద్దతుగా ఎమ్మెల్యేలు, కార్యకర్తలు, ప్రజలు ఢిల్లీ వచ్చారు. విభజన చట్టం హామీలు, ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. విభజన చట్టంలో హామీలు అమలు జరపకపోతే షెడ్యూల్డ్ కులాల వారికి అన్యాయం జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల హక్కులను హరించేలా వ్యవహరిస్తోంది. ఇతర కులాల వారిని షెడ్యూల్డ్ కులాలలో కలుపుతూ గిరిజనులకు అన్యాయం చేస్తోంది. గిరిజన సమస్యలపై రాష్ట్రపతిని, ఎస్టీ కమిషన్‌ను కలుస్తాం.

ఆంధ్రులపై మోడీ వివక్ష



అమరావతి, ఆంధ్రప్రభ : ఆంధ్రుల హక్కు అయిన ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయకుండా బీజేపీ ప్రధాని నరేంద్ర మోడీ ఆంధ్రులపై కక్షకట్టి మొండివైఖరితో వ్యవహరిస్తున్నారని తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మం చౌదరి విమర్శించారు. ఆదివారం టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర నేతలు మోకాళ్లపై వెళ్లి ద్వారకా తిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకొన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మం చౌదరి మాట్లాడుతూ తిరుమల వెంకన్న సాక్షిగా ఏపీకి హోదాను ఇస్తానని, విభజన హామీలన్నింటినీ అమలు చేస్తానని హామీ ఇచ్చిన నరేంద్ర మోడీ ఇప్పటి వరకు వాటి ఊసే ఎత్తలేదని విమర్శించారు. విభజన కష్టనష్టాలతో ఉన్న నవ్యాంధ్ర పట్ల నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తున్న మోడీ వైఖరి మార్చాలని కలియుగ దైవాన్ని మోకాళ్లపై వచ్చి వేడుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నేతలు ఆలూరి రాజేష్, మహేష్ యాదవ్, బోళ్ల శ్రీను, ప్రవీణ్, చందు, సాయి, ఉప్పు నరేష్, రాము యాదవ్, ఈశ్వర్, వినయ్, సతీష్, నాని తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో తెలుగు రాష్ట్రాలు ముందుండాలి



తిరుమల, ప్రభ న్యూస్: అభివృద్ధిలో రెండు తెలుగు రాష్ట్రాలు ముందుండాలని తిరుమల స్వామివారిని ప్రార్థించినట్లు తెలంగాణ మాజీ మంత్రి వినోద్, ప్రభుత్వ సలహాదారు వివేక్‌లు అన్నారు. వారిరువురు ఆదివారం ఉదయం విఐపి విరామ దర్శన సమయంలో కుటుంబ సభ్యులతో కలసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల వారు విలేకరులతో మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలు ప్రాజెక్టులు అన్ని పూర్తి అయి అభివృద్ధిలో ముందుండాలని స్వామివారిని ప్రార్థించినట్లు చెప్పారు. అలాగే తిరుమలలో వివాహ కార్యక్రమంలో పాల్గొన్నామని తెలిపారు. అదేవిధంగా సామాన్య ప్రజల కోసం తెలంగాణ ముఖ్యమంత్రి కేసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయన్నారు. వచ్చే 2019 ఎన్నికలలో వందకు పైగా సీట్లు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఇక తెలంగాణలో టిఆర్ఎస్ 16 ఎంపి స్థానాలను సాధించి కేంద్రంలో క్రియాశీలక పాత్ర పోషించాలని ముఖ్యమంత్రి కేసిఆర్ భావిస్తున్నారని వారు తెలిపారు.

కాసుల వర్షం కురిపిస్తున్న

ఆవు పిడకలు



• నెలకు 25 లక్షలపైనే తయారీ • ఐదు జిల్లాల్లో మూడు కోట్ల ఉత్పత్తి

• ఒక్కో ఫాం వార్షికాదాయం రూ.50 లక్షలు

అమరావతి, ఆంధ్రప్రభ: ఆవు పాలు, పాల పదార్థాల కంటే దాని పేడ, పిడకలు, పంచకం, విభూదిగా భావించే బూడిదలకు మార్కెట్‌లో ప్రస్తుతం భారీ గిరాకీ ఏర్పడింది. యజ్ఞయాగాదుల నుంచి విద్యుదుత్పత్తి వరకు ఆవుపిడకల ప్రాధాన్యత పెరగడంతో ఆన్‌లైన్‌లో అమ్మకాలు జోరందుకున్నాయి. గల్లీ నుంచి ఢిల్లీ దాకే కాదు ప్రపంచంలో ఏ మూలకైనా మూడు రోజుల్లోనే పిడకల్ని సరఫరా చేస్తున్నారు. దీంతో ఆవు పిడకల వ్యాపారం రైతులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఒకవైపు గోసంరక్షణ గాలిదీపంలా మారడం మరో వైపు గోశాలల అభివృద్ధికి పాలకులు చేయూత నివ్వకపోవడంతో గో ఉత్పత్తులు, వ్యర్థాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఉత్తర భారత్‌లో ఆవు పిడకల వ్యాపారం లాభసాటిగా సాగుతోంది. దీంతో ఇక్కడ ఉన్న గోశాలల నిర్వాహకులు పాలపదార్థాలకంటే పిడకల ద్వారానే అధికాదాయం వస్తోందని దానిని ఆచరణలో పెట్టి తద్వారా లబ్ధి పొందుతున్నారు. ఆవు పిడకల వ్యాపారం గుంటూరు జిల్లాలో ఆశాజనకంగా ఉంది. పిడుగురాళ్ల, బాపట్ల, తెనాలి ప్రాంతాల్లో ఆవు, గేదె పేడ, పిడకలతో పాటు పంచకం, విభూదిని పెద్ద ఎత్తున ఉత్పత్తి చేస్తున్నారు. నెలకు 5 లక్షల పిడకల ఉత్పత్తి చేసి విక్రయిస్తుండగా ఇందులో 35 శాతం ఆన్ లైన్ విక్రయాలు జరుగుతున్నాయి.

రాష్ట్రంవ్యాప్తంగా ఉన్న గోశాలలు..

గుంటూరు జిల్లాలో 65 గోశాలలు ఉన్నాయి. కృష్ణాలో 74, ఉభయగోదావరి జిల్లాలో 210, ప్రకాశంలో 43, నెల్లూరు లో 80 గోశాలలు ఉన్నాయి. ప్రకాశం జిల్లా చీరాల, కృష్ణా జిల్లా విజయవాడ, ఉభయగోదావరి జిల్లాల్లో కాతేరు, రాజమండ్రి, కొత్తపేట, కాకినాడ, నెల్లూరు రూరల్ తదితర ప్రాంతాల్లో వందల ఎకరాల విస్తీర్ణంలో నిర్వహిస్తున్నారు. మొత్తం ఐదు జిల్లాల్లో 25 మెగా గోశాలలు ఉన్నాయి. వీటి నుంచి ప్రతీ నెలా 25 లక్షల చొప్పున ఏటా 3 కోట్లకు పైగా పిడకలను ఉత్పత్తి చేస్తున్నారు. ఇందులో చీరాలకు చెందిన శ్రీరామదూత గోసంరక్షణశాల నిర్వాహకులు రాష్ట్రంలోనే అత్యధికంగా నెలకు 2.50 లక్షల చొప్పున విక్రయిస్తున్నారు.

అన్ లైన్‌లో జోరుగా అమ్మకాలు..

ప్రతి వస్తువును ఆన్‌లైన్ ద్వారానే అందించేందుకు ప్రయత్నిస్తున్న ఈ కామర్స్ సంస్థలు ఇప్పుడు పండగల సందర్భంగా ఉపయోగించే పిడకలను సైతం అమ్మేందుకు సిద్ధమయ్యాయి. ఇప్పటి వరకు పండగల సీజన్లో ఫోన్లు, వస్త్రాలు, గృహోపకరణాలు, టపాసులు అందించిన ఆన్‌లైన్ స్టోర్సు ఇప్పుడు పిడకలను విక్రయిస్తున్నాయి. కొన్ని ఈ కామర్స్ సైట్లు ఇప్పటికే ఈ పని మొదలుపెట్టాయి. హిందూ సంప్రదాయం ప్రకారం పిడకలను నవరాత్రి పూజల్లో, దీపావళి రోజున ఉపయోగిస్తారు. ఇందుకోసం అమెజాన్, షాప్ క్లూస్, హోంషాప్ 18, బిగ్ బాస్కెట్ లాంటి ఆన్‌లైన్ సంస్థలు పూజా సామాగ్రితోపాటు పిడకలను కూడా అమ్మకానికి పెట్టాయి. అంతేకాక వీటి పై భారీ డిస్కౌంట్లు ప్రకటించడం గమనార్హం. ఈ రోజుల్లో పట్టణాల్లో పిడకలు దొరకడం చాలా కష్టమని ,అందుకే తాము ఆన్‌లైన్‌లో అమ్మకాలు చేస్తున్నట్లు సంస్థలు చెబుతున్నాయి. పట్టణ ప్రజల నుంచి వీటికి మంచి ఆదరణ లభిస్తోందంటున్నాయి.

ఇందులో 50వేల పిడకలను ఆన్‌లైన్ ద్వారా అమ్ముతున్నారు. అమెజాన్, షాప్ క్లూస్, హోంషాప్ 18, బిగ్ బాస్కెట్ వంటి ఆన్‌లైన్ సంస్థలు కూడా సరఫరా చేస్తున్నాయి. ఆవు పేడ చూర్ణం కిలో రూ.20, పేడ కడ్డీలు ఒక్కొక్కటి రూ5, పెద్ద పిడకలు ఒక్కొక్కటి రూ.10, ప్యాకెట్ రూపంలో అయితే రూ.50-500, కిలో రూ.500 లు ఇలా వివిధ రకాలుగా ధరలు నిర్ణయించి అమ్ముతున్నారు. పిడకల విక్రయాల ద్వారా ఒక్కో మోగా ఫాం రూ.50 లక్షలకు పైగా వార్షికాదాయాన్ని నమోదు చేస్తున్నారు.

వినియోగం ఇలా..

ఆవు పిడకలతో యజ్ఞాలు, యాగాలు, హోమాలు చేస్తే మంచి ఫలితం ఉంటుందని నమ్మకం. పిడకలను మండించడం ద్వారా గాలిలో ఆక్సిజన్ పాళ్లు పెరుగుతాయి. అన్ని రకాల వంట చెరకుల కన్నా ఆవు పిడకలకే జ్వలన తీవ్రత ఎక్కువ ఉంటుంది. అంతే కాదు వంట త్వరగా పూర్తయ్యుతుంది. అందుకే ప్రతి శుభకార్యంలో ఆవుపిడకలకే ప్రాధాన్యం ఇస్తున్నారు.

పలు రకాల ఉత్పత్తుల తయారీ..

ఆవు పిడకల్ని పలు రకాల ఆయుర్వేద మందులలో విరివిగా ఉపయోగిస్తున్నారు. ఒక్కో పిడక నుంచి 2,100 కిలో జౌల్స్ ఉష్ణశక్తి వెలువడుతుంది. దీని నుంచి అధిక మొత్తంలో విద్యుత్‌చ్ఛక్తి ఉత్పత్తి చేస్తున్నారు. సాంబ్రాణి కడ్డీలు, ప్రమిదలు, విభూదిని పిడకల బూడిదతో తయారు చేస్తున్నారు. వీటితోపాటు దోమల చక్రాలు, మస్కిటో రిపల్లెంట్, క్రిమిసంహారక మందుల ఎరువుల తయారీలో వినియోగిస్తున్నారు.

కార్మికులకు వరం చంద్రన్న బీమా



• మంత్రి పత్తిపాటి పుల్లారావు

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న చంద్రన్న బీమా పథకం శ్రామిక రంగంలో పనిచేస్తున్న కార్మికులకు వరంలాంటిదని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. ఆదివారం గుంటూరులో జాతీయ భద్రతా వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పుల్లారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కార్మిక సంక్షేమానికి పెద్దపీట వేయడం జరుగుతోందన్నారు. కేవలం రూ.15లతో కార్మిక జీవితాలకు భరోసానిస్తున్న చంద్రన్న భీమా పథకంలో 2.46 కోట్ల మంది సభ్యులుగా చేరారన్నారు. ఈ పథకం ద్వారా 18 నుంచి 50 సంవత్సరాల వయసుగల భీమా దారుడు సహజ మరణం పొందితే మరణించిన రోజునే రూ.5 వేలు మట్టి ఖర్చుకు, పెద్ద ఖర్మ రోజు రూ.25 వేలను అతని కుటుంబ సభ్యులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఒకవేళ ఆకస్మిక ప్రమాదాలకు గురై మరణించిన భీమా దారుడి కుటుంబానికి రూ.30 వేలతో పాటు రూ.5 లక్షల నగదును ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే మరణించిన వారి కుటుంబంలో ఇద్దరు విద్యార్థుల చదువులకు ఒక్కొక్కరికి రూ.1,200 చొప్పున స్కాలర్‌షిప్స్ ను కూడా అందజేయడం జరుగుతుందన్నారు. అద్భుతమైన ఈ పథకాన్ని కార్మిక సోదరులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రాష్ట్ర సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ కార్మికులు సంతోషంగా పనిచేసినపుడే యాజమాన్యాలకు వ్యాపారాభివృద్ధి ఉంటుందని, కార్మికుల రక్షణ, భద్రత బాధ్యత యాజమాన్యాలదే అని చెప్పారు. వ్యాపారాభివృద్ధిలో కీలక భాగస్వామ్యులైన కార్మికుల రక్షణకు జ్యోతిర్మయి ప్రాపర్టీస్ తీసుకుంటున్న సంరక్షణ చర్యలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ మన్నవ సుబ్బారావు, రావిళ్ల సత్యనారా యణ, నాగవంశీ, జ్ఞాన కోటేశ్వరరావు, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస కుమార్, ఐఏఎస్ రావు, కోటిరావు, రాఘవరావు, పలువురు ఇంజనీర్లు, సెఫ్టీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

రావెలకు అండగా ఎంఆర్‌పీఎస్

గత 25 సంవత్సరాలుగా ఎంఆర్‌పీఎస్ ఉద్యమానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా అండగా నిలబడిన మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబుకు ఎల్లప్పుడూ మాదిగ జాతి అండగా నిలబడుతుందని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ స్పష్టం చేశారు. ఆదివారం గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్రమార్కులపై గళమెత్తిన పాపానికి సొంత పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి అని కూడా చూడకుండా పాలకులు అసత్యపు వార్తా కథనాలను రాయిస్తూ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పదవిలో ఉన్నా లేకపోయినా మాదిగ జాతి సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబుపై ఎన్ని రాజకీయ కుట్రలు చేసినా సమర్థవంతంగా తిప్పికొడతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నేతలు దున్నా సాంబయ్య మాదిగ, పూసలూరి జీవా మాదిగ, సాపాటి కిషోర్‌బాబు మాదిగ, చిట్టిరాజు మాదిగ, కూచిపూడి సుందర్ బాబు మాదిగ, ఏసుబాబు మాదిగ, ఏసుపోగు వాణి, కరుణ మాదిగ, పల్లెపోగు రాజారావు మాదిగ పాల్గొన్నారు.

ఏపీలో బీజేపీ ఎదుగుదలను అడ్డుకునే యత్నాలు

• కామన్ ప్రొటెక్షన్ ఏమైంది పవన్?

• బీజేవైఎం జాతీయ కార్యవర్గ సభ్యుడు రమేష్‌నాయుడు



అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ ఎదుగుదలను కొన్ని శక్తులు అడ్డుకుంటున్నాయని బీజేవైఎం జాతీయ కార్యవర్గ సభ్యుడు నాగోతి రమేష్‌నాయుడు ఆరోపించారు. దీనిలో మిత్రపక్షంగా ఉన్న తెలుగుదేశం పార్టీ భాగస్వామ్యం కావడం బాధాకరమన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రమేష్‌నాయుడు మాట్లాడుతూ కర్నాటక, ఒడిశాలో బీజేపీ ఎన్నికలను ఎదుర్కోబోతోందన్నారు. తెలుగువారు అధికంగా ఉన్న చోట్ల బీజేపీని నష్టపరిచేందుకు కుట్రలు చేసున్నారని ఆయన తెలిపారు. అవుట్ డేటెడ్ నేతలు, స్వయం ప్రకటిత మేధావులు ఉన్న జేఎఫ్‌సీ నివేదిక కోసం సమావేశం నిర్వహించడం ఒక ఫార్స్‌గా ఆయన అభివర్ణించారు. గతంలో పవన్ కల్యాణ్ కామన్ మెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ అనే ఫ్లాట్‌ఫాం పెట్టినట్లు తెలిపారు. ఇందుకోసం ఆయన మాజీ భార్య రేణూదేశాయ్ కోటి రూపాయలు ఇచ్చారని, ఆ ఫోర్స్ ఏమైందీ, ఆ రూ.కోటి ఏమి చేశారని రమేష్‌నాయుడు ప్రశ్నించారు. రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలనే విషయంపై పవన్ కల్యాణ్ స్టాండేమిటో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాయలసీమ గోడు పవన్ కల్యాణ్‌కు పట్టదా? అంటూ ఆయన ప్రశ్నించారు. పరిశ్రమలు పెట్టే ప్రాంతాల్లో రైతుల నుంచి తెలుగుదేశం పార్టీ నేతలు భారీ ఎత్తున భూములు కొనుగోలు చేస్తున్నట్లు ఆయన ఆరోపించారు. కియా మోటార్స్ ప్రాంతంలో ప్రభుత్వ చీఫ్ విప్ పల్లె రఘునాథ రెడ్డి, పయ్యావుల కేశవ్‌లు భూములు కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో యువమోర్చా నగర అధ్యక్షుడు రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

• 1980 రివైజ్డ్ పెన్షన్ రూల్స్‌ని అమలు చేయాలి..ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏఎస్.రామకృష్ణ



అమరావతి, ఆంధ్రప్రభ: కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం(సీపీఎస్) రద్దు చేయాలని, దాని స్థానంలో 1980 రివైజ్డ్ పెన్షన్ రూల్స్ అమలు చేయాలని కృష్ణా, గుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎస్. రామకృష్ణ అన్నారు. ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం ఈనెల 2న మచిలీపట్టణంలో చేపట్టిన అమరావతి పాదయాత్ర ఆదివారం విజయవాడ చేరుకోవడంతో రామకృష్ణ సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడుల పెన్షన్ జీవితాంతం టెన్షన్ కలిగిస్తుందని, పెన్షన్ ఉద్యోగికి కనీస హక్కు అని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈవిషయంలో చొరవ చూపాలన్నారు. ఈ విషయంపై మండలిలో ప్రస్తావిస్తానని, ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా మాట్లాడి ఈ విధానం రద్దుకు తనవంతు కృషిచేస్తానని, గ్రాట్యుటీ జీవో 107, కుటుంబ పెన్షన్ జీవో 121 ప్రభుత్వం విడుదల చేయడం హర్షణీయమన్నారు. త్వరలోనే వీటికి విధివిధానాలు రూపొందించి మృతి చెందిన సీపీఎస్ ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోటానికి కృషిచేస్తానన్నారు. అనంతరం టీఎన్‌యుఎస్ రాష్ట్ర కార్యదర్శి బొర్రా ప్రదీప్ మాట్లాడుతూ సీపీఎస్ రద్దు విషయంలో టీఎన్‌యుఎస్ ప్రత్యేక చొరవ చూపిస్తోందన్నారు. ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం అదనపు కార్యదర్శి దాస్ మాట్లాడుతూ భద్రత లేని సీపీఎస్ రద్దుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పేరేటి సత్యనారాయణ, ముప్పాళ శ్రీనివాసరావు, తమ్మా నాగరాజు, బడుగు లంకేష్, సెక్రటేరియట్ ఉమెన్ ఎంప్లాయిస్ నుండి వరలక్ష్మి ఇతర సంఘాల నాయకులతోపాటు సీపీఎస్ ఉద్యోగులు పెద్ద స్థాయిలో పాల్గొన్నారు.

ఏపీసీపీఎస్ ఉద్యోగ సంఘ నాయకుల అరెస్ట్

గత మూడు రోజులుగా సీపీఎస్ రద్దు చేయాలని మచిలీపట్టణం నుండి చేపట్టిన పాదయాత్ర ఆదివారం విజయవాడ బెంజిసర్కిల్‌కు చేరుకోగా పోలీసులు అడ్డుకున్నారు. ఈసందర్భంగా పోలీసులు ఉద్యోగ సంఘ నాయకులను అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీని కలవనీయకుండా అన్యాయంగా అరెస్టు చేశారని, పెన్షన్ బిక్ష కాదు-ఉద్యోగుల హక్కు అంటూ నినాదాలు చేశారు. అరెస్టుని ఉద్యోగ ఉపాధ్యాయులతోపాటు యూటీఎఫ్ తీవ్రంగా ఖండించింది.

అప్పుల బాబూ..ఏదీ పాలన?!!

• ఆర్భాటం తప్పా అభివృద్ధి సున్నా

• నిలదీసిన మాజీ మంత్రి సి.రామచంద్రయ్య



విశాఖపట్నం, ప్రభ న్యూస్: ఉన్న ఆర్థిక లోటుని రెట్టింపు అయ్యేలా అప్పుల మోత మోయిస్తున్న చంద్రబాబు ఈ రాష్ట్రంలో పాలన లేకుండా చలామణీ అవుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి సి. రామచంద్రయ్య పేర్కొన్నారు. సదస్సులు, పర్యటనలు విదేశీ పెట్టుబడులు అంటూ ఆర్భాటం చేయడం తప్ప సాధించింది ఏమీ లేదని ఆయన ఎద్దేవా చేశారు. మొన్న ప్రత్యేక ప్యాకేజీయే ముద్దని ప్రచారం చేసిన చంద్రబాబు ఇప్పుడు మాట మార్చేసి ప్రత్యేక హోదా జపం చేస్తున్నారని విమర్శించారు. ఆదివారం విశాఖపట్నం వైజాగ్ జర్నలిస్టు ఫోరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు రాష్ట్రంను దోచుకుతింటున్నారని, ఆర్భాటం తప్పా పాలన లేదని విమర్శించారు. రాష్ట్ర విభజన కాలం నాటి లోటు బడ్జెట్‌ను తన అప్పులతో చంద్రబాబు రెట్టింపు చేశారే తప్ప సాధించిన ప్రగతి శూన్యమన్నారు. కేవలం తన దుబారా ఖర్చులతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మరింత దయనీయంగా మార్చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతిలోని తాత్కాలిక భవనాల నిర్మాణాలు, భవనాలకు హంగులకూ ఖర్చు చేసిన చంద్రబాబు నాయుడు, విశాఖపట్నం కాకినాడ వంటి ప్రాంతాల్లో ఉత్సవాల నిర్వహణకు పెద్ద ఎత్తున ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసి, ప్రజలను పక్కదారి పట్టించడం అందరూ గమనిస్తూనే ఉన్నారని చెప్పారు. రాష్ట్ర విభజన అంశాల్లో ముఖ్యమైనది అయిన ప్రత్యేక హోదా సాధనతో రాష్ట్ర ప్రయోజనాలను ప్రజలకు అందివ్వాలని ఆయన డిమాండ్ చేస్తూ, ఈ విషయంలో చంద్రబాబు నాయుడు ప్రత్యక్ష పోరాటానికి దిగగలరా? అటూ సవాల్ విసిరారు. ప్రత్యేక హోదా విషయంలో కూడా కేంద్రంను ఎందుకు చంద్రబాబు నేరుగా ప్రశ్నించలేకపోతున్నారని రామచంద్రయ్య ప్రశ్నించారు. ప్రత్యేక హోదా పట్ల కుంటిసాకులు చెబుతున్న చంద్రబాబులో చిత్తశుద్ధి ఉంటే ప్రత్యక్ష పోరాటనికి సిద్ధం కావాలని డిమాండ్ చేశారు. ఇదే వేదికపై కాంగ్రెస్ నాయకులు బొలిశెటిట సత్యనారాయణ కూడా పాల్గొని మాట్లాడారు.

మార్చి 6న చలో ఢిల్లీ

• హోదాపై తాడోపేడో తేల్చుకుంటాం: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



అమరావతి, ఆంధ్రప్రభ: ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చే విషయమై ఢిల్లీ కేంద్రంగా జంతర్‌మంతర్ వద్ద మార్చి 6న ఛలో ఢిల్లీ నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రకటించారు. సోమవారం నుండి పార్లమెంటు సమావేశాలు ప్రారంభమవుతున్నందున ఇప్పటికే కాంగ్రెస్ , వైసీపీ నేతలు ఢిల్లీకి చేరుకున్నారని తాడోపేడో తేలే వరకూ అక్కడే మకాం వేయనున్నామని ఆయన చెప్పారు. ఇప్పటికైనా పాలకులు బుకాయింపు మాటలు మాని పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదివారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ విభజన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక లోటును భర్తీ చేసే క్రమంలో 45 నెలలుగా కేంద్రం మోసపూరిత మాటలతో కాలం వెళ్లదీస్తోందని మండిపడ్డారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో ముగ్గురు ఐఏఎస్ అధికారులతో ఏర్పాటైన జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కేవలం రెండు వారాల్లోనే లెక్కలు తేల్చిందన్నారు. కేంద్రం మూడున్నరేళ్ళుగా లెక్కలు తేలడంలేదని చెప్పడం ఏపీ ప్రజలను మోసగించడమేనన్నారు. జేఎఫ్‌సీ జరిపిన పరిశీలనలో రాష్ట్రా నికి రూ.74,542 కోట్లు రావలసి ఉందని గుర్తించినట్లు చెప్పారు. నిష్ణాతులైన నిపుణులతో కూడిన ఎంతో పెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన కేంద్రం రాష్ట్ర ఆర్థిక శాఖలు 45 నెలలు గడచినా లెక్కలు తేలలేదని చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వకూడదని 14వ ఆర్థిక సంఘం ఎక్కడా చెప్పలేదని జేఎఫ్‌సీ స్పష్టం చేసిందన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత ఏర్పాటు చేసిన నీతి ఆయోగ్‌ను అడ్డుపెట్టడం సరైంది కాదన్నారు. ఏపీ బీజేపీ నేతల ప్రస్తుత వ్యవహారశైలిని చూస్తుంటే నవ్వాలో, ఏడవాలో తెలియకుండా ఉందని ఎద్దేవా చేశారు.బీజేపీకి ఏమాత్రం నైతిక విలువలు, చిత్తశుద్ధి ఉంటే తక్షణమే రెండు ఎంపీ, నాలుగు ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తిరిగి ఎన్నికల్లో పోటీ చేసి ఏ ఒక్కరు గెలిచినా తాము మాట్లాడడం మానుకొంటామని రామకృష్ణ సవాల్ విసిరారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రావుల వెంకయ్య, పుట్టా హరినాధరెడ్డి పాల్గొన్నారు.

'దళితులపై దాడులను అరికట్టకపోతే ప్రజా ఉద్యమం'

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులను పాలకులు అరికట్టకపోతే ప్రజా ఉద్య మం చేపడతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు హెచ్చరించారు. ఆదివారం గుంటూరులో కుల వివక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో ఛలో గుంటూరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో దేశంలోనే గాకుండా రాష్ట్రంలో కూడా దళితులపై దూషణలు, దాడులు పెరగడం ఆందోళన కరమన్నారు. దళితులను కేవలం ఓటు బ్యాంకుగా వినియోగించుకుంటున్న కేంద్ర, రాష్ట్ర పాలకులు వారి సంక్షేమం, భద్రత, రక్షణ పట్ల తీవ్ర నిర్లక్ష్య ధోరణితో వ్యవహస్తున్నాయని ధ్వజమెత్తారు. పోలీసులు ప్రభుత్వాలకు కొమ్ముకాస్తు దళిత దాడులపై గళమెత్తిన వారిపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు.

ఈ కార్యక్రమంలో డీఎస్ఎంఎం జాతీయ కార్యదర్శి శ్రీనివాసరావు, సీపీఐ జల్లి విల్సన్, సీపీఐఎంఎల్ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మస్తాన్‌వలి, కొరివి వినయ్‌కుమార్, నీలం బాజీరావు, వైకే. కళ్యాణ్‌రావు, విద్యాసాగర్, పలువురు కమ్యూనిష్టు, దళిత, ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.

తిరుపతమ్మ ఆలయ సమీపంలో అగ్ని ప్రమాదం

• రూ. కోటి మేర ఆస్తి నష్టం



అమరావతి, ఆంధ్రప్రభ: కృష్ణా జిల్లా పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మ దేవాలయం సమీపంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు 100 గుడిసెలు పూర్తిగా కాలిపోయాయి. తిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరునాళ్లు జరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రమాదం జరగడం ఆందోళనకు గురిచేసింది. అయితే, ఈప్రమాదంలో ఆస్తి నష్టం తప్ప ప్రాణ నష్టం సంభవించకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో దగ్ధమైన గుడిసెల్లో నిత్యం వ్యాపార లావాదేవీలు జరుగుతుంటాయి.

తిరునాళ్ల నేపథ్యం లో వ్యాపారులు పెద్ద ఎత్తున సరుకు నిల్వ చేసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో గ్యాస్ సిలిండర్ పేలడంతో అకస్మాత్తుగా చెలరేగిన మంటలకు వంద గుడిసెలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. వాటిల్లో నిల్వ చేసిన పలురకాల సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. ప్రాణ నష్టం జరగకపోయినా సుమారు రూ. కోటి మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. సంఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పరిశీలించారు. మంటలను అదుపులోకి తీసుకురావడంతో పాటు ప్రత్యామ్నాయ పనులను చేపట్టడంలో దేవస్థానం ఈవో రఘునాథ్, ఆలయ అధికారులు నిమగ్నమయ్యారు.

వైసీపీ అసెంబ్లీ బహిష్కరణ పిలుపును ఖండిస్తున్నాం

• పోలవరానికి అడ్డుపడాలనే కేవీపీ లేఖలు

• ప్రభుత్వ విప్, టీడీపీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న విమర్శ



అమరావతి, ఆంధ్రప్రభ: ప్రతిపక్ష పార్టీ వైసీపీ అసెంబ్లీ బహిష్కరణ పిలుపును ఖండిస్తున్నామని ప్రభుత్వ విప్, టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న అన్నారు. ఆదివారం రాష్ట్ర అతిథి గృహంలో మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రజా సమస్యలను చర్చించే వేదిక అసెంబ్లీ అని, ప్రతిపక్షం అసెంబ్లీకి వచ్చి చర్చించాలన్నారు. వైసీపీ అధినేత జగన్ ఎంపీలతో రాజీనామా డ్రామా ఆడుతున్నారని, అందులో రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని ఎందుకు మినహాయించారని ప్రశ్నించారు. జగన్ చిత్తశుద్ధి లేని నాయకుడని, ఒక పక్క ఎంపీలతో రాజీనామా అంటూ మరోపక్క రాజ్యసభ సభ్యుడిని ఎలా నిలబెడుతున్నారని నిలదీశారు. ప్రజాసమస్యలను చట్టసభల్లో లెవనెత్తాల్సిన ప్రతిపక్షం పారిపోతోందని, ఫిరాయింపు రాజకీయాలకు ఆద్యుడు వైయస్ రాజశేఖరెడ్డేనన్నారు. కేంద్రం మీద తమ పోరాటం ఆగదని, నిధులు వచ్చే వరకు ఎంపీలు, సీఎం చంద్రబాబు పోరాడుతూనే ఉంటారన్నారు. కేవీపీ పోలవరానికి అడ్డుపడాలనే లేఖలు మీద లేఖలు రాస్తున్నారని విమర్శించారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల

నిరవధిక దీక్షలు

• 7న విద్యుత్ సౌధ ముట్టడికి ఐక్యవేదిక పిలుపు



అమరావతి, ఆంధ్రప్రభ: విద్యుత్ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వ వైఖరి విడనాడకపోతే వామపక్ష కార్మిక సంఘాలతోపాటు మిగిలిన సంఘాలను కలుపుకుని నిరవధిక దీక్షలు చేపడతామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. గఫూర్ అన్నారు. ఈనెల 7న విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న విద్యుత్ సౌధ ముట్టడి ఆందోళనకు మద్దతుగా పాల్గొంటామని ఆయన ప్రకటించారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై చేస్తున్న నిరవధిక సమ్మె 13వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఐక్యవేదిక ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్‌లో ఆదివారం నివరధిక దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. గఫూర్, ఎఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రమణారావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ 13 రోజులుగా కార్మికులు శాంతియుతంగా సమ్మె చేస్తుంటే పట్టించుకోకపోవడం ప్రభుత్వ అహంకారానికి నిదర్శనమన్నారు. సమ్మె విరమిస్తేనే మాట్లాడతాననడం కార్మికుల పట్ల వివక్ష చూపడమేన్నారు. పోలీసులు అక్రమ అరెస్టులకు పాల్పడితే తిప్పికొడతామన్నారు. ఐక్యవేదిక చైర్మన్ కాశీ మధుబాబు మాట్లాడుతూ తమ సమ్మెకు ప్రజలు, ప్రజా సంఘాలతో పాటు రాజకీయపార్టీలు, కార్మిక సంఘాల మద్దతు లభిస్తోందన్నారు. సమ్మెను మరింత తీవ్రతరం చేయడానికి కార్మికులంతా పట్టుదలతో ముందుకు నడవాలన్నారు. 7న జరిగే విద్యుత్ సౌధ ముట్టడిలో కార్మికులు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ దీక్షలకు మధ్యాహ్నభోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి స్వరూపరాణి, ఆటో ట్రాలీ డ్రైవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి నరసింహారావు, ట్రాన్స్ పోర్టు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ముజఫర్, పెన్షనర్స్‌యూనియన్ రాష్ట్ర నాయకులు శాస్త్రి మద్దతు తెలిపారు. ఈ దీక్షలలో ఐక్యవేదిక నాయకులు నాగరాజు, శేఖర్, హారతి, సరోజ తదితరులు పాల్గొన్నారు.

మన్యం బంద్ విజయవంతం

• రాస్తారోకోలు, అరెస్టులు



పాడేరు, ప్రభ న్యూస్: బోయ, వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ ఆదివారం నిర్వహించిన రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్ విజయవంతమైంది. విశాఖ జిల్లా పాడేరు, అనంతగిరి, పెదబయలు తదితర మండలాల్లో బంద్ నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి వివిధ ప్రజా సంఘాల నాయకులు రోడ్లపైకి వచ్చి ఆర్టీసీ బస్సులతో పాటు వివిధ ప్రైవేటు వాహనాలను నిలిపివేశారు. అలాగే వ్యాపార సంస్థలను కూడా మూయించారు. ప్రజా సంఘాల నేతలు రాస్తారోఖోలు నిర్వహించారు. బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చొద్దంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బంద్ సందర్భంగా ఆందోళన చేస్తున్న నాయకులను పోలీసులు అరెస్టులు చేశారు. పాడేరు పట్టణం జన సంచారం లేక బోసిపోయింది.

మావోయిస్టుల మృతదేహాల కోసం రాని బంధువులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు పూజారి కాంకేర్ అటవీ ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఎదురుకాల్పుల్లో గ్రేహౌండ్స్ కమాండర్ సుశీల్‌కుమార్‌తో పాటు పది మంది మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. అదే రోజు సుశీల్‌కుమార్ మృతదేహాన్ని ఆయన స్వగ్రామానికి పంపించారు. శనివారం మావోయిస్టుల మృతదేహాలకు హైకోర్టు ఆదేశాలతో ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం దడబోయిన స్వామి మృతదేహాన్ని రాత్రి ఆయన బంధువులకు అప్పగించారు. మిగిలిన వారంతా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందినవారే ఉన్నారు. తొమ్మిది మృతదేహాలను భద్రాచలం ఏరియా ఆసుపత్రిలోనే ఫ్రీజర్‌లోనే ఉన్నాయి. ఆదివారం బంధువులు, కుటుంబ సభ్యులూ ఎవరూ రాలేదు.

అశ్రునయనాల మధ్య స్వామి అంత్యక్రియలు

కాజీపేట, ప్రభన్యూస్ : ఎన్‌కౌంటర్‌లో అమరుడైన ప్రభాకర్ అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య జరిగాయి. 17 ఏళ్ల క్రితంగ్రామాన్ని వీడి అజ్ఞాతం బాటపట్టిన దడబోయిన స్వామి అలియాస్ ప్రభాకర్ ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో నేలకొరిగాడు. ఉన్నత చదువులు చదివి నమ్ముకున్న సిద్ధాంతాల కోసం అడవి బాట పట్టిన స్వామి అమరుడై గ్రామానికి చేరడంతో గ్రామస్తులు ఆయనకు ఎర్రదండాలు సమర్పించారు. వరంగల్ జిల్లా, కాజీపేట మండలంలోని రాంపేట గ్రామానికి చెందిన దడబోయిన స్వామి ఆలియాస్ ప్రభాకర్ శుక్రవారం తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అసువులు బాశారు. డిగ్రీ బీఈడీచేసిన తర్వాత పీపుల్స్ వార్‌లోచేరిన స్వామి అంచలంచెలుగా ఎదిగారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఆయన మృతిచెందిన సమాచారం తెలుసుకుని కుటుంబ సభ్యులు బోరున విలపించారు. గ్రామం శోకసం ద్రంలో మునిగింది. ఉపాధ్యాయుడు కావాల్సిన ప్రభాకర్ మావోయిస్టుగా మారి ఎన్‌కౌంటర్‌లో మృతిచెంది శవమై గ్రామానికి చేరుకోవడంతో ఆయన మృతదేహానికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పలువురు కాంగ్రెస్ నాయకులు ఆదివారం జరిగిన అంత్యక్రియలో పాల్గొన్నారు.

తను అలా వెళ్లిపోయింది...

-శ్రీదేవి చివరి క్షణాల గురించి బోనీకపూర్..

ఫిబ్రవరి 24న కోట్లాది అభిమానుల అందాల తార శ్రీదేవి మనకు దూరమైన రోజు. దుబాయ్‌లో తన మేనల్లుడు మోహిత్ మార్వా వివాహానికి హాజరైన శ్రీదేవి అక్కడే హోటల్ గదిలో



కన్నుమూసింది. భర్తతో చివరి క్షణాలను సంతోషంగా గడిపింది. అయితే శ్రీదేవి మరణం గురించి భిన్న సమాచారాలు అందాయి. తొలుత ఆమె గుండెపోటుతో మరణించిందనీ, ఆ తర్వాత బాత్‌టబ్‌లో మునిగి చనిపోయిందని వార్తలొచ్చాయి. అయితే శ్రీదేవి ఎలా చనిపోయింది, చివరి క్షణాలు ఎలా గడిచాయి అనే విషయాలను ఆమె భర్త బోనీ కపూర్ తన స్నేహితుడు, సినీ విశ్లేషకుడు కోమల్ నహతాకు వివరించారు. ఆ విషయాలను కోమల్ తన బ్లాగులో రాశారు. ఆ బ్లాగు వివరాల్లో బోనీ తెలిపిన ప్రకారం.....మోహిత్ పెళ్లికి వెళ్లాలని ముందు అనుకోలేదు. జాన్వితో శ్రీదేవి మాత్రమే వెళ్లాల్సింది. అయితే నన్నూ రమ్మని పట్టుబట్టారు. దాంతో దుబాయ్ వెళ్లాను. వివాహ వేడుకల్లో పాల్గొన్న తర్వాత నేను వ్యాపార పనుల నిమిత్తం భారత్ వచ్చేశాను. శ్రీదేవి దుబాయ్‌లోనే ఉండిపోయింది. జాన్వి నాయికగా దఢక్ అనే చిత్రంతో తెరంగేట్రం చేస్తోంది. ఆమెకు నప్పే దుస్తుల కొనేందుకు శ్రీదేవి జాన్వీ దుబాయ్‌లో షాపింగ్ చేయాలనుకున్నారు. మళ్లీ ఫిబ్రవరి 24న శ్రీదేవి నాకు ఫోన్ చేసింది. బాగా గుర్తొస్తున్నారు అంటూ మాట్లాడింది. ఇక్కడికి రావొచ్చుగా నాన్నా అంటూ జాన్వి అడిగింది. చెప్పకుండా దుబాయ్ వెళ్లి ఆశ్చర్యం కలిగించాలనుకున్నాను. బయలుదేరి సాయంత్రం 6.20 గంటలకు దుబాయ్ చేరుకున్నాను. రిసెప్షన్ వద్దే లగేజీ పెట్టేసి గదిలోకి వెళ్లాను. నన్ను చూసి శ్రీదేవి ఆశ్చర్యపోయింది. మీరిలా చెప్పకుండా వస్తారని ఊహించాను అంది. కాసేపు ఇద్దరం మాట్లాడుకున్నాం. డిన్నర్ చేద్దాం పద అన్నాను. తాను స్నానం చేసి వస్తానని వెళ్లింది. నేను టీవీ చూస్తూ కూర్చున్నాను. ఎంతసేపటికీ శ్రీదేవి రాలేదు. బాత్‌రూం తలుపు గడి పెట్టిలేదు. దాంతో నేను లోపలికి వెళ్లాను. చూస్తే బాత్‌టబ్‌లో శ్రీదేవి మునిగిపోయింది. ఆమె ప్రాణాలతో లేదు. అది చూసి నా గుండె ఆగినంత పని అయ్యింది. అంటూ తన జీవిత భాగస్వామిని కోల్పోయిన సందర్భాన్ని చెప్పుకున్నారు బోనీకపూర్.



శ్రీదేవి కళాశక్తి స్వరూపిణి


తన అందం, అభినయాలతో కోట్లాదిమంది హృదయాలపై చెరగని ముద్రను వేసుకున్న శ్రీదేవి మృతి ప్రతిఒక్కరిని దిగ్భ్రాంతికి గురిచేసిందని పార్లమెంట్ సభ్యుడు, ప్రముఖ నిర్మాత టి.సుబ్బరామిరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల దుబాయ్‌లో ఓ వివాహ వేడుకలో పాల్గొనేందుకు వెళ్లిన శ్రీదేవి అక్కడే హఠాన్మరణం చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హైదరాబాద్, బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో టి.సుబ్బరామిరెడ్డి అధ్యక్షతన శ్రీదేవి సంస్మరణ సభ జరిగింది. సినీరంగానికి చెందిన పలువురు ప్రముఖులు హాజరైన ఈ కార్యక్రమంలో టి.సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ, శ్రీదేవి మామూలు నటి కాదు. ఎలాంటి పాత్రలోనైనా అలవోకగా ఒదిగిపోయిన కళా శక్తిస్వరూపిణి. దాదాపు నలభై సంవత్సరాలుగా ఆమె నాకు తెలుసు. తాను ఎంత పెద్ద స్టార్‌గా పేరు తెచ్చుకున్నా పెద్దల పట్ల వినయంతోను, గౌరవంతో మెలిగేది. ఆర్టిస్టులు కొన్ని సందర్భాలలో మూడ్‌తో ఉంటుంటారు. కానీ శ్రీదేవి ముఖంలో ఎప్పుడూ చిరునవ్వు తాండవించేది. ఓ తెలుగమ్మాయిగా తెలుగు చిత్రాల్లోనే కాదు తమిళ, హిందీ వంటి పలు భాషల చిత్రాలలో నటించి భారతీయ ప్రేక్షకులందరి మనసులకు ఆమె దగ్గరైంది. హిందీలో ఆమె కథానాయికగా నటించిన చాందిని చిత్రంతో బాలీవుడ్‌లో ఆమెకు బ్రేక్ వచ్చింది. ఆ చిత్రాన్ని యశ్‌చోప్రా, నేను కలిసి నిర్మించాం. ఆ సినిమా కోసం ఎవరిని కథానాయికగా తీసుకుందామని యశోచోప్రా నన్ను అడిగినపుడు శ్రీదేవి అయితే ఆ పాత్రకు బావుంటుందని చెప్పాను. అలా ఆ చిత్రంలో ఆమెను నటింపజేశాం. ఆ తర్వాత యశ్‌చోప్రా, నేను కలిసి నిర్మించిన లమ్‌హే చిత్రంలో కూడా శ్రీదేవి కథానాయికగా నటించింది. ఆ రెండు సినిమాలు ఘన విజయాలను సాధించాయి. అలాంటి నటి ఊహించనివిధంగా హఠాన్మరణం చెందడం పట్ల ప్రేక్షకుల హృదయాలతో పాటు మా అందరి హృదయాలు బరువెక్కాయి. ఇటీవల యశ్‌చోప్రా అవార్డు వేడుక ముంబాయిలో జరిగినపుడు అక్కడ శ్రీదేవి నాతో మాట్లాడారు. చెన్నైలో ఉన్న తన ఆస్తుల గురించి సలహా అడిగారు. ఆమె కుటుంబం ఆర్థికంగా పటిష్టంగా లేదని కొందరు అపోహ చెందుతున్నారు. కానీ అలాంటిదేమీ లేదు. అప్పట్లో శ్రీదేవికి సినిమాల పరంగా వచ్చిన పారితోషికాన్ని వాళ్ల అమ్మ వివిధ రూపాల్లో పెట్టుబడులుగా పెట్టడం జరిగింది. ఎక్కడకు వెళ్లినా చూడముచ్చటి జంటగా తన భర్త బోనీకపూర్‌తో కలిసి శ్రీదేవి వెళుతుండేది. వాళ్లు ఎంతో అన్యోన్యతతో ఉండేవారు. తన కుమార్తె జాన్విని తనలాగే ఓ మంచి హీరోయిన్‌గా వెండితెరపై చూడాలని ఆమెకు ఎంతో ఆశ ఉండేది. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ... వాళ్ల కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా అని అన్నారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న రెబల్‌స్టార్ కృష్ణంరాజు మాట్లాడుతూ, శ్రీదేవి గురించి ఎంత చెప్పినా తక్కువే. యూనిట్‌లోని అందరితో ఆమె ఎంతో గౌరవంగా మెలిగేది. కొన్ని పాత్రలను ఆమె మాత్రమే చేయగలదనిపించేది. నాలుగైదు సినిమాలు ఆమె కలిసి చేశాను. హిందీ బొబ్బిలిబ్రహ్మన్న చిత్రం చేసినపుడు షూటింగ్ ఎంత ఆలస్యమైనా అంతవరకు ఉంటూ...తనవంతు ఆమె పూర్తి సహకారాన్ని అందించింది. మంచితనం మూర్తీభవించిన ఓ మంచినటిని కోల్పోవడం చాలా ఇబ్బందిగా ఉంది అని అన్నారు.

అలనాటి కథానాయిక జయప్రద మాట్లాడుతూ, ఓ లక్ష్యంతో శ్రీదేవి తన కెరీర్‌ను మలచుకుంది. మేమిద్దరం కలిసి తెలుగు, హిందీ భాషలలో కలుపుకుని దాదాపు పదిహేను చిత్రాలలో నటించాం. మా ఇద్దరి మధ్య పోటీ ఉండేది. అయితే అది ఆరోగ్యకరమైన పోటీ. అందంలో నేనంటే నేను. డైలాగ్స్‌లో నేనంటే నేను. అభినయంలో నేనంటే నేను అనేవిధంగా మా మధ్య పోటీ ఉండేది. మన మధ్యన ఆమె లేదంటే నమ్మలేకపోతున్నాం. ఆమె కన్నుమూసిందన్న వార్త టీవీలో చూసినపుడు షాక్‌కు గురయ్యాను. ఆ సంఘటన మరువలేని దుఃఖంగా మిగిలిపోయింది. అతిలోకసుందరిగా అందరినీ మురిపించి భగవంతుడి దగ్గరకు చేరిపోయింది. తనలో తన కుమార్తె జాన్విని చూసుకోవాలని ఆమె ఎంతో తపిస్తుండేది. నిన్న సాయంత్రం బోనీకపూర్ నాతో మాట్లాడారు. ప్రేక్షకులకు, చిత్ర పరిశ్రమ వారికి తమపట్ల ఇంతటి అభిమానాన్ని ప్రదర్శించినందుకు కృతజ్ఞతలను తెలియజేయమని చెప్పారు. ఆమెకు నీరాజనాలు అందజేసే ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశాన్ని అందజేసిన టి.సుబ్బరామిరెడ్డిగారికి ధన్యవాదాలను తెలియజేస్తున్నా అని అన్నారు.



మరో అలనాటి కథానాయిక జయసుధ మాట్లాడుతూ, శ్రీదేవి మృతిని నేను జీర్ణించుకోలేకపోతున్నాను. తెలుగులో మేమిద్దరం తొమ్మిది నుంచి పది సినిమాల్లో కలిసి నటించాం. అవి కూడా చాలా మంచి సినిమాలు. శ్రీదేవి చైల్డ్ సూపర్‌స్టార్‌గా ఉన్నప్పట్నుంచి నాకు తెలుసు. నేను పండంటికాపురం చిత్రంలో నటించకముందు శ్రీదేవి బాలనటిగా సినిమాల్లో నటిస్తున్నప్పుడు ఆమె వయసు ఆరేళ్లు. అప్పట్లో తనను చూసేందుకు నేను ఎంతో ఆసక్తిని కనబరిచాను. ఆ తర్వాత నేను సినిమాల్లోకి వచ్చిన తర్వాత కలిసి నటించాం. మా చెల్లెలు సుభాషిణి, శ్రీదేవి మంచి స్నేహితురాళ్లు. మేమంతా ఓ మంచి ఫ్యామిలీ ఫ్రెండ్స్ మాదిరిగా ఉండేవాళ్లం. ఆమెతో పంచుకున్న జ్ఞాపకాలను మరచిపోలేకపోతున్నాను. జాన్వి తన తల్లిలా మంచినటి అవుతుందని అనుకుంటున్నాను అని అన్నారు. ఇంకో అలనాటి కథానాయిక అమల అక్కినేని మాట్లాడుతూ, గొప్ప వ్యక్తిత్వం మూర్తీభవించిన తార శ్రీదేవి. ఆమె లేని లోటు పూడ్చలేనిది అని అన్నారు. సీనియర్ గాయని పి.సుశీల మాట్లాడుతూ, దేవకన్యగా ఈలోకంలోకి వచ్చిన శ్రీదేవి తన తీపి గుర్తులను ఇక్కడ మిగిల్చి తన లోకానికి వెళ్లిపోయిందని అన్నారు. హీరో డా.రాజశేఖర్ మాట్లాడుతూ, తన తండ్రికి, శ్రీదేవి తండ్రికి మంచి స్నేహబంధం ఉండేదని అన్నారు. ఒక సినిమాలో శ్రీదేవితో కలిసి నటించాల్సిందని, అయితే అది కార్యరూపం దాల్చలేదని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో టి.సుబ్బరామిరెడ్డి కుమార్తె పింకీరెడ్డి, శోభన (అపోలో హాస్పిటల్స్), సినీ పరిశ్రమకు చెందిన కోట శ్రీనివాసరావు, బాబూమోహన్, సి.కల్యాణ్, జగపతిబాబు, శ్రీకాంత్, రేలంగి నరసింహారావు, మా అధ్యక్ష, కార్యదర్శులు శివాజీరాజా, నరేష్, పరుచూరి గోపాలకృష్ణ అలీ, నివేదాథామస్ తదితరులు పాల్గొన్నారు.





రంగస్థలంలో రామ్‌చరణ్

విడుదలైన రెండు పాటలు అదుర్స్

రామ్‌చరణ్, దర్శకుడు సుకుమార్‌ల కలయికలో రూపొందుతున్న రంగస్థలం-1985 చిత్రం ఈ నెలాఖరుకు విడుదల కానుండటంతో ప్రమోషన్ కార్యక్రమాలు మొదలయ్యాయి. ఇటీవల విడుదల చేసిన ఎంత సక్క గున్నవే...అనే సాహిత్యంతో కూడిన తొలి పాటకు మంచి స్పందన లభించగా, తాజాగా విడుదలచేసిన రంగ రంగ రంగస్థలాన...అంటూ సాగే రెండో పాటకు కూడా విశేష స్పందన లభించింది. ఇలా ఒక పాట తర్వాత మరో పాట విడుదల చేస్తూ, ప్రమోషన్ కార్యక్రమాలను ముమ్మరం చేస్తున్నారు. హైదరాబాద్, రాజమండ్రి పరిసరాల్లో ఈ చిత్రం షూటింగ్ అధికభాగం జరిగింది. 1985 నాటి కథ,కథనాలు కావడంతో నాటి పరిస్థితులకు తగ్గట్టుగా పల్లెట్లూరి సెట్ వేసి అందులో చాలామటుకు చిత్రీకరణ జరిపారు. రామ్‌చరణ్ సరసన సమంత నాయికగా నటించిన ఈ చిత్రంలో వాళ్లిద్దరి పాత్రలు ప్రేక్షకులను ఎంతగానో అలరింపజేసేవిధంగా దర్శకుడు తీర్చిదిద్దారని అంటున్నారు. పల్లెటూరి ప్రేమకథా నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో పూజాహెగ్డే ఐటమ్ సాంగ్ కూడా ప్రేక్షకులను ఓలలాడిస్తుందని చెబుతున్నారు. దేవిశ్రీప్రసాద్ అందించిన బాణీలతో పాటు రీరికార్డింగ్ ఓ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అంటున్నారు.

మార్చి 30న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకుని రానున్నారు. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, మోహన్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రంలోని ఇతర ముఖ్యపాత్రల్లో ఆది పినిశెట్టి, జగపతిబాబు, ప్రకాష్‌రాజ్, రావురమేష్, అనసూయ నటించగా, రత్నవేలు ఛాయాగ్రహణాన్ని అందిస్తున్నారు.

16 నుంచి రెగ్యులర్ షూటింగ్‌లో

శ్రీనివాస కల్యాణం



నితిన్
రాశీఖన్నా

నితిన్ కథానాయకుడిగా తెరకెక్కనున్న నూతన చిత్రం శ్రీనివాస కల్యాణం. సతీష్ వేగేశ్న (శతమానం భవతి ఫేమ్) దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు నిర్మించే ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఈ నెల 16 నుంచి మొదలు కానుంది. నితిన్ సరసన రాశీఖన్నా, నందిత శ్వేత హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రకాష్‌రాజ్ కీలక పాత్ర పోషించనున్నారు. కాగా 16న మొదలైన తొలి షెడ్యూల్ ఈ నెల 30 వరకు జరగనుంది. జూన్ కల్లా చిత్రీకరణను పూర్తిచేయడమే కాకుండా నిర్మాణానంతర కార్యక్రమాలను సైతం పూర్తిచేసి, జూలై చివరివారంలో లేదా ఆగస్టు మొదటివారంలో సినిమాను విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు దర్శక, నిర్మాతలు తెలిపారు.

ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జె.మేయర్, సినిమాటోగ్రఫీ: సమీర్‌రెడ్డి, ఆర్ట్: రామాంజనేయులు, ఎడిటింగ్: మధు,లైన్ ప్రొడ్యూసర్: బండి రత్నకుమార్, నిర్మాణం: శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, కథ, మాటలు,



రాహుల్
కావ్యథాపర్

ఫైట్ మాస్టర్ విజయ్ తనయుడు హీరోగా సినిమా

ఫైట్ మాస్టర్ విజయ్ తనయుడు రాహుల్ విజయ్ హీరోగా వి.ఎస్.క్రియేటివ్ వర్క్స్ పతాకంపై రూపుదిద్దుకుంటున్న చిత్రం టాకీ పార్ట్ పూర్తయింది. రాము కొప్పుల దర్శకత్వంలో దివ్య విజయ్ నిర్మిస్తున్న ఈ చిత్రం గురించి దర్శకుడు మాట్లాడుతూ, అనుకున్నవిధంగా టాకీ చిత్రీకరణను పూర్తిచేశాం. నిర్మాణంలో ఎక్కడా రాజీపడలేదు. సినిమా చాలాబాగా వచ్చింది. రాహుల్ బాడీలాంగ్వేజ్‌కు సరిపోయే కథ. తన పాత్రలో అతను చాలాబాగా వొదిగిపోయాడు. మిగతా వివరాలను త్వరలో తెలియజేస్తాం అని అన్నారు.

నిర్మాత దివ్య విజయ్ మాట్లాడుతూ, రాహుల్‌ను తెరపై చాలా చక్కగా చూపించబోతున్నారు దర్శకుడు. ప్రేమ, కుటుంబ వినోదం కలగలిసిన చిత్రమిది. రాహుల్, కావ్యథాపర్ జోడీ తెరపై ఎంతో బావుంటుంది. మణిశర్మ అద్భుతమైన బాణీలను అందించారు. అలాగే శ్యామ్ కె.నాయుడుగారి సినిమాటోగ్రఫీ ఓ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. త్వరలోనే నిర్మాణానంతర పనులను ఆరంభించనున్నాం అని చెప్పారు.ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో రాజేంద్రప్రసాద్, మురళీశర్మ, పవిత్రలోకేష్, పోసాని, ఈశ్వరీరావు, రాళ్లపల్లి, సత్యం రాజేష్, జోష్ రవి తదితరులు తారాగణం. ఈ చిత్రానికి ఎడిటింగ్: నవీన్ నూలి, ఫైట్స్: విజయ్, ఆర్ట్: చిన్నా.

క్రీడాప్రభ

అథ్లెట్ అరుణారెడ్డికి
రూ.2కోట్లు నజరానా

● ప్రపంచకప్‌లో కాంస్య సాధించిన తొలి భారత మహిళ

ఆంధ్రప్రభ, హైదరాబాద్: ఆస్ట్రేలియా మెల్‌బోర్న్‌లో జరిగిన జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్ పోటీల్లో సత్తా చాటిన హైదరాబాద్ అమ్మాయికి సీఎం కేసీఆర్ రూ.2కోట్ల నజరానా ప్రకటించారు. హైదరాబాద్‌కు చెందిన బుద్దా అరుణా రెడ్డి ప్రపంచ కప్‌లో కాంస్య పతకం సాధించిన తొలి భారతీయ మహిళగా చరిత్ర సృష్టించారు. దేశ ప్రతిష్టను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింపజేసిన ఆమె ఆదివారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశారు. సీఎం కేసీఆర్ ఆమెనుఈ సందర్భంగా అభినందించి, ఘనంగా సత్కరించారు. వెంటనే ఆమెకు ఈ నగదు ప్రోత్సాహం అందిస్తున్నట్లు ప్రకటించారు. ఆమె కోచ్ బ్రిజ్ కిషోర్‌కు కూడా సాయం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో క్రీడా శాఖ మంత్రి పద్మారావుగౌడ్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి, అరుణారెడ్డి తల్లి సుభద్రమ్మ, సోదరి పావనిలు పాల్గొన్నారు.



తడబడ్డారు

● ఇంగ్లండ్ మ్యాచ్1-1తో డ్రా ● అజ్లాషా హాకీ కప్



ఐపో: తొలి మ్యాచ్‌లో ఓటమి తర్వాత, పుంజుకునే అవకాశం వచ్చినా ఇండియా దాని ని చేజేతులా జారవిడిచింది. అజ్లాషా హాకీ టోర్నీ లో భాగంగా ఆదివారం ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో వరుస తపి ్పదాలు చేసింది. కచ్చి తంగా గెలిచే అవకాశం ఉన్న మ్యాచ్‌ను చివరకు 1-1తో డ్రా చేసుకుంది. తద్వారా ఆరు జట్లున్న పాయింట్ల పట్టికలో భారత్ నాలుగో స్థానంలో నిలిచింది. ప్రారంభ మ్యాచ్‌లో ఒలింపిక్ చాంపియన్ అర్జెంటీనా చేతిలో ఇండియా 2-3 తో పరాజయం పాలైంది. రెండో మ్యాచ్‌ను సానుకూల దృక్పథం తో ప్రారంభిం చింది. ఆట మొదలైన 14వ నిముషంలోనే యువ ఆటగా డు షిలానంద్ లర్కా చేసిన తొలి అంతర్జాతీయ గోల్‌తో ఇండియా స్కోర్ బోర్డుపై గోల్ నమోదైం ది. కొద్దిసేపటి తర్వాత తల్విందర్ సింగ్ షాట్‌ను ప్రత్యర్థి గోల్‌కీప ర్ గిబ్సన్ విజయ వంతంగా నిలువరించాడు. దీంతో మరో గోల్ సాధించే అవ కాశం చేజారింది. 48వ నిముషంలో లభించిన 9వ పెనాల్టీ కార్నర్‌ను కూడా గోల్‌గా చేయలేక పోయారు. అయినా 53వ నిముషం వరకు ఇండి యా ఆధిక్యంలో నిలిచింది. అయితే, ఇంగ్లండ్ ఆటగా డు మార్క్ గ్లెగ్‌హార్న్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి స్కోరును సమం చేశా డు. యువ కులు, సీనియర్ల మేళవింపుతో సమ తూకంగా ఉన్న సర్దార్ సింగ్ నాయ కత్వం లోని ఇండియా హాకీ జట్టు, ఈ మ్యాచ్‌లో పెనాల్టీ కార్న ర్లను గోల్స్‌గా మలచడంలో దారు ణంగా విఫలమైం ది. అందివ చ్చిన అవకాశాలను చేజార్చింది. ఖాళీల్లో దూసుకె ళ్లడంలో నెమ్మదిగా స్పందించిం ది. దీంతో ఇంగ్లండ్ ప్రత్యర్థిపై ఒత్తిడిని పెంచగ లిగింది. చివరి నిముషాల్లో గోల్ కోసం ఇరు జట్లు తీవ్రంగా శ్రమించాయి. విజయా నికి అవస రమై న గోల్ సాధించలేక పోయాయి. విశ్రాంతి అనం తరం రేపు ప్రపంచ నంబర్ వన్ ఆస్ట్రేలియాతో ఇండియా తలపడు తుంది. అదే సమయంలో ఇంగ్లండ్ జట్టు ఐర్లాండ్‌ను ఎదుర్కొంటుంది.

స్ప్రింట్‌కింగ్ కొలెమాన్

బర్మింగ్‌హామ్: 60 మీటర్ల పరుగు పందెంలో ప్రపంచ రికార్డు హోల్డర్ క్రిస్టియన్ కొలెమాన్ మరో రికార్డు నెలకొల్పాడు. 20 ఏళ్ల కిందట మౌరిస్ గ్రీనె నెలకొల్పిన రికార్డును గత నెలలో 6.34 సెకన్లతో తిరగరాశాడు. ఇప్పుడు బర్మింగ్‌హామ్‌లో జరిగిన ప్రపంచ అథ్లెట్ ఇండోర్ మీట్‌లో 6.03 సెకన్లతో తన రికార్డును తనే సవరించాడు. 22ఏళ్ల ఈ అమెరికా యువకుడు సరికొత్త స్ప్రింట్ కింగ్‌గా అవతరించాడు. బ్రిటన్‌లో జరిగిన ప్రపంచ అథ్లెట్స్ ఇండోర్ చాంపియన్‌షిప్‌లో చైనా అథ్లెట్ సు బింగ్‌టియాన్ (0.05), అమెరికా టీమ్మేట్ రొన్నీ బేక ర్ (0.07)ను అధిగమించాడు. ఈ సీజన్‌లో మరికొన్ని ఇండోర్ ప్రపంచ రికార్డులు మరుగునపడ్డాయి. పోల్‌వాల్ట్‌లో అమెరికన్ హారిస్సన్, షాట్‌పుట్‌లో న్యూజీలాండ్స్ థామస్ వాల్ష్‌కొత్త రికార్డులు నెలకొల్పారు.

నంబర్-1 ర్యాంకు లక్ష్యం

● ఆల్ ఇంగ్లండ్, కామన్వెల్త్ టోర్నీలే తక్షణ కర్తవ్యం
● ఇండియన్‌స్టార్ షట్లర్, తెలుగు తేజం పీవీ సింధు



హైదరాబాద్: బ్యాడ్మింటన్‌లో నంబర్‌వన్ ర్యాంకు చేరాలన్నదే తన లక్ష్యమని తెలుగు తేజం పీవీ సింధు స్పష్టంచేసింది. ఈ సీజన్‌లో రాబోయే టోర్నీల్లో మెరుగైన ప్రదర్శన చేస్తానన్న విశ్వాసం ఉందని ధీమా వ్యక్తంచేసింది. కిందటి వారం ప్రపంచ నంబర్ 2 ర్యాంకు చేరిన సింధు, టాప్ ర్యాంక్‌పై గురిపెట్టినట్లు చెబుతోంది. త్వరలో జరగబోయే ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్, కామన్వెల్త్ గేమ్స్‌పైనే దృష్టిసారించినట్లు చెప్పింది. ఈ రెండు టోర్నీల్లో మెరుగైన ఫలితం వస్తుందని ఆశాభావం వ్యక్తంచేసింది. పొరపాట్లను అధిగమించి అనుకున్న ఫలితాన్ని సాధించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పింది. ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఈనెల 14 నుంచి ప్రారంభం కానుంది. కామన్వెల్త్‌లో విజయం అనుకున్నంత సులువేం కాదు. దీనికోసం నేను కచ్చితంగా కష్టపడాల్సి ఉంటుంది. నా వంతు ప్రయత్నం చేస్తా. గెలుపుపై నమ్మకం ఉంది కానీ నూరుశాతం అని చెప్పలేను. ప్రతీమ్యాచ్‌లో నూరుశాతం కష్టపడతాం. ప్రస్తుతానికి శిక్షణ కార్యక్రమాలు బాగానే జరుగుతున్నాయి. ఒకసారి ఒక టోర్నమెంట్ మాత్రమే ఉండేలా ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నాను. తక్షణ కర్తవ్యం ఆల్ ఇంగ్లండ్ చాం పియన్ షిప్ నెగ్గడమేఆశావహ దృక్పథంతోనే ఉన్నాను అని సింధు వెల్లడిం చింది. ఆస్ట్రేలియా గోల్డ్‌కోస్ట్‌లో కామన్వెల్త్ టోర్నీ వచ్చేనెల 4నుంచి ప్రారంభం అవుతుం ది. కిందటిసారి స్కాట్‌లాండ్‌లోని గ్లాస్కోలో జరిగిన టోర్నీలో సింధు కాంస్య పతకం నెగ్గింది.

దినేశ్ కార్తీక్‌కు కెప్టెన్సీ పగ్గాలు



ముంబై: వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్ దినేశ్ కార్తీక్‌కు కోల్‌కతా నైట్ రైడర్స్ యాజమాన్యం కీలక బాధ్యతలు అప్పగించింది. ఐపీఎల్ సీజన్‌లో కెప్టెన్సీ పగ్గాలను కట్టబెడుతూ ఆదివారం ప్రకటన జారీచేసింది. రాబిన్ ఊతప్పను వైస్ కెప్టెన్‌గా నియమించింది. స్టార్‌స్పోర్ట్స్ 'నైట్ క్లబ్' షో సందర్భంగా కేకేఆర్ జట్టు ఎండీ, సీఈవో అయిన వెంకీ మైసూర్ ఈ విషయాన్ని వెల్లడించారు. అదే వేదికపై ఉన్న కార్తీక్ స్పందిస్తూ, సీనియర్లు, యువకుల సమ్మేళనంతో ఉన్న జట్టును సమర్థవంతంగా ముందుకు నడిపిస్తానని చెప్పాడు. 'కోల్‌కతాకు నాయకత్వం వహించడం గౌరవంగా భావిస్తాను. ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటైన కేకేఆర్‌ను, కొత్త సవాల్‌కు సిద్ధం చేస్తాను. టీమిండియా కెప్టెన్ విరాట్ తరహాలో సారథ్య బాధ్యతలు నిర్వర్తిస్తాను. మాటల కంటే చేతల్లోనే నా సమర్థతను చాటిచెబుతాను. ఆలోచనల్లోనే దూకుడు కట్టడిచేస్తాను. మైదానంలో స్వేచ్ఛగా, ప్రశాంతంగా ప్రణాళికలు అమలు చేయడంపైనే దృష్టిసారిస్తానని దినేశ్ కార్తీక్ ధీమా వ్యక్తంచేశాడు. 'ఇది కోల్‌కతా నైట్ రైడర్స్‌కు కొత్త శకం. దినేష్ కార్తీక్ వంటి అనుభవజ్ఞుడికి కెప్టెన్సీ అప్పగించడంలో ఎలాంటి సంకోచం లేదు. అతను సమర్థుడేనన్న విశ్వాసం ఉంది' అని వెంకీ మైసూర్ వ్యాఖ్యానించాడు. వైస్‌కెప్టెన్ రాబిన్ ఊతప్ప విషయానికొస్తే, అతను కోల్‌కతాకు 2014 నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఐపీఎల్ చాంపియన్ షిప్ నెగ్గడంలో అతను కీలకపాత్ర పోషించాడు. వీరిద్దరు జట్టుకు సారథులుగా ఉండటం అదృష్టంగా భావిస్తున్నాను అని మైసూర్ పేర్కొన్నాడు. కాగా, కేకేఆర్ తొలి మ్యాచ్‌ను ఏప్రిల్ 8న ఈడెన్ గార్డెన్‌లో ఆడనుంది.

కింగ్స్ పంజాబ్ బౌలింగ్ కోచ్‌గా వెంకటేశ్ ప్రసాద్

మొహాలి: వచ్చేనెల ప్రారంభం కానున్న ఐపీఎల్ సీజన్‌లో కింగ్స్ ఎలెవన్ పంజాబ్ జట్టుకు వెంకటేశ్ ప్రసాద్ బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించనున్నారు. ఐపీఎల్ 11వ సీజన్‌కు సహాయక సిబ్బందిని పంజాబ్ జట్టు ఖరారు చేసింది. టీమిండియా మాజీ పేసర్, జూనియర్ జట్టు సెలక్షన్ కమిటీ మాజీ చైర్మన్‌ను బౌలింగ్ కోచ్‌గా నియమిస్తున్నట్లు పంజాబ్ మేనేజ్‌మెంట్ ప్రకటించింది. ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ బ్రాడ్ హాగ్ జట్టుకు ప్రధాన కోచ్‌గా వ్యవహరిస్తారు. వీరేంద్ర సెహ్వాగ్ మెంటార్‌షిప్‌లో హాగ్ పంజాబ్ విజయాల్లో కీలకం అవుతాడన్న అంచనాలు ఉన్నాయి. అదేవిధంగా ఢిల్లీ ఆటగాడు మిథున్ మన్హాస్ సహాయకోచ్ పాత్ర పోషించనున్నాడు. '' వెంకటేశ్ ప్రసాద్‌తోపాటు చీఫ్ కోచ్‌గా విదేశీ వ్యక్తి ఉండటం మాకు కలిసొచ్చే అంశం. సీనియర్ల సమష్టి కృషి జట్టు విజయానికి బాటలు వేస్తుంది' అని సెహ్వాగ్ ఆశాభావం వ్యక్తంచేశాడు.

Vaccum Therapy లింగవర్ధక యంత్రం
లింగం చిన్నదని నిరాశ ఎందుకు?

అమెరికా ఏజెన్సీ FDA వారి అభిప్రాయం ప్రకారం Vaccum Therapy లింగవర్ధక యంత్రం మరియు ఔషధాల ద్వారా పురుషుడు తన చిన్న లింగాన్ని 75 రోజులలో 7 నుండి 8 అంగుళాల పొడవు, లావు, గట్టిగా, శక్తివంతంగా మరియు దృఢంగా చేసుకొనవచ్చును. మరియు తన ఇష్టానుసారం శృంగార సమయాన్ని పొడిగించుకోవచ్చును. శీఘ్రస్ఖలనం, నపుంసకత్వం, లింగము వదులుగా ఉండుట, చిన్నగా ఉండుట, సన్నగా ఉండుటను తొలగించుకోవడంకోసం 30 రోజుల ఔషధం.
☞ ఇంటి దగ్గరకే ఔషధం తెప్పించుకోండి
08943212076



Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.